వైసీపీ సభ్యుల బలంతో గడిచిన మూడేళ్లుగా కొనసాగిన ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం తొలిసారిగా టీడీపీ బలంతో విజయవంతమైంది. గతంలో టీడీపీ సభ్యులు ఆరుగురు ఉండగా, జనసేన నుంచి ఒకరు గెలుపొందారు. అయితే ఇటీవల ఎన్నికల సమయంలో ఐదుగురు, తాజాగా పదిహేను మంది వైసీపీ కార్పొరేటర్లు అధికార పార్టీలో చేరారు. దీంతో కార్పొరేషన్ పీఠం టీడీపీ కైవసం చేసుకుంది. ఎక్స్‌అఫిషియో సభ్యులుగా ఎంపీ మాగుంట, ఎమ్మెల్యేలు దామచర్ల, బీఎన్ ప్రమాణం చేశారు. దీంతో మొత్తం 27మంది టీడీపీ కార్పొరేటర్లు, ముగ్గురు ఎక్స్‌అఫిషియో సభ్యులతో 30కి చేరిన బలంతో జరిగిన తొలి సమావేశంలో పది అంశాలు అజెండాలో పొందుపరిచారు. అందులో ఒకటి మినహా అన్నింటినీ ఆమోదించారు.

- హైదరాబాద్‌కు తరలిన 20మంది కార్పొరేటర్లు
- వారి ఎత్తుగడ విఫలం.. 27మందితో సజావుగా మీటింగ్
- ఎక్స్‌అఫిషియో సభ్యులుగా ప్రమాణం చేసిన ఎమ్మెల్యేలు, ఎంపీ
- అందరి సహకారంతో ఒంగోలు అభివృద్ధి : ఎంపీ మాగుంట, ఎమ్మెల్యేలు దామచర్ల, బీఎన్



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ సుజాత

కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల, పక్కన ఎంపీ మాగుంట, బీఎన్, హాజరైన కార్పొరేటర్లు

కౌన్సిల్ సక్సెస్

తొలిసారి టీడీపీ బలంతో కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం

కోరం లేకుండా చేసేందుకు వైసీపీ నేతల ప్రయత్నం

ఒంగోలు (కార్పొరేషన్), సెప్టెంబరు 13 : టీడీపీ బలంతో మొదటిసారి జరిగిన ఒంగోలు కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం విజయవంతమైంది. ఏదో ఒక విధంగా సమావేశం జరగకుండా చూడాలన్న తలంపుతో వైసీపీ కార్పొరేటర్లు గైర్హాజరయ్యారు. కోరం లేకుండా చేసేందుకు వారు వేసిన ఎత్తుగడలు విఫలమయ్యాయి. శుక్రవారం సమావేశం జరుగుతుందని తెలియడంతో గురువారం రాత్రి వైసీపీ కార్పొరేటర్లందరూ హైదరాబాద్‌లోని మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి నివాసానికి చేరుకున్నారు. దీంతో సమావేశం జరగదని భావించిన వైసీపీ మూడింట రెండొంతుల సభ్యులు అనగా 36 మంది ఉంటేనే కౌన్సిల్ జరుగుతుందని అనుకున్నారు. అయితే నిబంధనల ప్రకారం మూడో వంతు సభ్యులు యాభై మందిలో 18మంది ఉంటే సరిపోతుందని కమిషనరు వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. అందుకు అనుగుణంగా మునిసిపల్ చట్టంలోని అంశాలను వివరించడంతో సమావేశం ఎలాంటి అడ్డంకులు లేకుండా కొనసాగింది. అజెండాలోని 8వ అంశమైన వైసీపీ ప్రభుత్వంలో జగనన్న ఇళ్ల పట్టాల పంపిణీ కోసం హద్దురాళ్లు, రోడ్ల నిర్మాణం తదితర పనులకు సంబంధించి రూ.21.33 కోట్ల బిల్లుల మంజూరుపై సమావేశంలో చర్చకు వచ్చింది. దీనిపై మరింత లోతుగా చర్చించాల్సి ఉందని సభ్యులు తెలిపారు. దీంతో ఆ అంశాన్ని వాయిదా వేశారు.

ఒంగోలును అగ్రస్థానంలో నిలబెట్టడమే లక్ష్యం

కార్పొరేటర్లు, కార్పొరేషన్ అధికారుల సహకారంతో ఒంగోలు నగరాన్ని అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలబెట్టడమే లక్ష్యమని స్థానిక శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఒంగోలు కార్పొరేషన్ పాలకవర్గం ఏర్పాటు అయిన తర్వాత టీడీపీ బలంతో జరిగిన కౌన్సిల్ సమావేశం మేయర్ గంగాడ సుజాత అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్ విజయ్‌కుమార్ ఎక్స్‌అఫిషియో సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం దామచర్ల మాట్లాడుతూ నగర అభివృద్ధి కోసం అవసరమై నిధులను ప్రభుత్వం నుంచి కోరుతామన్నారు. అలాగే సభ్యులంతా కలిసి అభివృద్ధి వైపు నడిచి, రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలబెట్టాలని కోరారు. తాను 2014 నుంచి ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ కౌన్సిల్ లేకపోవడంతో హాజరు కాలేకపోయాయని, అయితే కౌన్సిల్ ఏర్పడిన తర్వాత సమావేశానికి తొలిసారి రావడం సంతోషంగా ఉందన్నారు. ఎంపీ మాగుంట మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా ఒంగోలు ఎంపీగా ఉన్నానని, నగర అభివృద్ధిలో తనవంతు పాత్ర పోషించానన్నారు. భవిష్యత్‌లో కూడా సహకరిస్తానని తెలిపారు. బీఎన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ తన వంతుగా అవసరమైన నిధులు కేటాయించడంతోపాటు, నగర అభివృద్ధిలో భాగస్వామ్యమవుతానని తెలిపారు.

పారిశుధ్యం మెరుగుపరచాలి

నగరంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని కార్పొరేటర్లు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. గత వైసీపీ హయాంలో పారిశుధ్య కార్మికులుగా చేరిన కొందరు ఆపార్టీ కార్యకర్తలు పనిచేయకుండా మేస్త్రీలుగా కొన సాగుతున్నారని విమర్శించారు. మరికొందరు ఎక్కడ పనిచేస్తున్నారో తెలియదని తెలిపారు. ఇలా పనిచేయకుండా తిరుగుతున్న వారిని తొలగించాలని డిమాండ్ చేశారు. పారిశుధ్యం మెరుగు కోసం కొత్త వారిని నియమించి, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. సమావేశానికి డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, కార్పొరేటర్లు దాచర్ల వెంకట రమణయ్య, మలగా రమేష్, అంబూరి శ్రీనివాసరావు, పసుపులేటి విజయలక్ష్మి, వేమూరి భవానీ, గుట్లపల్లి మస్తానమ్మతోపాటు మొత్తం 27 మంది కార్పొరేటర్లు హాజరయ్యారు.

నామినేషన్ పనుల్లో అవినీతిపై విచారణ చేయాలి

నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో రూ.95లక్షలతో నామినేషన్ పద్ధతిన చేపట్టిన 10 పనుల్లో అవినీతిపై ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురించిన కథనంపై డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి ప్రశ్నించారు. 'పనులు పంచుకుతిన్నారు' కథనంలో పేర్కొన్న అంశాలు అనుమానాలకు తావిస్తున్నాయన్నారు. అత్యవసరం పేరుతో పనులు ఎలా చేపడతారన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక కమిటీతోపాటు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో విచారణ చేయించి అవినీతిని నిగ్గు తేల్చాలని బుజ్జి డిమాండ్ చేశారు.



ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనాన్ని చూపుతున్న డిప్యూటీ మేయర్ బుజ్జి

బాలినేనిని చేర్చుకోవద్దు

- అవినీతిని కప్పిపుచ్చుకునేందుకే పార్టీ మారే ప్రయత్నం
- సిట్‌ను వెంటనే పునరుద్ధరించాలి
- జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరెడ్డి

ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 13 : గత ఐదేళ్ల కాలంలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి చేసిన అవినీతి, అక్రమాలు బయటపడకుండా ఉండటానికే కూటమి పార్టీల్లో చేరేందుకు ప్రయత్నిస్తున్నారని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ఒక ప్రకటనలో ఆరోపించారు. బాలినేని అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేయాలని కోరారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిలు ఆలోచించాలన్నారు. బాలినేని గతంలో చేసిన అవినీతి, అక్రమాలను దృష్టిలో పెట్టుకొని వారి పార్టీల్లో చేర్చుకోవద్దని కోరారు. బాలినేని అనుచరులు భూకబ్జాలు చేయడమే కాకుండా దొంగ రిజిస్ట్రేషన్లతో ఒంగోలు నగరంలో భయానక వాతావరణాన్ని సృష్టించారన్నారు. వీటి పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన సిట్‌ను పునరుద్ధరించి దర్యాప్తును వేగవంతం చేసి నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. బాలినేని బంధువు నిర్మిస్తున్న విల్లాల లెవలింగ్ కోసం అక్రమంగా కోట్లాది రూపాయల గ్రావెల్ తరలించడం, వాటి నిర్మాణంలో వాగుపోరంబోకును కలుపుకోవడంపై దర్యాప్తు చేయాలన్నారు. ఎలాంటి వ్యాపారాలు, పరిశ్రమలు లేకుండా వందలాది కోట్లు రాజకీయాల్లో ఎలా సంపాదించారో బాలినేని బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు.



ఏడాదిపాటు ఆస్పత్రిలో పనిచేయాలి

అర్ధవీడు హత్యకేసులో బాలుడికి శిక్ష విధించిన ఒంగోలు జువైనల్ కోర్టు

కంభం/ఒంగోలు (క్రైం), సెప్టెంబరు 13 : చెప్పిన మాట వినలేదన్న కోపంతో ఇంటర్ చదువుతున్న బాలుడు ఇదే గ్రామానికి చెందిన 7వ తరగతి విద్యార్థిపై పెట్రోల్ పోసి హత్య చేశాడు. ఈ నేరానికి ఆ మైనర్ బాలుడికి మూడేళ్ల శిక్ష విధించగా అందులో ఏడాదిపాటు ఏదైనా ప్రభుత్వ ఆసుపత్రిలో కమ్యూనిటీ సర్వీస్ చేయాలని ఒంగోలు జువైనల్ కోర్టు చైర్మన్, ప్రిన్సిపల్ మేజిస్ట్రేట్ బి.భానుసాయి శుక్రవారం తీర్పు ఇచ్చారు. వివరాల్లోకి వెళితే.. 2018 జూలై 7న అర్ధవీడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న బాలుడిని పక్కనే జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న విద్యార్థి తన కళాశాలలో చదువుతున్న బాలికకు ప్రేమలేఖ ఇవ్వాలని కోరాడు. దానికి నిరాకరించిన బాలుడిపై ప్రభుత్వ పాఠశాలలోని భవనంలో పెట్రోల్ పోసి నిప్పు అంటించాడు. చికిత్స పొందుతూ జూలై 13న బాలుడు మృతిచెందాడు. అప్పటి అర్ధవీడు ఎస్సై రవీంద్రరెడ్డి కేసు నమోదు చేయగా మార్కాపురం సీఐ భీమానాయక్ కేసు దర్యాప్తు చేసి కోర్టులో హాజరుపరిచారు. సీనియర్ ఏపీపీ కె.కళావతి ప్రాసిక్యూషన్ తరఫున ఎస్పీ మార్గదర్శకత్వంలో సరైన సాక్షాధారాలతో బాలుడిపై నేర నిరూపణ చేశారు. దీంతో శుక్రవారం ఒంగోలులోని జువైనల్ జస్టిస్ కోర్టు చైర్మన్ భానుసాయి బాలుడికి మూడేళ్ల శిక్ష విధించి ఆ కాలవ్యవధిలో ఒక సంవత్సరం ఏదైనా ప్రభుత్వ ఆసుపత్రిలో కమ్యూనిటీ సర్వీస్ చేయాలని తీర్పునిచ్చారు.



మద్దిపాడులో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

పడకేసిన పారిశుధ్యం

- వ్యాధులు ప్రబలుతున్నా పట్టించుకోని దుస్థితి
- ఇటీవల కురిసిన వర్షాలతో దుర్గంధం
- నిధుల కొరతే కారణమంటున్న పంచాయతీ పాలకవర్గాలు

ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 13 : గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉన్నా పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడ పేరుకుపోయింది. ఇటీవల కురిసిన వర్షానికి అది మొత్తం తడిసిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. పారిశుధ్యం మెరుగుపర్చాల్సిన పంచాయతీ పాలకవర్గాలు, కార్యదర్శులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

ప్రబలుతున్న వ్యాధులు

ఇటీవల వర్షాలు కురవడంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. విషజ్వరాలతో చిన్నారుల నుంచి పెద్దల వరకూ అల్లాడుతున్నారు. ప్రజానీకం వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు గ్రామాల్లో చెత్తను తొలగించడంతోపాటు మురుగునీటిని బయటకు పంపి బ్లీచింగ్ చల్లాలని ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదు. ఇంకోవైపు ప్రభుత్వం ఇటీవల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో తాము అక్కడ ఉండం కదా? అన్న ఉద్దేశంతో పంచాయతీ కార్యదర్శులు చేతులెత్తేశారు. ఇప్పుడు అప్పులు చేసి పనులు చేపడితే తాము ఇక్కడి నుంచి బదిలీ అయ్యి వెళ్తే ఆ బిల్లులు వచ్చే పరిస్థితి లేదన్న కారణంతో కూడా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

నిధులున్నా వినియోగించుకోలేని పరిస్థితి

ఇటీవల కేంద్రప్రభుత్వం ఆర్థికసంఘం నిధులను రూ.40కోట్ల వరకు మంజూరు చేసింది. వాటిని పంచాయతీ అకౌంట్లకు జమ చేసింది. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏళ్ల తరబడి పలు రకాల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో వాటిని ఎం.బుక్ చేసుకొని నిధులు డ్రా చేసుకునే పనిలో పంచాయతీ పాలకవర్గాలు పడ్డాయి. ఇప్పుడు మరలా పారిశుధ్యం కోసం అప్పులు చేసి పనులు చేపడితే ఈ బిల్లులు ఎప్పుడు వస్తాయో తెలియదు. దీంతో ఎవరూ ముందుకు రావడం లేదు. అత్యవసర పనులు చేసుకునేందుకు ఆర్థికసంఘం నిధులు వినియోగించు కోవచ్చు. కానీ ప్రభుత్వం ఈ నిధులను వినియోగించుకునేందుకు మార్గదర్శకాలు జారీ చేయకపోవడంతో గ్రామాల్లో పారిశుధ్య పనులు ముందుకు సాగడం లేదు.

ఇంకా అదే దౌర్జన్యం!

- టీడీపీకి ఓటేశారని రోడ్డును మూసేశారు
- బీసీ కాలనీలో వైసీపీ నాయకుల చిచ్చు
- వారికే వత్తాసు పలుకుతున్న రెవెన్యూ అధికారులు
- ప్రైవేటు వ్యక్తి స్థలం అంటూ స్పష్టం
- దారి మూతతో ఇబ్బందిపడుతున్న కాలనీవాసులు

మార్కాపురం, సెప్టెంబరు 13: ప్రతి పేదవానికి కూడు, గూడు, దుస్తులు కల్పించాలనే నినాదంతో 1983లో ప్రజల ఆదరణతో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటైంది. అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్ ఆశయం మేరకు మండల కేంద్రమైన తర్లుపాడులో సుమారు 6 ఎకరాల్లో 100 బీసీ కుటుంబాలకు లేఅవుట్ ఏర్పాటు చేసి ఇళ్లు నిర్మించి ఇచ్చారు. అప్పట్లో ప్రైవేటు వ్యక్తుల వద్ద భూమిని కొనుగోలు చేసి మరీ బీసీ కాలనీ నిర్మించారు. సుమారు 40 సంవత్సరాలుగా అక్కడ నివాసముంటున్న వారిలో కొందరికి ఇప్పుడు కొత్త చిక్కు వచ్చిపడింది. సార్వత్రిక ఎన్నికల్లో కొందరు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఆయా కుటుంబాలపై కక్ష పెంచుకున్న వైసీపీ నాయకులు ఎలాగైనా వారికి ఇబ్బందులు సృష్టించాలని పన్నాగం పన్నారు. కాలనీకి ఆనుకుని స్థలం ఉన్న ఓ వైసీపీ వర్గీయుడిని రెచ్చగొట్టి రహదారిని కర్రలు కట్టి మూసేయించారు. దీంతో బాధితులు లబోదిబోమంటూ రెవెన్యూ అధికారుల వద్దకు పరుగెత్తారు. వైసీపీ ప్రభుత్వంలో పోస్టింగులు పొందిన రెవెన్యూ సిబ్బంది కొలతలు వేసి ప్రైవేటు వ్యక్తి స్థలంలో కొంతమేర ఇళ్లు ఉన్నట్లు నిర్ధారించారు. నాలుగు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన రహదారిని ఇప్పుడెలా మూసేస్తారని ప్రశ్నిస్తే రెవెన్యూ అధికారుల వద్ద జవాబు లేదు.

ఓట్లు వేశారని కక్ష సాధింపు

మండల కేంద్రమైన తర్లుపాడులోని సర్వే నంబర్ 388/2ఏలో 6 ఎకరాలు, 388/2బీలో 71 సెంట్ల భూమిలో 1983లో బీసీ సామాజికవర్గానికి చెందిన 100 కుటుంబాలకు ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇచ్చింది. కాలక్రమంలో కొందరు ఇళ్లు ఇతరులకు అమ్ముకు న్నారు. ఎక్కువ మంది గత 40 ఏళ్లగా కాలనీలోనే నివస్తున్నారు. మొదట్లో టీడీపీకి కంచుకోటగా ఉన్న బీసీ కాలనీ కాలక్రమంలో కాంగ్రెస్ పార్టీకి, అనంతరం వైసీపీకి అనుకూలంగా మారింది. సార్వత్రిక ఎన్నికల సమయంలో టీడీపీలోకి కొందరు చేరారు. దీంతో కక్ష పెంచుకున్న మండల కేంద్రానికి చెందిన వైసీపీ నాయ కులు టీడీపీలో చేరిన వారిని ఎలాగైనా ఇబ్బందులు పెట్టాలని యోచించారు. కాలనీకి ఆనుకుని 388/3బి సర్వే నెంబర్‌లో 44 సెంట్ల స్థలం ఉన్న వైసీపీ కార్యకర్త గోగు యల్లయ్యను పావుగా వాడుకున్నారు. వాస్తవానికి ఆ స్థలం యల్లయ్య మామ వన్నెబోయిన గురవయ్య పసుపుకుంకుమ కింద కుమార్తె గాలెమ్మకు ఇచ్చారు. 44 సెంట్ల స్థలంలో 20 సెంట్లు అమ్ముకోగా మిగిలినది బీసీ కాలనీ లేఅవుట్‌లో కలిసిపోయింది. ఈ విషయమై గోగు గాలెమ్మ పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా అధికారులు ఆ స్థలం లేఅవుట్‌లో కలసిపోయిందని స్పష్టంగా తెలియజేశారు. కానీ గత వైసీపీ ప్రభుత్వంలో మళ్లీ ఈ స్థల వివాదాన్ని బయటకు తీసిన నాయకులు వారికి అనుకూలంగా మలుచుకుంటు న్నారు. ప్రస్తుతం కాలనీలోని కొందరు టీడీపీకి మద్దతు తెలిపి ఓట్లు వేయడంతో మళ్లీ వివాదానికి నాయకులు ఆజ్యం పోశారు. 388/3బి సర్వే నెంబర్‌లోని స్థలానికి చెందిన వారిని రెచ్చగొట్టి రహదారికి అడ్డంగా కర్రలతో కంచె ఏర్పాటు చేసి మూసివేశారు. ఆ ప్రాంతంలో ప్రభుత్వ నిధులతో సీసీ రహదారులు, మురుగు కాలువలు నిర్మించినా వైసీపీ నాయకులు అడ్డగోలుగా ఒకే సామాజికవర్గానికి చెందిన వాళ్ల మధ్య చిచ్చుపెట్టి చోద్యం చూస్తున్నారు.

కొమ్ముకాస్తున్న రెవెన్యూ అధికారులు

బీసీ కాలనీకి ఆనుకుని ఉన్న సర్వే నంబర్‌లో జరుగుతున్న వివాదం మొత్తం రెవెన్యూ అధికారులకు తెలుసు. ముఖ్యంగా గతంలో పనిచేసిన తహసీల్దార్ చంద్రలీల 2017లో స్పష్టంగా 388/3బీ సర్వే నంబర్‌లోని 44 సెంట్లలో 20 సెంట్ల మేర 1983లో 388/2ఏ సర్వే నెంబర్‌లో ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో కలిసిపోయినట్లు ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు. అప్పట్లో వచ్చిన ఫిర్యాదులకు అనుగుణంగా విచారించి అర్జీదారులకు విషయాన్ని తెలియజేశారు. కానీ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇక్కడకు వచ్చిన రెవెన్యూ సిబ్బంది, అధికారులు పాత సమస్యను మళ్లీ తెరపైకి తెచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినా ఇంకా బదిలీ కాకుండా ఇక్కడే ఉన్న గ్రామస్థాయి రెవెన్యూ సిబ్బంది వలనే వివాదం మళ్లీ రాజుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



బీసీ కాలనీలో కర్రలతో మూసేసిన రోడ్డు

భూవివాదాలు

- ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని వైనం
- గత వైసీపీ ప్రభుత్వంలో అధికారుల తీరుతో జటిలం
- రికార్డులు తారుమారు చేసినట్లు ఆరోపణలు

దర్శి, సెప్టెంబరు 13 : దర్శి ప్రాంతంలో ఏళ్ల తరబడి భూములు, స్థలాల వివాదాలు పరిష్కారానికి నోచుకోవడంలేదు. దీంతో నిజమైన హక్కుదారులు ఇబ్బందులు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొంతమంది వ్యవహరించిన అనుచిత వైఖరి భూ యజమానులకు ఇబ్బందికరంగా మారింది. అప్పటి అధికారులు చేసిన పాపాలు బాధితుల పాలిట శాపాలుగా మారాయి. అధికారులు ముడుపులు తీసుకొని రికార్డులు కూడా ట్యాంపరింగ్ చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఎంతో విలువైన స్థలాలు, భూముల వివాదాల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ సంవత్సరాల తరబడి తిరిగినా పరిష్కారంకాక కొంతమంది కోర్టులను కూడా ఆశ్రయించారు.

సమస్యను తీవ్రంచేసిన వైసీపీ నాయకులు

దర్శి పట్టణంలోని కురిచేడు రోడ్డులో రూ.2కోట్ల విలువైన పది సెంట్ల స్థలానికి సంబంధించిన వివాదం ఏళ్ల తరబడి కొనసాగుతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో అది మరింత జటిలమైంది. కొంతమంది వైసీపీ నాయకులు ఆ వివాదంలో చొరబడి సమస్యను తీవ్రం చేశారు. ఒక వ్యక్తి 15సంవత్సరాల క్రితం ఆ స్థల హక్కుదారుల నుంచి కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించున్నారు. అయితే అదే స్థలాన్ని పూర్వీకుల ద్వారా హక్కు ఉందని మూడేళ్ల క్రితం మరొకరు రిజిస్టర్ చేయించుకున్నారు. రెండోసారి చేయించుకున్న వారు పంచాయితీలో భాగంగా వైసీపీ నాయకులు కావడం గమనార్హం. ఈ వివాదంపై గత ప్రభుత్వ హయాంలో అప్పటి కనిగిరి ఆర్డీవో జాన్‌ఇర్విన్‌ను విచారణ అధికారిగా నియమించారు. ఆయన స్థలాన్ని పరిశీలించి వెళ్లి రెండు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఇంతవరకూ పరిష్కారానికి నోచుకోలేదు.

హద్దుల విషయంలో వివాదం

దర్శి-కురిచేడు రోడ్డులో మరో స్థలం హద్దుల విషయంలో ఇద్దరి మధ్య ఏళ్ల తరబడి వివాదం కొనసాగుతోంది. ఆ స్థలం తొలుత పూర్వీకుల హయాంలో సమాన భాగాలైంది. ఆతర్వాత కొనుగోలు చేసిన వారిలో ఒక వ్యక్తి దర్శి-కురిచేడు ప్రధాన రహదారి వైపు ఎక్కువ స్థలాన్ని ఆక్రమించుకున్నాడు. తనకు చేసిన రిజిస్ట్రేషన్‌లో కొలతల ప్రకారం స్థలానికి హద్దులు ఏర్పాటు చేసుకున్నట్లు చెబుతున్నాడు. ఆ స్థలం పక్కన అందులో భాగమైన స్థలాన్ని కొనుగోలు చేసిన వారికి ప్రధాన రహదారి వైపు వెడల్పు తగ్గిపోయింది. దీంతో స్థలం విలువ తగ్గిపోవడంతో వివాదం ఏర్పడింది. ఈక్రమంలో వైసీపీకి చెందిన కొందరు పెద్దలు ఆ స్థలం వివాదాన్ని పరిష్కరిస్తామని రంగంలోకి దిగారు. ఒక వ్యక్తికి చెందిన స్థలాన్ని వారే కొనుగోలు చేసి అగ్రిమెంట్ కూడా రాసుకున్నారు. ఈ వివాదం కూడా నేటికీ పరిష్కారం కాలేదు.



దర్శి-కురిచేడు రోడ్డులోని వివాదాస్పద స్థలం

మరికొన్ని గ్రామాల్లో..

రాజంపల్లిలో ఒక స్థలం వివాదం ఏళ్ల తరబడి కొనసాగుతోంది. ఇక్కడ ఇరువర్గాలు తమకంటే తమకు హక్కు ఉందని రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఆ స్థలం విషయంలో ఒక వీఆర్వోపై కేసు కూడా నమోదైంది. అలాగే, బొట్లపాలెంలో ఒక స్థలం వివాద పరిష్కారం కోసం ఏళ్ల తరబడి బాధితుడు తిరుగుతున్నాడు. ఇప్పటివరకూ ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదు.

కూటమి ప్రభుత్వం రాకతో ఆశలు

కూటమి ప్రభుత్వం రాకతో భూములు, స్థలాల సమస్యలు పరిష్కారమవుతాయని సంబంధిత వ్యక్తులు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో పనిచేసిన అధికారులు బదిలీలపై వెళ్లారు. కొత్తగా వచ్చిన వారు తమకు న్యాయం చేస్తారనే నమ్మకంతో మళ్లీ తమవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే కొంతమంది న్యాయం కోసం కోర్టును ఆశ్రయించారు. తీవ్రంగా మారిన భూములు, స్థలాల వివాదాలను తాజాగా వచ్చిన అధికారులు పరిష్కరించి న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

బాలినేని, ఆయన వియ్యంకుడి అక్రమాలపై
సమగ్ర విచారణ చేయాలి

అనంతవరంలో భూముల ఆక్రమణ ● ఒకరిని హత్య చేసేందుకు కుట్ర

టీడీపీ నాయకుడు అశోక్ ధ్వజం

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 13 : మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆయన వియ్యంకుడు భాస్కర్‌రెడ్డిల అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేయాలని తెలుగుదేశం పార్టీ నాయకుడు చెంగలశెట్టి అశోక్ డిమాండ్ చేశారు. ఒంగోలులోని కాపు కళ్యాణ మండపంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాలినేని శ్రీనివాసరెడ్డికి భాస్కర్‌రెడ్డి వియ్యంకుడు కాకముందు నుంచే సత్సంబంధాలు ఉన్నాయన్నారు. 2008 నుంచే వారి అవినీతి, అక్రమాలకు బీజం పడిందని ఆరోపించారు. బాలినేని అధికారాన్ని అడ్డం పెట్టుకొని అక్రమంగా రూ.కోట్లు సంపాదించారన్నారు. టంగుటూరు మండలం అనంతవరం గ్రామంలో ముందుగా 52సెంట్ల భూమిని కొనుగోలు చేసి ఆ తర్వాత అధికారాన్ని అడ్డుపెట్టుకొని భూములను ఆక్రమించారని ఆరోపించారు. తన బినామీల పేర్లతో అక్రమంగా ఆన్‌లైన్ చేసుకున్నారన్నారు. ఆ భూములతో పాటు బకింగ్‌హామ్ కెనాల్‌కు సంబంధించిన భూములను కూడా ఆక్రమించుకున్నారని, ఈ విషయాలపై తానేమి ఊరికే మాట్లాడటం లేదని, తన వద్ద అందుకు సంబంధించిన డాక్యుమెంట్లు అన్నీ ఉన్నాయని స్పష్టం చేశారు. అయితే బాలినేని మాత్రం తాను నీతి, నిజాయితీపరుడని మాట్లాడటం విచిత్రంగా ఉందని, తాను చేసిన అక్రమాలు జిల్లా ప్రజలకు చెప్పి క్షమాపణ అడగాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసేందుకు లేఖ రాయడం హాస్యాస్పదంగా ఉందని, బాలినేని తాను చేసిన అక్రమాలన్నింటినీ సీఎంకు చెప్తారా అని ప్రశ్నించారు. ఒంగోలులో బాలినేని, ఆయన వియ్యంకుడు కలిసి ఒకరిని హత్య చేసేందుకు కుట్ర పన్నారని ఆరోపించారు. ఆ వ్యక్తిని త్వరలో జిల్లా ఎస్పీ వద్దకు తీసుకెళ్ళనున్నట్లు తెలిపారు. బాలినేని వియ్యంకుడు భాస్కర్‌రెడ్డిని పోలీసులు బైండోవర్ చేయాలని అశోక్ డిమాండ్ చేశారు.

27న సమ్మెను విజయవంతం చేయాలి


యూనియన్ బ్యాంకు ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 13 : బ్యాంకు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 27న జరిగే సమ్మెను విజయవంతం చేయాలని ఆల్ ఇండియా యూనియన్ బ్యాంకు ఆఫీసర్స్ ఫెడరేషన్, ఆల్ ఇండియా యూనియన్ బ్యాంకు ఎంప్లాయీస్ అసోసియేషన్ పిలుపునిచ్చాయి. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ఒంగోలులోని యూనియన్ బ్యాంకు రీజనల్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్యాంకులో సిబ్బంది కొరతను తీర్చకుండా యాజమాన్యం అనుసరిస్తున్న విధానాలు దారుణంగా ఉన్నాయన్నారు. ఆయా సమస్యలపై జరిగే సమ్మెలో బ్యాంకు ఉద్యోగులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయా యూనియన్ నాయకులు రాజేష్‌ఖన్నా, రాజీవ్‌రతన్‌దేవ్, రవిప్రకాష్, కిషోర్, నాగార్జునరెడ్డి, దుర్గారావు, సురేష్, దుర్గాప్రసాద్, కరుణాకరరావు, చిరంజీవి, పావని, సందీప తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా మేము సైతం..

విరాళాలు ఇచ్చేందుకు ముందుకు వస్తున్న దాతలు ● ఎమ్మెల్యేలు దామచర్ల, విజయ్‌కుమార్‌లకు పలువురు చెక్కులు అందజేత


ఎమ్మెల్యే దామచర్లకు చెక్కును అందజేస్తున్న డాక్టర్ వాసుదేవరావు


ఎమ్మెల్యే బీఎన్‌కు చెక్కును అందజేసిన గ్రానైట్ ఫ్యాక్టరీ అసోసియేషన్ నాయకులు

ఒంగోలు(కార్పొరేషన్), సెప్టెంబరు 13 : విజయవాడ వరద బాధితుల కోసం దాతలు తమ దాతృత్వం చాటుతున్నారు. ఈ మేరకు ఒంగోలులోని కేవీ నర్సింగ్‌హోమ్ ఆధ్వర్యంలో డాక్టర్ కొమ్మాలపాటి వాసుదేవరావు ముఖ్యమంత్రి నిధికి రూ.లక్ష చెక్కును ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను కలిసి అందజేశారు. అలాగే భాగ్యనగర్ పార్కు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.లక్ష


కలెక్టర్ అన్సారియాకు చెక్కును అందజేసి మొక్కను ఇస్తున్న బిల్డర్స్ అసోసియేషన్

చెక్కును అధ్యక్షులు వెంకటేశ్వరరావు, సాంబశివరావు, ప్రసాద్ ఎమ్మెల్యేకు అందజేశారు. క్రెడాయ్ ఒంగోలు బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దామచర్లకు రూ.3లక్షలు ఇవ్వగా, అలాగే రూ.60 వేలను కలెక్టర్ తమీమ్ అన్సారీయాకు అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు గొర్రెపాటి రాజేంద్ర, చైర్మన్ ఎన్.రఘురామయ్య, వైస్ ప్రెసిడెంట్ సీహెచ్.హరిప్రసాద్, సెక్రటరీ కె.ప్రసన్నాంజనేయులు, కోశాధికారి ఎం.తిరుమల, జాయింట్ సెక్రటరీ సీహెచ్.రాఘవరెడ్డి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మాంటిస్సోరి విరాళం రూ.1.50లక్షలు

ఒంగోలు(విద్య): వరద బాధితుల కోసం ఒంగోలులోని మాంటిస్సోరి హైస్కూలు యాజమాన్యం, విద్యార్థులు, ఉపాధ్యాయులు ముందుకు వచ్చారు. వారు సేకరించిన రూ.1.50 లక్షల విరాళాన్ని శుక్రవారం ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు కరస్పాండెంట్ ప్రకాష్ అందజేశారు. కార్యక్రమంలో మాజీ మునిసిపల్ చైర్మన్ మంత్రి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చీమకుర్తి నుంచి విరాళాల వెల్లువ

చీమకుర్తి : విజయవాడ వరద బాధితులకు బాసటగా నిలిచేందుకు చీమకుర్తి నుంచి దాతలు బారులు తీరుతున్నారు. ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పిలుపునకు స్పందించి విరాళాలు అందజేస్తున్నారు. కాగా చీమకుర్తి, బూదవాడ, కంభంపాడు కటింగ్ అండ్ పాలిషింగ్ యూనిట్ల ఓనర్ల అసోసియేషన్ నాయకులు తమవంతుగా రూ.3లక్షల చెక్కును శుక్రవారం ఒంగోలులో ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్‌కు అందజేశారు. అదేవిధంగా చీమకుర్తి పట్టణ టీడీపీ తరఫున రూ.3.31లక్షలను బీఎన్‌కు అందించారు. అలాగే చీమకుర్తి టీడీపీ నాయకులు కందిమళ్ల గంగాధరరావు, గొల్లపూడి కోటేశ్వరరావు, గోరంట్ల చెన్నయ్య రూ.50వేలను, ఫ్యాక్టరీ ఓనర్ల అసోసియేషన్ నాయకులు రూ.50వేల నగదును, లారీ ఓనర్ల అసోసియేషన్ నాయకులు రూ.50వేలను ఎమ్మెల్యేకు అందజేశారు. వారందరికీ విజయ్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమల్లో గ్రానైట్ అసోసియేషన్ నాయకులు కాట్రగడ్డ రమణయ్య, నూకల సురేంద్ర, అహ్మద్‌బాష, యర్రగుంట్ల శ్రీనివాసరావు, లగడపాటి శ్రీనివాసరావు, మలినేని వెంకటేశ్వర్లు, రఫీ, మస్తాన్‌రెడ్డి, రాము, భవానీప్రసాద్, పి.సురేష్, రామారావు, ఫణీంద్ర, శ్రీను, కృష్ణ, ప్రసాదు, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు మండలం నుంచి..


చెక్కును అందజేస్తున్న ప్రేమ్‌చంద్, నాయకులు

నాగులుప్పల పాడు: విజయవాడ వరద బాధితుల కోసం పలువురు టీడీపీ నాయకులు ముందుకు వచ్చారు. ఈ దుమూడి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు విరాళాలను సేకరించారు. పార్టీ మాజీ గ్రామ అధ్యక్షుడు ఆళ్ల ప్రేమ్‌చంద్ ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికి తిరిగి సేకరించిన రూ.55,555 లను శుక్రవారం ఒంగోలులో ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో బాచిన అశోక్‌బాబు, కొండ్రగుంట దిలీప్, కొమ్మూరి రవి, మరియదాసు, కొండయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సంధ్య ఆక్వా అధినేత రూ.కోటి అందజేత

ఈదుమూడి గ్రామానికి చెందిన సంధ్య ఆక్వా సంస్థ అధినేత కూనం వీరభద్రరావు, కృష్ణవేణి దంపతులు వరద బాధితుల కోసం రూ.కోటి చెక్‌ను ఎమ్మెల్యే బీఎన్ చేతుల మీదుగా సీఎం సహాయనిధికి అందజేశారు

మాజీ జడ్పీ చైర్మన్‌ఆధ్వర్యంలో..

నాగులుప్పలపాడుకు చెందిన టీడీపీ నేత, మాజీ జడ్పీ చైర్మన్ మారెళ్ల వెంకటశేషయ్య ఆధ్వర్యంలో రూ.1,10,000 చెక్‌ను శుక్రవారం ఒంగోలులో ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌ను కలిసి అందజేశారు. కార్యక్రమంలో మారెళ్ల కిరణ్ కుమార్, ఓబన్నపాలెం సర్పంచ్ పోలినేని వెంకటేశ్వర్లు, పోలినేని చలపతిరావు, మండవ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి నాయకుల విరాళం


చెక్కును అందజేస్తున్న నాయకులు

ఉప్పుగుండూరు టీడీపీ కూటమి నాయకులు గ్రామంలో సేకరించిన రూ.2లక్షల విరాళాల చెక్కును ఎమ్మెల్యే బీఎన్‌కు ఒంగోలులో అందజేశారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి కాకర్ల లక్ష్మీవరప్రసాద్, గుమ్మడి సాయిబాబు, పెండ్యాల కోటేశ్వరరావు, కనగాల కోటేశ్వరరావు, పెండ్యాల శ్రీనివాసరావు, టి.జాన్సన్, మసిముక్కు భాస్కర్, నాగేమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మహిళా నేత విరాళం


ఎమ్మెల్యే బీఎన్‌కు నగదును అందిస్తున్న మాధవి

సంతనూతలపాడు, సెప్టెంబరు 13: సంతనూతలపాడుకు చెందిన టీడీపీ మహిళ నాయకురాలు నార్నే మాధవి విజయవాడ వరద బాధితులకు విరాళంగా రూ.10వేల నగదును శుక్రవారం ఒంగోలులో ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్‌ను కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపదలో ఉన్న తోటివారికి సాయం అందించేందుకు ముందుకురావడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు ప్రత్యేక యాప్

మద్దిపాడు, సెప్టెంబరు 13: ఉపాధి హామీ కూలీలు తమ కూలి డబ్బులు ఖాతాలో జమ అయ్యాయో లేదో తెలుసుకోవడానికి ప్రస్తుతం అనేక ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంకులు, తపాలా కార్యాలయానికి వెళ్లి ఆరా తీయాల్సివస్తుంది. వారి ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం జన్‌మన్ రేగా యాప్ అందుబాటులోకి తెచ్చింది. దీని ద్వారా కూలీలకు సంబంధించిన సమగ్ర వివరాలు సులభంగా తెలుసుకునే వెసులుబాటు కలుగుతుంది. ప్లేస్టోర్ నుంచి యాప్‌ను డౌన్లోడ్ చేసుకుని ఇందులో వర్క్ అటెండెన్స్ పేమెంట్ ఆప్షన్‌పై క్లిక్ చేసి రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామపంచాయతీ, ఉపాధి జాబ్ కార్డ్ సంఖ్య నమోదు చేయాలి. దీంట్లో వారు పనిచేసిన రోజులు, జమ అయిన మొత్తం కనిపిస్తుంది. ఒకవేళ జమ కాకపోతే కారణాలు తెలుపుతుంది. దీనిపై ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్నట్లు మండల ఏఈ కిరణ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

సేవా కార్యక్రమాలతో సంతృప్తి


నగదును అందజేస్తున్న శిద్దా దంపతులు

చీమకుర్తి, సెప్టెంబరు 13 : సేవా కార్యక్రమాల నిర్వహణ తమకు ఎంతో సంతృప్తిని కలిగిస్తుందని మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, సతీమణి లక్ష్మీపద్మావతి పేర్కొన్నారు. చీమకుర్తిలోని హరిహరక్షేత్రంలో శిద్దా లక్ష్మీపద్మావతి జన్మదిన వేడుకలు గోల్డెన్ గ్రానైట్ మేనేజర్ గిరి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా హాస్టల్ విద్యార్థులకు కాస్మటిక్ కిట్స్, ప్రభుత్వపాఠశాల విద్యార్థుల మధ్యాహ్నభోజనానికి గ్యాస్ నిమిత్తం సంవత్సర ఖర్చును మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో కాట్రగడ్డ రమణయ్య, ఆర్యవైశ్య వాసవి సేవాదళ్‌కు చెందిన సభ్యులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళం అందజేత

ఒంగోలు(కల్చరల్), సెప్టెంబరు 13: శ్రీఅభయ సేవ ఫౌండేషన్, శ్రీఅభయ కళారాధన సాంస్కృతిక సేవాసమితి ఆధ్వర్యంలో వరద బాధితుల సహాయార్థం సేకరించిన రూ.21,500 విరాళాన్ని సంస్థ అధ్యక్షుడు డాక్టర్ మద్దాళి మాధవరావు శుక్రవారం చీమకుర్తి తహసీల్దార్ బ్రహ్మయ్యకు అందజేశారు. వీఆర్వో రామారావు, సుధీర్‌కుమార్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

22న వారాహి మహా రథయాత్ర

ఒంగోలు(కల్చరల్), సెప్టెంబరు 13: ఒంగోలు నగరంలో ఈ నెల 22వ తేదీన వారాహి అమ్మవారి మహారథ యాత్ర, యాగం నిర్వహిస్తున్నట్లు తిరుచానూరుకు చెందిన శ్రీఆదివారాహి శక్తి టెంపుల్ ట్రస్ట్ శ్రీమహారుద్రస్వామీజీ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంసీఏభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం స్వామీజీ మాట్లాడుతూ వారాహి అమ్మవారు కోరిన వరాలు ఇచ్చే దేవత అన్నారు. బలహీనుల దగ్గరకు భగవంతుడు అనే ఆశయంతో ఈ వారాహి యాత్రను తొలివిడతగా ఆంధ్రప్రదేశ్‌లోని ఏడు నగరాలలో చేపట్టామన్నారు. అందులో భాగంగా 22న ఉదయం 8 గంటలకు స్థానిక ఉత్తరబైపాస్ వినాయకస్వామి గుడి దగ్గర నుంచి కర్నూల్‌రోడ్, కొత్తపట్నం బస్టాండు మీదుగా నెల్లూరు బస్టాండ్ డీఆర్ఆర్ఎం మున్సిపల్ గ్రౌండ్ వరకు యాత్ర కొనసాగుతుందన్నారు. మునిసిపల్ గ్రౌండ్‌లో సాయంత్రం 6 గంటల నుంచి మహాయాగం జరుగుతుందని, ఈ యాగంలో పాల్గొనటానికి ఎటువంటి రుసుం లేదని, హోమద్రవ్యాలు ఉచితంగా అందజేస్తామని చెప్పారు. యాగంలో పాల్గొనే వారు ముందుగా 9440988791 సెల్ నెంబరులో తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో దాసరి నరసింహారావు, కరణం రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి మృతి తీరని లోటు

నాగులుప్పలపాడు సెప్టెంబరు 13 : కమ్యూనిస్ట్ యోధుడు సీతారాం ఏచూరి మృతి ఉద్యమానికి తీరని లోటని సీపీఎం నాయకులు షేక్ మాబు, జుజ్జూరి జయంతిబాబు పేర్కొన్నారు. ఉప్పుగుండూరులోని ఓ కళ్యాణ మండపంలో శుక్రవారం సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాపసభ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే పోరాట పటిమకలిగిన వ్యక్తిగా యూనివర్శిటీ వైస్ చాన్సలర్ పదవికి రాజీనామా చేశారని చెప్పారు. రాజ్యసభ సభ్యునిగా 12 ఏళ్ల పాటు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడి పరిష్కరించారన్నారు. తొలుత సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు విజేష్ రాజు, తూబాటి శ్రీకాంత్, జి.బసవపున్నయ్య, మక్కెన బాబురావు, నలతోటి రామారావు, యోనా, యు.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

ఏకేయూలో అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 13: ఒంగోలు ఆంధ్రకేసరి యూనివర్శిటీ కళాశాలలో వివిధ సబ్జెక్టులు బోధించేందుకు అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జీ.రాజమోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్, ఎంకాం, ఎంబీఈ, బీపీఎడ్, ఎంపీఎడ్ తదితర కోర్సుల్లో బోధించేందుకు ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 19లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు విద్యార్హతల సర్టిఫికెట్లు, బోధనానుభవం పత్రాలు సమర్పించాలని, తమ దరఖాస్తులను నేరుగా ప్రిన్సిపాల్ మెయిల్‌కు పంపించాలన్నారు. ఈనెల 21న యూనివర్శిటీలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఆయన కోరారు.

పేస్‌లో ముగిసిన శిక్షణ

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 13: ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ద్వితీయ సంవత్సరం సీఎస్ఈ విద్యార్థులకు గత వారం రోజులుగా నిర్వహిస్తున్న పైథాన్ ప్రోగ్రామింగ్ శిక్షణ శుక్రవారం ముగిసింది. రిసోర్స్‌పర్సన్‌గా ఎ.త్రినాథ్ వ్యవహరించారు. విద్యార్థులకు కొన్ని రియల్‌టైమ్ పైథాన్ అప్లికేషన్లు వివరించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, డీన్ సీవీ.సుబ్బారావు, విభాగాధిపతి ఎస్.గిరిబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాండ్ పేరెంట్స్‌డే

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 13 : ఒంగోలు సమీపంలోని సాయిబాబా సెంట్రల్ స్కూలులో గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు శుక్రవారం ఉల్లాసంగా జరిగాయి. ఈ సందర్భంగా అకడమిక్ డైరెక్టర్ సాయినాధుని శృతి మాట్లాడుతూ పిల్లలు పెరుగుతున్న కొద్దీ వారికి తరగతి గది నుంచి కాకుండా ప్రత్యక్ష అనుభవం ద్వారా కొన్ని విలువలు నేర్పాలన్నారు. పాఠశాలలో కిండర్ గార్డెన్ విద్యార్థుల అమ్మమ్మ, నాయనమ్మ, తాతయ్యలతో గ్రాండ్ పేరెంట్స్ వేడుకలు నిర్వహించడం ద్వారా ఇవి విద్యార్థులకు భావి జీవితానికి ఎంతోగానూ ఉపయోగపడుతాయన్నారు. గ్రాండ్ పేరెంట్స్ తమ మనమలు, మనుమరాళ్ళ సహకారంతో మ్యూజికల్ చైర్స్ తదితర ఆటల్లో ఉల్లాసంగా పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి పాఠశాల యాజమాన్యం బహుమతులను అందజేసింది.

నేడు ఎస్సీవర్గీకరణ వ్యతిరేక సదస్సు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 13 : ఒంగోలులోని అంబేడ్కర్‌భవన్‌లో శనివారం జరగనున్న ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా జరిగే సదస్సును విజయవంతం చేయాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు పిలుపునిచ్చారు. స్థానిక సమితి కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగసవరణ జరగకుండా ఎస్సీ రిజర్వేషన్లను సుప్రీంకోర్టు తీర్పుతో నిర్ణయించలేరన్నారు. సదస్సులో మాలలందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై గుంతలు పూడ్చాలని వినతి

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 13: ఒంగోలు నగరంలో 132 కేవీ లైన్ అండర్ గ్రౌండ్‌లో వేయడం వల్ల ఏర్పడిన గుంతలు పూడ్చాలని నగర అభివృద్ధి కమిటీ ప్రతినిధులు శుక్రవారం ట్రాన్స్‌కో ఎస్ఈ కె.శ్రీనివాసరావును కోరారు. స్థానిక ట్రాన్స్‌కో ఆయనను కలిసి వాహనదారుల ఇబ్బందులును వివరించారు. విద్యుత్ లైన్ అండర్ గ్రౌండ్‌లో వేయడం వల్ల రోడ్డు గుంతలమయంగా మారిందని, దీంతో వాహన రాకపోకలకు అవస్థలు పడడమే కాకుండా అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. అందువల్ల రోడ్లపై ఏర్పడిన గుంతలు పూడ్చాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు, భక్తసింగ్‌రాజు, ముసలారెడ్డి తదితరలు పాల్గొన్నారు.

18న స్కూల్ గేమ్స్ క్రీడాకారుల ఎంపిక

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 13: ఉమ్మడి ప్రకాశం జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారుల ఎంపికలు ఈనెల 18న నిర్వహిస్తున్నట్లు ఆర్ఐవో ఎ.సైమన్‌విక్టర్ శుక్రవారం తెలిపారు. ఐదు విభాగాలలో ఎంపికలు జరుగుతాయన్నారు. కందుకూరు టీఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలలో బాస్కెట్‌బాల్, ఒంగోలు ఏబీఎం కళాశాలలో ఫుట్‌బాల్, రెజ్లింగ్, సెపక్‌తక్రా, టేబుల్ టెన్నిస్ క్రీడాకారుల ఎంపికలు జరుగుతాయని, ఈ పోటీల్లో పాల్గొనేందుకు వయోపరిమితి కలవారు తమ కళాశాల ప్రిన్సిపాల్ నుంచి పార్టిసిపేషన్ వివరాలు, పదో తరగతి ఒరిజనల్ మార్కుల జాబితాతో హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు మహాజన సభ

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 13 : ఒంగోలు తాలూకా ఎన్‌జీవో సహకార గృహ నిర్మాణ సంఘం లిమిటెడ్ మహాజన సభ శనివారం ఉదయం11 గంటలకు స్థానిక ఎన్‌జీవోభవన్‌లో జరుగుతుందని సంఘం అధ్యక్ష కార్యదర్శులు, కోశాధికారి అహ్మద్‌పాషాఖాన్, ఎస్‌కే.ముగ్దుంషరీఫ్, సీహెచ్.సింగయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాజన సభలో సొసైటీకి సంబంధించిన స్థలాల అన్యాక్రాంతం చేస్తున్నవారి నుంచి స్థలాన్ని రక్షించుకోవడం, కన్వర్షన్ చేయించుకోవడం వంటి అనేక విషయాలపై చర్చిస్తామని, సభ్యులందరూ పాల్గొనాలని వారు కోరారు.

విద్యుత్ లైన్ల మరమ్మతులు నేడు

మద్దిపాడు, సెప్టెంబరు 13: మండలంలోని ఘడియపూడి, తెల్లబాడు అగ్రికల్చర్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు లైన్ల మరమ్మతులను నిర్వహించనున్నట్లు మద్దిపాడు విద్యుత్‌శాఖ ఏఈ చెన్నారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు, విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ప్రధానోపాధ్యాయులకు శిక్షణ

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 13: నాగులుప్పలపాడులోని మండల విద్యావనరుల కేంద్రంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్‌వో కృష్ణకుమార్ యూటీఐఎస్‌సీ వెబ్‌సైట్ ఉపయోగించే విధానం, విద్యాశాఖ సమాచారం అప్లోడ్ చేసే అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఎంఈవోలు తిరుమలశెట్టి రవి, రమణయ్య, సిబ్బంది నాగార్జున, వెంకాయమ్మ పాల్గొన్నారు.

ఘనంగా ఉమా మనోవికాస కేంద్రం వార్షికోత్సవం


కేక్ కట్ చేస్తున్న సీఐ శ్రీనివాస్

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 13: ఒంగోలులోని ఉమామనోవికాస కేంద్రం 37వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ఎం.శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా అక్కడి విద్యార్థులతో సీఐ మాట్లాడారు. వారికి కేక్ తినిపించారు. కార్యక్రమంలో సంస్థ ఫౌండర్ ఎస్పీరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

22న జిల్లాస్థాయి యోగాసన పోటీలు

ఒంగోలు (కల్చరల్), సెప్టెంబరు 13 జిల్లా స్థాయి యోగాసన పోటీలు ఈనెల 22న ఒంగోలు నగరం అంజయ్య రోడ్‌లోని ఆంధ్రకేసరి విద్యాకేంద్రంలో ఉదయం 8 గంటల నుంచి జరుగుతాయిని యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బోయపాటి రవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రకాశం జిల్లాకు చెందిన స్కూలు, కళాశాల విద్యార్థులు, యోగా గురువులు పాల్గొనవచ్చని, వయసుల వారీగా సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, సీనియర్ ఏబీసీలుగా పోటీలు ఉంటాయన్నారు. ప్రతి గ్రూపులో ట్రెడిషనల్, ఆర్టిస్టిక్ సోలో, ఆర్టిస్టిక్ పెయిర్, ఆర్టిస్టిక్ గ్రూప్, రిథమిక్ పెయిర్‌లలో పోటీలు ఉంటాయని, విజేతలు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారన్నారు. ప్రతి గ్రూపులో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామని, వివరాలకు 7780680121, 9490163312 సెల్ నెంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

రూ.12.83లక్షల అపరాధ రుసుం విధింపు

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 13: విద్యుత్‌శాఖ అధికారులు ఒంగోలు మండలంలోని పలు ప్రాంతాలలో శుక్రవారం విస్తృతం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 40 బృందాలుగా ఏర్పడి దాడులు చేయగా అనధికారికంగా కరెంటు వినియోగిస్తున్న వారిపై కేసు నమోదు చేసి రూ.37వేలు జరిమానా విధించారు. మరో 271మందికి అధికలోడు వినియోగిస్తున్న వారికి రూ.12.46లక్షలు అపరాధరుసుం విధించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఒంగోలు ఈఈ పి.శ్రీనివాసులు, విజిలెన్స్ ఈఈ వెంకటేశ్వర్లు, విజిలెన్స్ సీఐ బీటీనాయక్, ఒంగోలు రూరల్ డీఈ మోహనరావు, ఏఈఈ మల్లిఖార్జునరావు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

మద్దిపాడు, సెప్టెంబరు 13: మండలంలో సాగు చేసిన పలు పంటలను శుక్రవారం ఏవో రమేష్‌బాబు పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలు నేపథ్యంలో అన్నదాతలు సాగుచేసిన పంటలు దెబ్బతింటే వాటి వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని ఆయన చెప్పారు.

17నుంచి స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలు

మద్దిపాడు, సెప్టెంబరు 13: గాంధీ జయంతి సందర్భంగా ఈ నెల 17 నుంచి అక్టోబరు ఒకటో తేదీ వరకు స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలు జరుగుతాయని ఎంపీడీవో వై.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. సూర్య ఘర్ యోజన కింద తక్కువ వడ్డీతో బ్యాంకు రుణాలు అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వర్షాభావంతో ఎండిపోయిన కుంటలు



నీరులేని కామేపల్లి- ఇలవర గ్రామాల మధ్య ఉన్న గురవాయికుంట

కొండపి, సెప్టెంబరు13: తీవ్రమైన వర్షాభావంతో గ్రామాల్లోని కుంటలు వట్టిపోయాయి. మనుషులు, పశువులు, ఇతర జీవాలు తాగు నీటికి, వ్యవసాయ సీజన్‌లో సాగునీటి అవసరాలు తీర్చేందుకు పూర్వం గ్రామాల్లో కుంటలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అవన్నీ చుక్కనీరులేక ఎండిపోయాయి. పై ఫొటోలోని రెండు కుంటలు మండలంలోని ఇలవర (నేతివారిపాలెం) గ్రామంలోనివి. గరవాయి కుంట - కామేపల్లి-ఇలవర (నేతివారిపాలెం) గ్రామాల మధ్యన ప్రధాన రహదారిని ఆనుకుని ఉంటుంది. దీనిలోని నీటిని సాగునీటి అవసరాలకు వాడుకుంటారు రైతులు. అదేవిధంగా గ్రామంలో ఉండే శనగవరపు క్రిష్ణయ్య కుంట కూడా పశువులకు తాగునీటి అవసరాలు తీరుస్తుంది. ప్రస్తుతం వర్షాభావం కారణంగా రెండు పూర్తిగాఎండిపోయి ఉన్నాయి. అదేవిధంగా కొండపి, జరుగుమల్లి, పొన్నలూరు మండలాల్లోని పలు గ్రామాల్లోని వందలాది కుంటలు ప్రస్తుతం నీరులేక ఎండిపోయి ఉన్నాయి.

6న మనం ఫౌండేషన్ పురస్కారాలు

ఒంగోలు(కల్చరల్), సెప్టెంబరు 13: అంతర్జాతీయ గుర్తింపు పొందిన మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో అక్టోబరు 6వ తేదీన పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షులు చక్రవర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించే ఈ పోటీలలో ప్రథమ, ద్వి తీయ, తృతీయ స్థానాలు పొందిన వారికి నగదు బహుమతితో పాటు బెస్ట్ సింగర్ పురస్కారం, ఇంటర్నేషనల్ మనం బుక్ ఆఫ్ రికార్డ్ సర్టిఫికెట్ ప్రదానం చేస్తామన్నారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జాతీయ పురస్కారం, బుక్ ఆఫ్ రికార్డ్ సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. అదేవిధంగా పలు సామాజిక సే వ, సాంస్కృతిక రంగాలలో విశేష సేవలు అందిస్తున్న వారికి మహాత్మాగాంధీ శాంతి సేవారత్న జాతీయ పురస్కారం, గౌరవ డాక్టరేట్, నంది పురస్కార ప్రదా నం మొదలైన కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఆసక్తి కలిగిన వారు వివరాల కో సం 8247776572, 9848512192 సెల్‌నెంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

వరద బాధితులకు అండగా సీపీఐ ప్రకాశం

రూ.5లక్షల విలువైన సరుకుల పంపిణీ



వరద బాధితులకు సరుకులను అందజేస్తున్న రామకృష్ణ, నారాయణ

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 13: సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం విజయవాడలో వరద బాధితులకు సుమారు రూ.5 లక్షల విలువ చేసే బియ్యం, నూనె, దుప్పట్లు తదితర సామన్లను రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ చేతుల మీదుగా పంపిణీ చేశారు. పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు జిల్లాలోని సీపీఐ కార్యకర్తలు విజయవాడ వరద బాధితుల కోసం వారం రోజులుగా విరాళాలు వసూలు చేశారు. వచ్చిన నిధిని జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ నేతృత్వంలో విజయవాడకు తరలించారు. ఈక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య, అఖిల భారత కిసాన్ సభ జాతీయ కార్యదర్శి రావుల వెంకయ్య, రాష్ట్ర నాయకులు అక్కినేని వనజ ఆధ్వర్యంలో సరుకులను బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన పీవీఆర్.చౌదరి, వై.రవీంద్రబాబు, కె.వీరారెడ్డి, సయ్యద్‌యాసిన్, కొత్తకోట వెంకటేశ్వర్లు, శ్రీరామ్ శ్రీనివాసరావు, ఎం.విజయ, ఆర్.లక్ష్మి, బి.రామయ్య, ఆర్.కరుణానిధి, సయ్యద్‌ఇఫ్రాజ్, సురేష్ పాల్గొన్నారు.

పోరాట యోధుడు సీతారాం ఏచూరి

టంగుటూరు, సెప్టెంబరు 13 : నమ్మిన సిద్ధాంతం కోసం జీవిత కాలం పోరాడిన యోధుడు సీతారాం ఏచూరి అని సీపీఎం మండల కన్వీనర్ వి.మోజెస్ అన్నారు. ఏచూరి సంతాప సభ శుక్రవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించారు. వివిధ పార్టీల నాయకులు సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ దేశరాజకీయాల్లో ఏచూరి కీలకపాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు టి.రాము, సీపీఐ మండల కార్యదర్శి టి.ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు బొడ్డు సతీష్‌బాబు, టీడీపీ అధికార ప్రతినిధి మొగల్‌కాలీషాబేగ్, సీపీఎం నాయకులు ఎం.యానాది, టి.వెంకట్రావు, టి.పాపారావు, డి.వెంకటేశ్వర్లు, పి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వాహనాలను ఆపి డబ్బులు గుంజుతున్న మహిళలు

పోలీసులు రావడంతో పలాయనం

కొండపి, సెప్టెంబరు 13 : మండలంలోని తాటాకులపాలెం-పెట్లూరు గ్రామాల మధ్య నలుగురు మహిళలు రోడ్డుకు అడ్డంగా చేతులు పట్టుకుని వాహనదారులను ఆపి డబ్బులు గుంజుతున్న ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పలువురు మోహమాటానికి పోయి డబ్బులు ఇచ్చి వెళ్లిపోయారు. ఇవ్వని వారిని మహిళలు బెదిరించి భయపెట్టే ప్రయత్నం చేశారు. ఇంతలో పెట్లూరు వైపునకు సీఐ వెళ్తుండగా కొందరు విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సీఐ అక్కడికి చేరుకొని మహిళలను ప్రశ్నించగా తాము బస్సు కోసం ఉన్నామంటూ బతిమాలుకొని అక్కడి నుంచి పలాయనం చిత్తగించారు. కాగా ఈరూటులో అనేక పర్యాయాలు పొదిలి నుంచి కొండపి వరకు వివిధ గ్రామాల మధ్య కొందరు మహిళలు ఇలాగే డబ్బులు వసూలు చేశారని పలువురు ఆరోపిస్తున్నారు. వారిని పట్టుకొని కేసులు నమోదు చేయాలని పోలీసులను కోరుతున్నారు.

తండ్రిపై తనయుడు కత్తితో దాడి

దొనకొండ, సెప్టెంబరు 13 : తండ్రిపై తనయుడు కత్తితో దాడిచేసి తీవ్రంగా గాయపర్చాడు. ఈఘటన మండలంలోని రుద్రసముద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. అందిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు వల్లపునేని పెద్దవీరయ్యచౌదరిపై పెద్ద కుమారుడు వీరాచారి కత్తితో దాడి చేయడంతో బలమైన గాయాలయ్యాయి. 108 సిబ్బంది క్షతగాత్రుడిని మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు సమాచారం.

నేడు ఎస్సీ వర్గీకరణపై వ్యతిరేక సదస్సు

టంగుటూరు, సెప్టెంబరు 13 : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా శనివారం ఒంగోలులో మాల ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సదస్సును జయప్రదం చేయాలని ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ కొండపి నియోజకవర్గ అధ్యక్షుడు పులగర కృష్ణయ్య కోరారు. టంగుటూరులో శుక్రవారం నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బొడ్డు రవీంద్ర, దామవరపు రాంబాబు, పర్రే శ్రీను, ఆగమన రాజు, జి.నాగేశ్వరరావు, రామకోటయ్య పాల్గొన్నారు.



ప్రదర్శన చేస్తున్న వర్గీకరణ వ్యతిరేక నాయకులు

క్రీడలకు చోటేది ?

ఆటస్థలం లేక ఇబ్బందిపడుతున్న విద్యార్థులు



మర్రిపూడి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల

మర్రిపూడి, సెప్టెంబరు 13 : మర్రిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏర్పాటు చేసి ఐదు దశాబ్దాలు కావస్తున్నప్పటికి ఆటస్థలం లేకపోవడంతో క్రీడలకు ప్రోత్సాహం కరువైంది. కాజా నాగమ్మ, సుబ్రమణ్యం దంపతుల విరాళంతో 1978లో పాఠశాల ఏర్పాటు చేశారు. అప్పట్లో పాఠశాలకు ఆటస్థలం చూపించడంలో అటు స్థానికులు ఇటు అధికారులు విఫలమయ్యారు. పది సంవత్సరాల క్రితం పోట్రేడ్డిపాలెం రహదారి పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఆటలకు కేటాయించేందుకు ప్రయత్నాలు జరిగాయి. అయితే గత ప్రభుత్వ హయాంలో ఆ స్థలంలో జగనన్న కాలనీ నిర్మించడంతో ఆప్రతిపాదనలకు కాలం చెల్లింది. గతంలో విద్యార్థులు మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఆటలు ఆడుకునే వారు. ఆ ప్రాంగణంలో నూతన కార్యాలయ భవణాలు నిర్మాణం జరగడంతో ఆటలు ఆడుకునేందుకు చోటు లేకుండా పోయింది.

ప్రస్తుతం విద్యార్థులు పాఠశాలను ఆనుకుని ఉన్న వేణుగోపాల స్వామి దేవాలయం మాన్యం భూమిలో రెండు ఎకరాల స్థలాన్ని క్రీడా స్థలంగా అభివృద్ధి చేసుకొని ఆటలాడుతున్నారు. ఇటీవల కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు ఆటస్థలాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 450 మంది విద్యార్థులు విద్యాబోధన చేస్తున్నారు. ఆటస్థలాలు లేకపోవడంతో క్రీడకారులుగా విద్యార్థులు ఎదగలేకపోతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర మంత్రి డాక్టర్ శ్రీబాలవీరాంజనేయస్వామి చొరవతీసుకొని ఆటస్థలాన్ని ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వాయిదాపడ్డ వైసీపీ సమావేశం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

మాజీ సీఎం జగన్ వద్ద శుక్రవారం జరగాల్సిన జిల్లా వైసీపీ నాయకుల సమావేశం వాయిదాపడింది. అయితే ఈ సమావేశానికి బాలినేని హాజరుకానని చెప్పటంతో కొందరు రాష్ట్ర నాయకులు జోక్యం చేసుకొని బాలినేని వ్యవహారం కొలిక్కి వచ్చిన తర్వాత సమావేశం ఏర్పాటు చేద్దామని జగన్‌కు సూచించినట్లు తెలిసింది. ఉమ్మడి జిల్లాకు చెందిన కొందరు నాయకులు కూడా తొందర పడకూడదని బాలినేని హాజరయ్యే విధంగా మరోసారి మాట్లాడి సమావేశం ఏర్పాటు చేద్దామని సూచించినట్లుగా తెలిసింది. దీంతో జగన్ బాలినేనితో మరోసారి చర్చలు జరిపే బాధ్యతను సజ్జల రామకృష్ణారెడ్డికి అప్పగించినట్లు సమాచారం. ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే చంద్రశేఖర్ ద్వారా కూడా బాలినేని పార్టీ మారే ఆలోచన చేస్తునట్లు వచ్చిన ప్రచారంపై సమాచారం సేకరిస్తున్న ప్రయత్నం అధిష్ఠానం చేస్తున్నట్లు తెలిసింది.

'పల్లెవనం'కు ఎన్టీఆర్ పేరు పునరుద్ధరణ



దర్శిలోని పార్క్‌కు ఎన్టీఆర్ పేరు

దర్శి, సెప్టెంబరు 13 : గత తెలుగుదేశం ప్రభుత్వంలో నిర్మించిన పల్లెవనం పార్క్ కు ఎన్టీఆర్ పేరును పునరుద్ధరించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్టీఆర్ పేరును తొలగించారు. ఆసమయంలో టీడీపీ అభిమానులు, ప్రజలు అభ్యంతరాలు వ్య క్తం చేసినప్పటికీ అప్పటి పాలకులు పట్టించుకోలేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాం లో దర్శి- కురిచేడు రోడ్డులో మూడు ఎకరాల్లో సర్వాంగసుందరంగా పార్క్ నిర్మిం చారు. ఆ సందర్భంగా ఎన్టీఆర్ పల్లెవనం పార్క్‌గా నామకరణం చేశారు. టీడీపీ అధికారంలో ఉన్న కాలంలో నిత్యం వందలాది మంది పార్క్‌కు వెళ్లడంతో కళకళ లాడేది. వైసీపీ అధికారంలో పార్క్ నిర్వహణను పూర్తిగా వదిలేశారు. అప్పటి పాలకులు ఎన్టీఆర్ పేరు తొలగించి విమర్శలపాలయ్యారు. ఆతర్వాత పార్క్ అభివృద్ధి కోసం విడుదలైన నిధులు దుర్వినియోగం అయినప్పటికీ పట్టించుకున్న నాథుడే లేడు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో అధికారులు ఆగమే ఘాల మీద పల్లెవనం పార్క్‌కు ఎన్టీఆర్ పేరు పునరుద్ధరించి బోర్డు ఏర్పాటుచేశారు. వైసీపీ పాలకులు అనవసరంగా వివాదాలు సృష్టించి అబాసుపాలయ్యారని ప్రజలు చర్చించుకుంటున్నారు.

జనసేనలోకి రవిశంకర్

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

జిల్లాలో కూటమి భాగస్వామి పార్టీలోకి వెళ్లేవారి సంఖ్య పెరిగిపోతుంది. వైసీపీ నాయకులతోపాటు వివిధ వర్గాల వ్యాపార ప్రముఖులు కూటమి భాగస్వామి పార్టీలోకి చేరుతున్నారు.

తాజాగా ఒంగోలుకు చెందిన పారిశ్రామికవేత్త కంది రవిశంకర్ జనసేన పార్టీలోకి చేరేందుకు రంగం సిద్ధమైంది. ఈ నెల 16 లేదా 18వ తేదీన ఆయన పవన్‌కళ్యాణ్ సమక్షంలో ఆ పార్టీలో చేరనున్నారు.

తన వియ్యంకుడు పొన్నూరు మాజీ ఎమ్మెల్యే రోశయ్యతో కలిసి ఆయన జనసేనలో చేరనున్నారు. టీవీఎస్ ఏజన్సీతోపాటు నగరంలో రవిప్రియ మాల్‌కు ఆయన యజమాని. తిరుపతి జనసేన ఎమ్మెల్యే శ్రీనివాసులు కూడా రవిశంకర్ సమీప బంధువు. కాగా గతంలో వైసీపీలో ఉంటూ మాజీ మంత్రి బాలినేని అనుచరుడిగా కొనసాగారు.

ఇంటింటి సర్వే చేయాలి

ఆర్డీవో సుబ్బారెడ్డి



మాట్లాడుతున్న ఆర్డీవో సుబ్బారెడ్డి

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 13: ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేసి ఓటరు వివరాలు పరిశీలించాలని ఒంగోలు నియోజకవర్గ ఈఆర్వో ఆర్డీఓ సుబ్బారెడ్డి తెలిపారు. స్పెషల్ సమరీ రివిజన్-2025లో భాగంగా ఏఈఆర్వోలు, సూపర్‌వైజర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఇంటింటి సర్వే ప్రక్రియను పక్కాగా చేయాలని పేర్కొన్నారు. బీఎల్వోలు ప్రతి కుటుంబంలోని ఓటర్లు ఒకే పోలింగ్ స్టేషన్‌లో ఉండేలా చూడాలన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లోని ఓటరు జాబితాలో ఎటువంటి తప్పులుగానీ, ఫొటో సరిగా లేనివి ఉన్నా వెంటనే వాటిని సరిదిద్దాలని తెలిపారు. పోలింగ్ స్టేషన్‌లో వసతులు, బిల్డింగ్ పరిస్థితిని పరిశీలించి ఏమైనా మార్పులు ఉంటే తెలియజేయాలని ఆదేశించారు.

పాము కాటుతో మహిళ మృతి

తాళ్లూరు, సెప్టెంబరు 13: మండలంలోని మాధవరం గ్రామంలో పాము కాటుకు గురై మహిళ మృతి చెందింది. అందిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన సోము శివారెడ్డి, భార్య అన్నపూర్ణలు శుక్రవారం సాయంత్రం పశువుల మేతకు వెళ్లారు. మేత కోస్తున్న అన్నపూర్ణ(40) పాము కాటుకు గురైంది. వెంటనే తాళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ ఇంజక్షన్ వేసి ఒంగోలుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. ఆమెకు భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అలాగే, కొత్తపాలెం గ్రామానికి చెందిన ఆవుల పున్నారెడ్డి పొలంలో పనిచేస్తుండగా పాము కాటుకు గురయ్యాడు. తాళ్లూరు పీహెచ్‌సీలో పాముకాటు ఇంజక్షన్ వేయించారు. అతని ఆరోగ్య పరిస్థితి పట్ల ఆందోళ చెందాల్సిన అవసరం లేదని వైద్యసిబ్బంది తెలిపారు. మెరుగైన చికిత్స కోసం ఒంగోలుకు తరలించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొండపి, సెప్టెంబరు 13 : కొండపి సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ కుంచాల కోటయ్య ఒక ప్రకటనలో తెలిపారు. లైన్ల మరమ్మతుల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. కొండపి, ఇలవర, అనకర్లపూడి, పెరిదేపి, గోగినేనివారిపాలెం, నెన్నూరుపాడు, ముప్పరాజుపాలెం, పెదకండ్లగుంట, మిట్టపాలెం గ్రామ పంచాయతీల్లోని గ్రామాల్లో సరఫరా ఉండదని ఆయన తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.



బాబారాందేవ్ ఆలయంలో వినాయకుడికి పూజలు చేస్తున్నభక్తులు



ద్వారకానగర్‌లో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జనార్దన్, నేతలు

గణనాథా కరుణించవయ్యా

- ఘనంగా కొనసాగుతున్న నవరాత్రులు
- పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దామచర్ల, ఎంపీ మాగుంట

ఒంగోలు (కల్చరల్), సెప్టెంబరు 13: గణపతి నవ రాత్రులు ఒంగోలు నగరంలో అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. వివిధ ప్రదేశాలలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాలకు నిర్వాహకులు పలు రకాల అలంకరణలు చేసి భక్తులకు కనువిందు చేస్తున్నారు. ఇక శుక్రవారం పలుచోట్ల ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి స్వామివార్లను దర్శించుకున్నారు. స్థానిక రామ్‌నగర్ 9వ లైన్, రాజాపానగల్ రోడ్ వీరాంజనేయస్వామి దేవస్థానం వద్ద, బాపూజీ కాంప్లెక్స్ 2వ లైను, గుంటూరు రోడ్ ఇస్కాన్ దేవాలయం పక్కన, బాబా రాందేవ్ దేవాలయం, 36వ డివిజన్‌లోని గోరంట్ల సూరిబాబు నివాసంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల వద్ద ఎమ్మెల్యే దామచర్ల ప్రత్యేక పూజలు చేశారు. అటు స్థానిక టీకే అపార్ట్‌మెంట్‌లో ఏర్పాటుచేసిన గణపతి నవరాత్రి ఉత్సవాలలో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పూజలలో పాల్గొన్నారు. స్థానిక గాంధీరోడ్ ది గోల్డ్ సిల్వర్ డైమండ్ మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక మండపాన్ని సుమారు రూ.50 లక్షల కరెన్సీ నోట్లతో అలంకరిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.




బాపూజీమార్కెట్ కాంప్లెక్స్‌లో...



ఇందిరానగర్‌లో...



గోపాలనగర్‌లో గణనాథుడు



ఆర్టీసీ కాలనీలో కరెన్సీ అలంకరణలో...

గొయ్యి.... కానరాదు రేయి



చిరిగిపోయిన ఫ్లెక్సీ

కొండపి, సెప్టెంబరు 13 : మండలంలోని అనకర్లపూడి-నెన్నూరుపాడు గ్రామాల మధ్యన ఆర్‌అండ్‌బీ రోడ్డులోని నేల చప్టా దెబ్బతిని గొయ్యి పడింది. దానిపై చిల్ల కంప వేసి పక్కన రెండు గుంజలు పాతి ఇక్కడ ప్రమాదకర గొయ్యి ఉన్నదని ఫ్లెక్సీపై రాసి ఏర్పాటు చేశారు. ఫ్లెక్సీ చిరిగిపోయింది. ద్విచక్రవాహనదారులకు చిల్లకంప కనిపిస్తుంది కానీ భారీ వాహనదారులకు, రాత్రి వేళల్లో వాహనదారులకు ఈగొయ్యి కనిపించే పరిస్థితి లేదు. ఈదారిలో కొత్తగా వచ్చే వారు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారని వాహనదారులు అంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గొయ్యిని పూడ్చాలని కోరుతున్నారు.

గణేశుడికి సత్య ప్రత్యేక పూజలు



గణేష్ పూజలో పాల్గొన్న సత్య

కొండపి, సెప్టెంబరు 13 : మండలంలోని కట్టుబడివారిపాలెం గ్రామంలో టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశుడి విగ్రహం వద్ద ఆపార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కొండపి ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి, టీడీపీ గ్రామ నాయకులు దామా మరళి, శ్రీహరి, గ్రామ యువకులు, తెలుగు రైతు సంఘ నియోజకవర్గ నాయకుడు చాగంరెడ్డి నరసారెడ్డి పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో ఉత్తమ ఫలితాలు



ఉపన్యసిస్తున్న శిక్షకుడు వెంకటేశ్వర్లు

టంగుటూరు, సెప్టెంబరు 13 : విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో విద్యనభ్యసించడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని కెరీర్ గైడెన్స్ శిక్షకుడు వి.వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక పోతుల చెంచయ్య మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్ విద్యార్థులకు ఆయన శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందుల వలన ఉన్నత చదువులు చదవలేని వారికి ఉచితంగా విద్యనందిస్తానని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సరైన సమాధానం చెప్పిన వారికి నగదు బహుమతిని అందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ టి.చక్రపాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

టంగుటూరు, నవంబరు 13 : డయల్ యువర్ ఒంగోలు ఆర్టీసీ డీఎం కార్యక్రమం శనివారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకూ నిర్వహిస్తున్నట్లు డీఎం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు డిపో పరిధిలోని ప్రయాణికులు సెల్ నెంబర్ 99592 25695కు ఫోన్ చేసి ఆర్టీసీ ప్రయాణంలో ఇబ్బందులుంటే తెలియజేయాలన్నారు. అలాగే సంస్థకు తగిన సూచనలు ఇవ్వాలని కోరారు.

స.హ చట్టంపై అవగాహన పెంచుకోవాలి

● సీనియర్ అధికారి నాగమల్లికార్జున



మాట్లాడుతున్న నాగమల్లికార్జున

మార్కాపురం రూరల్ సెప్టెంబర్ 13: సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్క అధికారి అవగాహన పెంచుకోవాలని సబ్‌కలెక్టర్ కార్యాలయ సీనియర్ అధికారి నాగమల్లికార్జున అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం సాయంత్రం సమాచారహక్కు చట్టంపై వ్యవసాయ శాఖ అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం-2005 ఉద్దేశాలను, లక్ష్యాలను వివరించారు. అధికార యంత్రాంగంలో పారదర్శకత, జవాబుదారీ తనం కోసం ఈ చట్టాన్ని ప్రభుత్వం రూపొందించిందన్నారు. వ్యవస్థలలో అవినీతిని అరికట్టేందుకు, ప్రభుత్వ కార్యక్రమాలను సమర్ధవంతంగా ఉపయోగపడుతుందన్నారు. ఏడీఏ బాలాజి నాయక్ మాట్లాడుతూ శాఖలో ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందించే పథకాల, రాయితీల వివరాలను పౌరులకు తెలియజేయాలన్నారు. సమాచార హక్కు దరఖాస్తు వచ్చిన ఐదురోజులలోగా వివరణ ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో మార్కాపురం, తర్లుపాడు మండలాల వ్యవసాయాధికారులు, దేవిరెడ్డి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, సిబ్బంది నాగమణి, సురేఖ, రైతులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు చేయించుకోవాలి

పొదిలి, సెప్టెంబరు 13 : పంటసాగు చేసిన రైతులు గడువులోపు ఈ-పంట నమోదు చేసుకోవాలని ఏవో షేక్ జైన్‌లుబ్దీన్ అన్నారు. సెప్టెంబరు 15 వరకు మాత్రమే నమోదు కార్యక్రమం ఉంటుందన్నారు. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో ప్రాధానంగా కంది సజ్జ, వరి, మిర్చి సాగు చేశారన్నారు. కనుక పంటలు సాగుచేసిన రైతులు తప్పకుండా ఈ-పంట నమోదు చేసుకోవాలన్నారు.

ఒరిగిన విద్యుత్ స్తంభం - తప్పిన ప్రమాదం


ఒరిగిన విద్యుత్ స్తంభం

గిద్దలూరు, సెప్టెంబరు 13 : రాచర్ల మండలంలోని అనుమల వీడు గ్రామంలో ఓ వ్యక్తి తన ఇంట్లో జరుగుతున్న శుభకార్యం కోసం ఇంటిబయట షామియానా ఏర్పాటు చేయించాడు. అది నిలబడేందుకు వీలుగా దాని తాడును సమీప విద్యుత్ స్తంభానికి కడుతుండగా విద్యుత్ స్తంభం ఒక్కసారిగా ఒక పక్కకు ఒరిగింది. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రమాదం జరగలేదు. దీంతో శుభకార్యానికి వచ్చిన భక్తులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. పాతబడిన స్తంభాల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

చెరువులను సమగ్రంగా అభివృద్ధి చేస్తాం

● మార్కాపురం డీఈఈ అబుతలీమ్
● ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

బేస్తవారపేట, సెప్టెంబరు13: బేస్తవారపేట మండలంలోని చెరువులకు మరమ్మతు చేసి సమగ్రంగా అభివృద్ధి చేస్తామని మార్కాపురం డివిజన్ డీఈఈ అబుతలీమ్ పేర్కొన్నారు. మండలంలో అధ్వానంగా ఉన్న చెరువుల దుస్థితిపై 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం 'చిల్ల చెట్లతో నిండిన చెరువులు' శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీనిపై ఆయన స్పందించారు. 2020 జూన్ నెలలో బేస్తవార పేట మండలం, కోమరోలు మండలాలలో కురిసిన భారీవర్షాలకు బేస్తవారపేట మండలంలోని పూసలపాడు చెరువుకు పూర్తి స్థాయిలో నీరు చేరిన తరువాత కట్ట తెగిందన్నా రు. పూసలపాడు చెరువుకు నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం రూ.16.67 కోట్లతో మరోసారి అంచనాలు ప్రభుత్వానికి నివేదిక పంపించామన్నారు. మంజూరు జరిగిన వెంటనే పూర్తి స్థాయిలో పనులు చేస్తామన్నారు. జేసీ.అగ్రహారం చెరువు, ఖాజీపురం హోసు రమ్మ చెరువు, జెన్నివారి పల్లె చెరువు, మల్లాపురం చెరువు, జగ్గంబోట్ల కృష్ణాపురం కతువ, పిటికాయ గుళ్ల చెరువులకు నీరు వచ్చి పూర్తిగా నిలిచే అవకాశం ఉంద న్నారు. కొద్దిపాటి మరమ్మతులు త్వరలోనే చేస్తామన్నారు. ఉన్నతాధికారుల పరిశీలన తరువాత కోనపల్లె, సింగరపల్లె కొత్తచెరువులకు కొత్తగా ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపుతామన్నారు. జెన్నివారిపల్లె చెరువు, జగ్గంబోట్ల కృష్ణాపురం కతువ, పిటికాయగుళ్ల చెరువు, దప్పిలవానికుంట సప్లైఛానల్ మోక్షగుండం కొత్త చెరువులకు మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపుతున్నా మన్నారు. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు.


అలుగు ఆక్రమణ రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్

అలుగు ఆక్రమణ పరిశీలన

మార్కాపురం వన్‌టౌన్ : స్థానిక పారిశ్రామి కవాడ సమీపంలోని చెరువు అలుగును వై.జంక్షన్ సమీపంలో ఆక్రమించిన కట్టడాలను శుక్రవారం తహసీల్దార్ చిరంజీవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆక్రమణదారులకు వాటిని తొలగించాలని నోటీసులు అందజేశారు. శనివారం నుంచి ఆక్రమిత ప్రభుత్వ భూములపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వాటిని తొలగిస్తామని తహసీల్దార్ తెలిపారు.

వరదబాధితులకు నిత్యావసరాలు అందజేత

మంత్రి రవికుమార్ చేతుల మీదగా పంపిణీ


సాయం అందజేస్తున్న మంత్రి రవికుమార్, ఎమ్మెల్యే బొండా ఉమ

మార్కాపురం, సెప్టెంబరు 13: విజయవాడలోని వరద ముంపు ప్రాంతాల్లో మార్కాపురం నుంచి తరలించిన నిత్యావసరాలను రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం పంపిణీ చేశారు. మార్కాపురం నుంచి నాలుగు లారీల్లో గురువారం రాత్రి 9 రకాల సరుకులను ఒక సంచిలో నింపి 3,500 బ్యాగులను ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో విజయవాడ తరలించారు. అక్కడ 58, 59 డివిజన్‌లలోని సింగ్‌నగర్, వాంబే కాలనీల్లో మంత్రి గొట్టిపాటి రవికుమార్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్యే నారాయణరెడ్డి కుమారుడు విఘ్నేష్ రెడ్డిలు బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి రవి కుమార్ మాట్లాడుతూ చరిత్రలో ఎన్నడూలేని విధంగా విజయవాడను వరదలు ముంచెత్తాయన్నారు. పెద్దస్థాయిలో విపత్తు వచ్చినా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమర్థవంతంగా ఎదుర్కొన్నారన్నారు. వరద నష్టం అంచనాకు ప్రభుత్వం ప్రత్యేక బృందం ఏర్పాటు చేసిందన్నారు. అంచనాలు పూర్తికాగానే పరిహారం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో కందుల విఘ్నేష్ రెడ్డి, వక్కలగడ్డ మల్లిఖార్జున్, ఉలవ గోపి, మార్కాపురం టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

తర్లుపాడు : ఇటీవల విజయవాడలో కురిసిన భారీ వర్షాలకు విజయవాడలోని సింగ్ నగర్‌లోని వరద బాధితులకు తర్లుపాడు టీడీపీ నిత్యావసర కిట్‌లు అందజేశారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆదేశాల మేరకు నాయకులు చొరవ చూపారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఉడుముల చిన్నపురెడ్డి, మాజీ ఎంపీటీసీ పి.గోపినాథ్ చౌదరి, మేకల వెంకట్, ఖైరూన్, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులలో అవకతవకలు

కొనకనమిట్ల, సెప్టంబరు 13 : మండలంలో గత సంవత్సరంలో జరిగిన ఉపాధిహామీ పనులపై ఆడిట్ బృందాలు గ్రామాలలో తనిఖీ చేశాయి. ఈ తనిఖీలలో పలుగ్రామాలలో అకతవకలను గుర్తించారు. శుక్రవారం చినారికట్ల, కొనకనమిట్ల, గరిమినపెంట, చింతగుంట, మంగాపురం, వెలిగండ్ల తదితర గ్రామాలలో ఉపాధిహామీ పనులపై గ్రామసభలు నిర్వహించారు. ఈ గ్రామ సభలలో చేసిన పనులలో నాణ్యత లోపం, కొలతలలో తేడాలను భారీగా గుర్తించారు. అంతేకాకుండా మస్టర్లలో కూలీల సంతకం లేకుండా కొనకనమిట్ల, గొట్లగట్టు, మునగపాడు, గార్లదిన్నె, నాగంపల్లి గ్రామాలలో బిల్లులు చెల్లించినట్లు వెల్లడించారు. పలుచోట్ల మొక్కలు లేకుండా బిల్లులు చెల్లించినట్లు తేటతెల్లం అయ్యింది. కార్యక్రమంలో ఏపీవో బులెన్‌రావు, ఎస్ఆర్‌పీ మూర్తి, పలువురు టీఏలు, ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణాలు వద్దు


అవగాహన కల్పిస్తున్న ఎస్సై బాబూరావు

పుల్లలచెరువు, సెప్టెంబరు 13: పరిమితికి మించి ప్రయాణికులతో ఆటోలు నడపవద్దని ఎస్సై బత్తుల బాబురావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన పుల్లలచెరువులోని అంబేడ్కర్ సెంటరులో ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోలు పరిమితికి మించి వేగంతో నడపవద్దని అన్నారు డ్రైవర్లు ఆటోల్లో ప్రయాణికుల పట్ల సత్ప్రవర్తన కలిగి వుండాలని అన్నారు. ప్రతిడ్రైవరు డ్రైవింగ్ లైసెన్స్‌లు, ఇన్సూరెన్స్ తప్పనిసరిగా కలిగి వుండాలన్నారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది వున్నారు.

ఓజోన్‌పొరను రక్షించుకుందాం

● డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సావిత్రి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సావిత్రి

పెద్ద దోర్నాల, సెప్టెంబరు 13: ఓజోన్‌పొర అంతరించి పోకుండా రక్షించుకోవాలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ సావిత్రి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ ఓజోన్‌పొర పరిరక్షణ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సావిత్రి మాట్లాడుతూ గతంలో మాదిరి సీజన్‌లో వర్షాలు పడడం లేదని, వరుస కరువులు ఏర్పడడం, లేదా కుంభవృష్టి కురవడం ప్రమాదాలకు సూచన అన్నారు. ప్రధానంగా ఈ విపత్తులు చోటు చేసుకోవడానికి అడవుల నరికివేత, యంత్రాల నుండి విషవాయువుల విడుదల, పంటలపై విచక్షణా రహితంగా పురుగు మందుల వినియోగమేనన్నారు. నియంత్రించేందుకు ప్రభుత్వంతో పాటు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఆలోచించాలన్నారు. ఈ క్రమంలో మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు విజయబాబు, శ్రీనివాసాచార్యులు, అక్రమ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏచూరి మృతి తీరని లోటు


ఏచూరి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

పొదిలి, సెప్టెంబరు 13 : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి ప్రజాస్వామ్యానికి తీరని లోటని సిఐటీయూ జిల్లాప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ అన్నారు. శుక్రవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ కమిటీ ఆధ్వార్యంలో సీతారాం ఏచూరికి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దోపిడి, సామాజిక వివక్షలేని భారతదేశం కోసం తమ జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడని కొనియాడారు. విద్యార్థి దశలోనే ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ తీవ్రంగా వ్యతిరేకించి ప్రజాస్వామ్య హక్కుల కోసం నిలబడిన వ్యక్తి ఏచూరి అని అన్నారు. ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ కోసం కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ రద్దుకోసం ప్రతిఒక్కరికి ఉపాది కల్పించి జీవన భద్రత కోసం చివరి వరకు పోరాడిన మానవతావదన్నారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయితీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మారుతీరావు, తదితరులు పాల్గొన్నారు.

ఏచూరికి ఘనంగా నివాళి

గిద్దలూరు : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి మృతిపట్ల సీపీఎం, ఎస్ఎఫ్ఐ నాయకులు నివాళులు అర్పించారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో సీతారామ్ ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. దేశం ఒక మంచి నాయకుడిని కోల్పోయిందని పేర్కొన్నారు. సీపీఎం నాయకులు టి.ఆవులయ్య, బి.హర్ష, ఎం.గిరి, తదితరులు పాల్గొన్నారు.

గూడేలలో పీఎం జన్‌మన్‌పై అవగాహన


జన్‌మన్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెద్దదోర్నాల, సెప్టెంబరు 13: కేంద్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీఎం జన్‌మన్‌పై గిరిజన గ్రామాల్లో శుక్రవారం అవగాహన కల్పించారు. మండలంలోని ఎగువ చెర్లోపల్లి, నల్లగుంట్ల గూడెం, అయ్యన్న కుంట, కొత్తూరు, మోట్ల మల్లికార్జునపురం, బలిజేపల్లి చెంచుగూడేల్లో ఆయా గ్రామ కార్యదర్శులు రంగయ్య, రామకోటమ్మ గిరిజనులకు జన్మన్‌పై అవగాహన కల్పించారు. గ్రామాలకు రహదారుల నిర్మాణాలు, విద్యుత్తు సౌకర్యం ఏర్పాటు, ఇంటింటికీ తాగునీటి కొళాయి, పౌష్టికాహారం అందజేత, నాణ్యమైన విద్య వైద్యం తదితరములు లభిస్తాన్నారు. 11 రకాల పథకాలు అమలుచేస్తున్నారని సద్వినియోగ పర్చుకుని అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ టీఏ షేక్ లాలఅహ్మద్, కోఆర్డినేటర్ మోహన్‌రావు, సిబ్బంది గురవయ్య, బాలరాజు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

రేపు ఉచిత వైద్యశిబిరం

గిద్దలూరు, సెప్టెంబరు 13 : పట్టణంలోని విశ్వభారతి పాఠశాల ఆవరణలో ఈ నెల 15న ఆదివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు డాక్టర్ బ్రహ్మానందరెడ్డి ఆస్పత్రి, ఒంగోలు కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నారు. బీపీ, షుగర్, 2డి, ఎకో, ఈసీజీ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామన్నారు. మందులు సైతం ఉచితంగా ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. షుగర్, స్త్రీల, లివర్, ప్రేగు, కీళ్ల, గుండె, నేత్ర, లాప్రోస్కోపిక్ వైద్యనిపుణులు శిబిరానికి హాజరవుతారన్నారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఎన్.బ్రహ్మానందరెడ్డి కోరారు.

దారిని అడ్డుకుంటున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి


వినతిపత్రం అందజేస్తున్న ఎస్సీకాలనీ వాసులు

కంభం, సెప్టెంబరు 13 : మండలంలోని కందులాపురం పంచాయతీ పరిధిలో సర్వే నెంబరు 546/1 నందు పూర్వికుల నుంచి ఉపయోగిస్తున్న ఎడ్లబండి దారిని ఆక్రమించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మాలమహానాడు జిల్లా అధ్యక్షులు కల్వకూరి అబ్రహం ఆధ్వర్యంలో పలువురు ఎంపీడీవో మస్తాన్‌వలి, తహసీల్దార్, ఎస్సైలకు వినతిపత్రాలు అందజేశారు. ఎడ్లబండి దారిని కందులాపురానికి చెందిన రాజు ఆక్రమించాడని, ఇదేమని అడిగితే ఈ దారి నుంచి ఎవ్వరిని వెళ్లనివ్వనని బెదిరిస్తున్నాడన్నారు. కావున దారిలో తిరిగే విధంగా చూడాలని ఎస్సీకాలనీవాసులు వినతిపత్రం అందజేశారు.

17న విశ్వకర్మ జయంతి

గిద్దలూరు, సెప్టెంబరు 13 : పట్టణంలోని రేడియోబావి కూడలిలోని శ్రీఅభయాంజనేయస్వామి దేవాలయంలో శ్రీవిరాట్ విశ్వకర్మ జయంతిని ఈ నెల 17న ఉదయం 10గంటల నుండి నిర్వహిస్తున్నట్లు విరాట్ విశ్వకర్మ అభివృద్ధి సమితి అధ్యక్షులు కాయల కోటిలింగాచారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విశ్వకర్మ యజ్ఞాన్ని నిర్వహిస్తున్నామని, విశ్వబ్రాహ్మణులందరూ హాజరుకావాలని కోరారు.

బీసీ కాలనీలో నీటి సరఫరా పునరుద్ధరణ


నీరు పట్టుకుంటున్న బీసీ కాలనీ మహిళ

తర్లుపాడు, సెప్టెంబరు 13: తర్లుపాడులోని రైల్వే గేటు వద్ద నున్న బీసీ కాలనీకి ఎట్టకేలకు మంచినీటి సరఫరాను పునరుద్దరించారు. బీసీ కాలనీలో దాహం కేకలు అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితం కావడంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు హుటాహుటినా నాయుడుపల్లెలో ఉన్న మోటర్ తీసుకొచ్చి బీసీ కాలనీకి సరఫరా చేసే బోరుకు బిగించారు. ఎట్టకేలకు నీటి సరఫరా పునరుద్దరించారు. ఇప్పటి వరకు మంచినీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురుకావటంతో అధికారులు స్పందించి నీటి సరఫరా చేయటంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా హిందీ దివస్ వేడుకలు

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 13: హిందీ దివస్ వేడుకలు స్థానిక వాసవి విద్యానికేతన్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ కందెపు రంగయ్య మాట్లాడుతూ.. హిందీ బాషా మన జాతీయ బాష అన్నారు. ప్రతిఒక్కరూ హిందీ బాషను రాయటం, మాట్లాడుకోవటం నేర్చుకోవాలన్నారు. హిందీభాష ప్రపంచంలో కూడా అత్యున్నత స్థానాన్ని చూరగొందని పాఠశాల ఏవో రంజిత్‌కుమార్ అన్నారు. హిందీపై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. విద్యార్థులు హిందీభాషలో ఉపన్యసించారు. పలు ప్రాజెక్టు పనులు చేసి సృజనాత్మకతను ప్రదర్శించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు వివరించారు. స్థానిక సాయిబాలాజీ ఉన్నత పాఠశాలలో కరస్పాండెంట్ ప్రకాశ్‌రావు, ప్రిన్సిపాల్ సయ్యద్ మస్తాన్‌వలిల ఆధ్వర్యంలో హిందీదివస్ నిర్వహించారు.

17 నుంచి స్వచ్ఛత కార్యక్రమాలు

గిద్దలూరు, సెప్టెంబరు 13 : గిద్దలూరు మున్సిపాలిటీ పరిధిలో ఈ నెల 17 నుంచి 15 రోజులపాటు స్వచ్ఛతసేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటదాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ 15 రోజులపాటు పారిశుధ్యం, తాగునీరు, వీధిదీపాలు, పారిశుధ్య కార్మికులకు వైద్యశిబిరాలు, మరుగుదొడ్ల పరిశుభ్రత, మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. వీధినాటకాలు, బుర్రకథల సహాయంతో స్వచ్ఛతపై ప్రజలను చైతన్యవంతం చేస్తామన్నారు.

అటవీశాఖ నూతన కార్యాలయం ప్రారంభం

పెద్ద దోర్నాల, సెప్టెంబరు 13: స్థానిక అటవీ క్షేత్ర సముదాయం ఆవరణలో నూతనంగా నిర్మించిన కొర్రప్రోలు రేంజి కార్యాలయాన్ని మార్కాపురం డీఎఫ్‌వో విఘ్నేశ్ అప్పావ్ శుక్రవారం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో సబ్ డీఎఫ్‌వో వేణు, కొర్రప్రోలు,దోర్నాల రేంజి అధికారులు ప్రసన్న జ్యోతి, విశ్వేశ్వరరావు, సెక్షన్ అధికారి అన్వర్ భాష, అసిస్టెంటు సెక్షన్ అధికారి సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్‌అదాలత్

మార్కాపురం, సెప్టెంబరు 13: స్థానిక కోర్టు ఆవరణలో ఈ నెల 14న జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో రాజీపడదగ్గ అన్ని రకాల కేసులను పరిష్కరించడం జరుగుతుందన్నారు. మొత్తం నాలుగు బెంచీలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

ఆర్‌బీఐ క్విజ్ పోటీలపై అవగాహన

పెద్ద దోర్నాల, సెప్టెంబరు 13: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆర్‌బీఐ క్విజ్ పోటీలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్ సావిత్రి మాట్లాడుతూ రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ఆర్‌బీఐ-90 పేరిట ఆన్‌లైన్‌లో క్విజ్ పోటీలు నిర్వహిస్తోందని సద్వినియోగ పర్చుకోవాలన్నారు. బ్యాంకు అధికారి రవి మాట్లాడుతూ ఈ పోటీలకు ఈ నెల 17వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, 19నుండి 21వ తేదీ రాత్రి 9 గంటల వరకు ఆన్‌లైన్‌లో పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. మూడు విధాలుగా బహుమతులుంటాయని, నేషనల్, స్టేట్, జోనల్ స్థాయిలో ఉంటాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినులకు కేన్సర్‌పై అవగాహన

పెద్ద దోర్నాల, సెప్టెంబరు 13: స్థానిక కస్తూరిబా బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు క్యాన్సర్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ ఎల్.అనూష అధ్యక్షతన విజయవాడ జనక్రాంతి ట్రస్టు సౌజన్యంతో మార్కాపురం శ్రీలక్ష్మీ చెన్నకేశవ వికాస తరంగిణీ ఆధ్వర్యంలో అమ్మాయిలు ఎదుర్కునే ఇబ్బందులపై పలు సూచనలు చేశారు. అనంతరం శానిటరీ న్యాప్‌కిన్స్ అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షురాలు గోళ్ల.వరలక్ష్మీ, సభ్యులు విజయలక్ష్మీ, లక్ష్మీ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పోషణ మాసోత్సవాలు

పొదిలి, సెప్టెంబరు 13 : పట్టణంలో ఓబులశెట్టివారి వీధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీవో సుధామారుతి పాల్గొని మాట్లాడారు. గర్భిణులు బాలింతలు, తల్లిదండ్రులకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గర్భందాల్చిన నాటి నుండి ప్రసవం అయ్యేంత వరకు వైద్యపరీక్షలు చేయిస్తుండాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సావిత్రి, అంగన్‌వాడీ వర్కర్స్ శోభ, అరుణ, పద్మావతి, సౌమ్య పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం అవసరం

మార్కాపురం వన్‌టౌన్ : బాలింతలు, గర్భిణీలకు పోషకాలతో నిండిన పౌష్టికాహారం అవసరం అని సీడీపీఓ సుశీలాదేవి అన్నారు. స్థానిక కూరగాయల మార్కెట్ సమీపంలోని 42, 43 అంగన్‌వాడీ కేంద్రాలలో శుక్రవారం పౌష్టికాహారం మాసోత్సవం సందర్భంగా పౌష్టికాహార ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో కార్యకర్తలు వెంకటరత్నం, పద్మావతి, నారాయణమ్మ, ధనలక్ష్మీ, ఏఎన్ఎం అనిత, ఆశా కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

తండ్రిపై తనయుడు కత్తితో దాడి

దొనకొండ, సెప్టెంబరు 13: తండ్రిపై తనయుడు కత్తితో దాడిచేసి తీవ్రంగా గాయపర్చాడు. ఈఘటన మండలంలోని రుద్రసముద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. అందిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు వల్లపునేని పెద్దవీరయ్యచౌదరిపై పెద్ద కుమారుడు వీరాచారి కత్తితో దాడి చేయడంతో బలమైన గాయాలయ్యాయి. 108 సిబ్బంది క్షతగాత్రుడిని మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు సమాచారం.

పాము కాటుకు మహిళ మృతి

తాళ్లూరు, సెప్టెంబరు 13: మండలంలోని మాధవరం గ్రామంలో పాము కాటుకు గురై మహిళ మృతి చెందింది. అందిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన సోము శివారెడ్డి, భార్య అన్నపూర్ణలు శుక్రవారం సాయంత్రం పశువుల మేతకు వెళ్లారు. మేత కోస్తున్న అన్నపూర్ణ(40) పాము కాటుకు గురైంది. వెంటనే తాళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ ఇంజక్షన్ వేసి ఒంగోలుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. ఆమెకు భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అలాగే, కొత్తపాలెం గ్రామానికి చెందిన ఆవుల పున్నారెడ్డి పొలంలో పనిచేస్తుండగా పాము కాటుకు గురయ్యాడు. తాళ్లూరు పీహెచ్‌సీలో పాముకాటు ఇంజక్షన్ వేయించారు. అతని ఆరోగ్య పరిస్థితి పట్ల ఆందోళ చెందాల్సిన అవసరం లేదని వైద్యసిబ్బంది తెలిపారు. మెరుగైన చికిత్స కోసం ఒంగోలుకు తరలించారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

దొనకొండ, సెప్టెంబరు 13: క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని గౌతమి డిగ్రీ కళాశాల ప్రిన్సి పాల్ రామయోగి అన్నారు. కళాశాలలో సీనియర్స్, జూనియర్స్ అనే తేడాలేకుండా అందరూ ఐక్యంగా నడుచుకోవాలన్నారు. శుక్రవారం జరిగిన ఫుడ్ ఫెస్టివల్‌లో విద్యార్థులు తయారు చేసుకొనివచ్చిన 16 రకాల వంటకాల్లో ఉత్తమ వాటిని ఎంపికచేశారు. వై.నాగమ్మ, షేక్ షేమియా, డి.ఉమాలు తయారుచేసిన వంటకాలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. అలాగే, ప్రతి విద్యార్థికి బహుమతి అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అడ్మిన్ నాని, అధ్యాపకులు ఎస్.వెంకటేశ్వరరెడ్డి, వి.దేవదానం, డి.వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'సెయింట్ మార్క్ స్కూల్‌లో ముందస్తు ఉత్సవాలు'



ఓనమ్ వేడుకలు జరుపుకొంటున్న సెయింట్ మార్క్ విద్యార్థులు

పామూరు, సెప్టెంబరు 13: కేరళ రాష్ట్రంలో జరుపుకొనే అతి పెద్ద పండుగైన ఓనమ్ మన రాష్ట్రంలో జరుపుకొనే సంక్రాంతి పండుగ లాంటిదని సెయింట్ మార్క్ స్కూల్ కరస్పాండెంట్ ఎం.జయకుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక పాఠశాలలో ముందస్తు వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు కేరళ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలతో కూడిన నృత్యాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసుల సహకారంతో నిమజ్జనం ప్రశాంతం

పామూరు, సెప్టెంబరు 13: పామూరు పట్టణం, మండలంలో వినాయక విగ్రహాల నిమజ్జనం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు ఇవ్వకుండా పోలీసుల సహకారంతో జరిగిందని టీడీపీ నాయకులు యారవ శ్రీనివాసులు, బొల్లా నరసింహారావు అన్నారు. అందుకు పామూరు పోలీసులు అందించిన సహకారం మరువలేమన్నారు. ఈసందర్భంగా శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో వినాయక మండపాల ఉత్సవ కమిటీ నిర్వాహకులతో కలిసి సీఐ ఎం.భీమానాయక్, ఇన్‌చార్జ్ ఎస్ఐ ఎం.వెంకటరాజేష్‌ను సత్కరించారు. కార్యక్రమంలో సయ్యద్ అమీర్‌బాబు, ఇర్రి కోటిరెడ్డి, పిడిగు శ్రీనువాసులు, గోళ్ల వీరబాబు, శ్రీరాం శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

కాగా, మండలంలోని తూర్పుకట్టకిందపల్లి గ్రామంలో ఏర్పాటుచేసిన వినాయక మండపంలో టీడీపీ నాయకులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, నీరుకట్టు హరిబాబు, నీరుకట్టు మాల్యాద్రి, మండ్ల రమణయ్య గుత్తి మహేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి ప్రజాదరణ



దూబగుంటలో బీజేపీ సభ్యత్వాలను నమోదు చేస్తున్న కేవీ రమణయ్య

పామూరు, సెప్టెంబరు 13: బీజేపీకి ప్రజాదరణ లభిస్తుందని ఆపార్టీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని పడమటపల్లి, కాటంవారిపల్లి, తాతాయ్యపల్లి గ్రామాల్లో బీజేపీ సభ్యత్వాల నమోదు కార్యక్రమాలను చేపట్టారు. కేంద్రంలో నరేంద్ర మోదీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ సభ్యత్వాలు చేపట్టారు. కార్యక్రమాల్లో బీజేపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు జె.చినసుబ్బయ్య యు.శ్రీను, విజయకుమారాచారి తదితరులు పాల్గొన్నారు.

తూర్పుగంగవరంలో లక్ష్మీగణపతి హోమం

తాళ్లూరు, సెప్టెంబరు 13: తూర్పుగంగవరం గ్రామంలోని యూనియన్ బ్యాంక్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన వినాయకస్వామి మందిరం వద్ద శుక్రవారం లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. ఒంగోలుకు చెందిన మఠంపల్లి దక్షిణామూర్తి ఆధ్వర్యంలో అర్చకస్వాముల మంత్రోచ్ఛరణల మధ్య వైభవంగా హోమం నిర్వహించారు. కార్యక్రమంలో గుంటిగంగ బ్రాహ్మణ అన్నదాన సత్రం అధ్యక్షుడు యల్లాప్రగడ లక్ష్మీ, కన్నయ్య దంపతులు, మోహన్‌రావు దంపతులు, తదితరులు పాల్గొన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఏచూరికి నివాళి

కనిగిరి, సెప్టెంబరు 13: ఏచూరి మరణం కమ్యూనిస్ట్ లోకానికి తీరని లోటని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పీసీ కేశవరావు అన్నారు. స్థానిక మండల కార్యాలయం ప్రాంగణంలో శుక్రవారం జరిగిన సీపీఎం జాతీయ ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభలో ఆయన మాట్లాడారు. అట్టడుగు వర్గాల హక్కుల కోసం రాజీలేని పోరాటం చేశారన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని ప్రతి సీపీఎం కార్యకర్త ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తొలుత సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బషీరా, కృష్ణమూర్తి, నరేంద్ర, పాండురంగారావు, మాలకొండారెడ్డి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సర్పంచ్‌ల విరాళం

దర్శి, సెప్టెంబరు 13: మండలంలోని పలువురు సర్పంచ్‌లు వరద బాధితుల సహాయార్థం శుక్రవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులను దర్శిలో కలిసి లక్ష రూపాయల విరాళం అందజేశారు. జముకులదిన్నె సర్పంచ్ మర్రి సత్యన్నారాయణ రూ.30 వేలు, కొత్తపల్లి, బండి వెనిగండ్ల, రాజంపల్లి, మారెడ్డిపల్లి సర్పంచ్‌లు రూ.10 వేల చొప్పున, వెంకటాచలంపల్లి, బొట్లపాలెం, తూర్పువెంకటాపురం, భీమవరం సర్పంచ్‌లు రూ.5 వేల వంతున విరాళాలు అందజేశారు. మరికొందరు సర్పంచ్‌లు ఉమ్మడిగా రూ.10వేలు విరాళం ఇచ్చారు.

ఈసందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ వరద బాధితుల సహాయార్థం దర్శి నియోజకవర్గ ప్రజలు ముందుకువచ్చి అధిక మొత్తంలో విరాళాలు అందజేయటం అభినందనీయమన్నారు. బాధితులను ఆదుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

పగిలిన పైపులైన్‌లు.. నిలిచిన సరఫరా

» తాగునీటి కోసం మారెళ్లవాసుల పాట్లు



రక్షిత మంచి నీటి పథకం ట్యాంక్

ముండ్లమూరు, సెప్టెంబరు 13: మండలంలోని మారెళ్ల గ్రామానికి పదిరోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో పడరాని పాట్లు పడుతున్నారు. పైలట్ ప్రాజెక్టు పథకం ద్వారా గుండ్లకమ్మ నుంచి గ్రామంలో నిర్మించిన రక్షిత మంచి నీటి ట్యాంక్‌కు నీరు సరఫరా అవుతుంది. మధ్యలో పైపులు పగిలిపోవటంతో పది రోజులుగా సరఫరా నిలిచిపోవడంతో మారెళ్ల గ్రామస్థులు తాగునీటి కోసం అలమటిస్తున్నారు. రెండు దశాబ్దాల క్రితం అప్పటి మార్టూరు ఎమ్మెల్యే స్వర్గీయ గొట్టిపాటి నరసింహారావు నిధులు మంజూరు చేయడంతో పైలట్ ప్రాజెక్టు నిర్మాణం జరగడంతో మారెళ్ల ప్రజలకు నీటి సమస్య తీరింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఈపథకాన్ని వారి చేతుల్లోకి తీసుకున్నారు. విద్యుత్ బిల్లులతో భారం కావటంతో వారిలో కొంత అనైక్యత ఏర్పడింది. ఇంతలోనే పది రోజుల క్రితం గుండ్లకమ్మ నది నుంచి రక్షిత మంచి నీటి పథకానికి వచ్చే పైపులైన్‌లు పగిలిపోవటంతో సరఫరా నిలిచిపోయింది. గ్రామంలో ఐదు వేల మంది జనాభా ఉన్నారు. గ్రామస్థులు పైలట్ ప్రాజెక్టు ద్వారా సరఫరా అయ్యే నీటిని ఉపయోగించుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో తాగునీరు నిలిచిపోవటంతో మినరల్ వాటర్ కొనుగోలు చేసి దప్పిక తీర్చుకుంటున్నారు. కొంతమంది అద్దంకి వెళ్ళి నీటిని తెచ్చుకుంటున్నారు. ఆర్థిక స్థోమత లేనివారు గ్రామంలో ఉన్న చేతి పంపుల ద్వారా సరఫరా అవుతున్న నీటిని తాగుతున్నారు. పంచాయతీ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపులైన్‌లకు మరమ్మతులు చేసి తాగునీటి సమస్యను తీర్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి



ఎక్సరే యూనిట్ పనితీరు గురించి ఆరాతీస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి, సెప్టెంబరు 13: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆసుపత్రిలో ఎక్స్‌రే యూనిట్‌ను పరిశీలించారు. ఈ యూనిట్ సేవలు ఎలా అందుతున్నాయో రోగులను అడిగి తెలుసుకున్నారు. డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలించి వారికి అందుతున్న సేవలుపై ఆరా తీశారు. ఎక్సరే యూనిట్ కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న పరికరాల వినియోగంపై అడిగి తెలుసుకున్నారు. వాటిని వైద్యులు ఎందుకు వినియోగించటం లేదని సూపరింటెండెంట్ అబ్దుల్ కలాంను ప్రశ్నించారు.

ఆసుపత్రిలో వసతులు, పరికరాలు ఉన్నా రోగుల అవసరాలకు ఎందుకు వినియోగించటం లేదన్నారు. తక్షణమే వాటిని వినియోగంలోకి తీసుకు రావాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఆసుపత్రిలో జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. సీలింగ్ పనుల పై కాంట్రాక్టర్‌కు సూచనలు చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అబ్దుల్‌కలాం, ఎస్ఐ త్యాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం అభినందనీయం

కనిగిరి, సెప్టెంబరు 13: వరద బాధితులకు సాయం అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టర్ షేక్ ముస్తాక్ ఎమ్మెల్యేకు రూ.20 వేలు చెక్కును వరద బాధితుల సహాయనిధికి అందజేశారు. కార్యక్రమంలో షరీఫ్, గయాజ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఉనికి కోల్పోయిన భవిత కేంద్రాలు

» సమీప పాఠశాలల్లోకి విలీనం

» విద్యార్థులకు తప్పని అవస్థలు



మూసివేసిన పామూరు భవిత కేంద్రం

పామూరు, సెప్టెంబరు 13: దివ్యాంగ చిన్నారులు, మానసిక వైకల్యంతో బాధపడుతున్న పిల్లలకు ఆరోగ్యం, వికాశంపరంగా వారి భవిష్యత్తును తీర్చిదిద్దాలనే ఆశయంతో ప్రవేశపెట్టిన భవిత కేంద్రాలు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉనికి కోల్పోయాయి. సమీప పాఠశాలల్లోకి భవిత కేంద్రాలను విలీనం చేయడంతో పిల్లలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం పక్కన భవిత కేంద్రాన్ని (ప్రత్యేక అవసరాలు కల్గిన పిల్లలు) సర్వశిక్ష అభియాన్ నిధులతో నిర్మించారు. భవనం లోపల ఫ్లోరింగ్ కుంగిపోయింది. దాంతో పిల్లలు కూర్చొని, ఆటలు ఆడుకోవడానికి ఇబ్బందికరంగా మారింది. ఫ్లోరింగ్ మరమ్మతులు చేసేందుకు తగిన నిధులు లేకపోవడంతో చేపట్టలేదు. భవిత కేంద్రంలో సుమారు 24 మంది పిల్లలు ఉన్నారు. వారి సంరక్షణ కోసం ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు.

గత వైసీపీ ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలను సమీప పాఠశాలల్లోకి విలీనం చేశారు. ఈక్రమంలో భవిత కేంద్రాన్ని స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోకి విలీనం చేశారు. ఈపాఠశాలలో సుమారు 35 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఉన్న విద్యార్థులకు సరిపడ గదులు లేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో భవిత పిల్లలను చేర్చడంతో పలు సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రత్యేక అవసరాల పిల్లలతో పాఠశాల విద్యార్థులు ఇమడలేకపోతున్నారు. భవిత కేంద్రంలో మరమ్మతు పనులు చేపట్టి ప్రత్యేకావసరాల పిల్లల ఇబ్బందులు తొలగించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

వైసీపీ కుట్రల నుంచి రాష్ట్రాన్ని కాపాడాలి

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

» పలు మండపాల వద్ద పూజలు



ముండ్లమూరు: పసుపుగల్లులో పూజలు చేస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు

దర్శి, సెప్టెంబరు 13: వైసీపీ రాజకీయ కుట్రల నుంచి రాష్ట్రాన్ని కాపాడాలని విఘ్నేశ్వరుడిని మొక్కుకున్నట్లు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు పేర్కొన్నారు. దర్శి పట్టణంలోని పుచ్చల మిట్టలో వినాయక చవితి సందర్భంగా నెలకొల్పిన గణేష్ విగ్రహం వద్ద శుక్రవారం వారు పూజలు చేశారు. ఈసందర్భంగా నిర్వాహకులు ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం రాత్రింబవళ్లు పనిచేస్తుందన్నారు. ఇటీవల సంభవించిన వర దలతో కృష్ణా, గుంటూరు జిల్లాలు అతలాకుతలం అయినప్పటికీ కూటమి ప్రభుత్వం సమర్థపాలనతో అతితక్కువ కాలంలో మామూలు పరిస్థితి చేరుకుందన్నారు.

దర్శి నియోజకవర్గంలో నాయకులు, దాతలు రూ.37.16 లక్షలు నిధులు విరాళం అందించటం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. దాతల స్ఫూర్తితో తాము రూ.10 లక్షలు విరాళం కలిపి మొత్తం రూ.47.16 లక్షల చెక్కును సీఎం చంద్రబాబుకు అందించినట్టు చెప్పారు. వైసీపీ నాయకులు ఎలాంటి సహాయం చేయకపోగా కుట్రలు పన్ని ప్రజలను ఇబ్బంది పెట్టే చర్యలు చేపట్టటం శోచనీయమన్నారు. రాష్ట్ర ప్రజలు అన్నీ విషయాలు గమనిస్తున్నారని, భవిష్యత్తులో వైసీపీకి మరింత గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వినాయకుని ఆశీస్సులు అందరిపై ఉండాలి

ముండ్లమూరు, సెప్టెంబరు 13: వినాయక స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని పసుపుగల్లులో వినాయకుని విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పసుపుగల్లు గ్రామస్థులపై వినాయక స్వామి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. ఈసందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ లలిత్‌సాగర్, కూరపాటి శ్రీనివాసరావు, బిజ్జం వెంకట సుబ్బారెడ్డి, గూడాల సాంబశివారెడ్డి, శివశంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గణనాథులకు ప్రత్యేక పూజలు

తాళ్లూరు, సెప్టెంబరు 13: మండలంలోని చింతలపాలెం గ్రామంలో చౌదరి యూత్ ఫోర్సు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణపతి నిమజ్జన కార్యక్రమంలో శుక్రవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్ సాగర్ దంపతులు పాల్గొన్నారు. ఈసందర్భంగా గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా, మండలంలోనిలక్కవరం, బొద్దికూరపాడు, మాధవరం, చింతపాలెం, శివరాపురం గ్రామాల్లో వినాయ విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఎస్ఐ ఎస్.మల్లికార్జునరావు నేతృత్వంలో బందోబస్తు నిర్వహించారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం



కనిగిరి: పోషకాహారంపై గర్భిణులకు అవగాహన కల్గిస్తున్న సూపర్‌వైజర్ పార్వతి

దొనకొండ, సెప్టెంబరు 13: పోషకాహారంతోనే ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుభాషిణి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని చిన్నగుడిపాడులో జరిగిన పోషకాహార మాసోత్సవాల కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలున్న చిరుధాన్యాలు, పప్పుదినుసులు, ఆకుకూరలు, కూరగాయలు, నెయ్యి, నూనె, గ్రుడ్డు, పాలు ఆహారంగా తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త పద్మ, పలువురు మహిళలు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

కనిగిరి, సెప్టెంబరు 13: చిరు ధాన్యాలు గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యానికి ఎంతోమేలు చేస్తాయని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పార్వతి అన్నారు. మండలంలోని కంచర్లవారిపల్లిలో శుక్రవారం పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈసందర్భంగా పోషకాహార లోగోలను ప్రదర్శిస్తూ ఒక్కో ఆహారంపై కలిగే ప్రయోజనాలను వివరించారు. గర్భం దాల్చినప్పటి నుంచి సరైన ఆహారం తీసుకుంటే పుట్టే బిడ్డ ఆరోగ్యంగా జన్మించి వారి ఎదుగుదలకు ఎంతో దోహదపడుతుందన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పామూరు: ప్రతిరోజు ఆకు కూరలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా రోగాలు దరిచేరవని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ తెలిపారు. మండలంలోని బొట్లగూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పౌష్టికాహార మాసోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ఆహారం తీసుకొనేముందు తమ చేతులను శుభ్రంగా నీటితో కడగాలని డాక్టర్ హరిబాబు సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం రామారావు, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

పీసీపల్లి, సెప్టెంబరు 13: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జరీనా అన్నారు. శుక్రవారం మండలంలోని మురుగుమ్మి అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన పౌష్టికాహార మాసోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గర్భిణులు సమతుల పోషకాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతకు గురికాకుండా ఉండడమే కాక, పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు విజయ, నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

తూర్పుగంగవరంలో లక్ష్మీగణపతి హోమం

తాళ్లూరు, సెప్టెంబరు 13: తూర్పుగంగవరం గ్రామంలోని యూనియన్ బ్యాంక్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన వినాయకస్వామి మందిరం వద్ద శుక్రవారం లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. ఒంగోలుకు చెందిన మఠంపల్లి దక్షిణామూర్తి ఆధ్వర్యంలో అర్చకస్వాముల మంత్రోచ్ఛరణల మధ్య వైభవంగా హోమం నిర్వహించారు. కార్యక్రమంలో గుంటిగంగ బ్రాహ్మణ అన్నదాన సత్రం అధ్యక్షుడు యల్లాప్రగడ లక్ష్మీ, కన్నయ్య దంపతులు, మోహన్‌రావు దంపతులు, తదితరులు పాల్గొన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



దర్శిలోని పార్క్‌కు పునరుద్ధరించిన ఎన్టీఆర్ పేరు

'పల్లెవనం'కు ఎన్టీఆర్ పేరు పునరుద్ధరణ

దర్శి, సెప్టెంబరు 13: గత తెలుగుదేశం ప్రభుత్వంలో నిర్మించిన పల్లెవనం పార్క్‌కు ఎన్టీఆర్ పేరును పునరుద్ధరించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్టీఆర్ పేరును తొలగించారు. ఆసమయంలో టీడీపీ అభిమానులు, ప్రజలు అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ అప్పటి పాలకులు పట్టించుకోలేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో దర్శి- కురిచేడు రోడ్డులో మూడు ఎకరాల్లో సర్వాంగసుందరంగా పార్క్ నిర్మించారు. ఆ సందర్భంగా ఎన్టీఆర్ పల్లెవనం పార్క్‌గా నామకరణం చేశారు. టీడీపీ అధికారంలో ఉన్న కాలంలో నిత్యం వందలాది మంది పార్క్‌కు వెళ్లడంతో కళకళలాడేది. వైసీపీ అధికారంలో పార్క్ నిర్వహణను పూర్తిగా వదిలేశారు. అప్పటి పాలకులు ఎన్టీఆర్ పేరు తొలగించి విమర్శలపాలయ్యారు. ఆతర్వాత పార్క్ అభివృద్ధి కోసం విడుదలైన నిధులు దుర్వినియోగం అయినప్పటికీ పట్టించుకున్న నాథుడే లేడు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో అధికారులు ఆగమేఘాల మీద పల్లెవనం పార్క్‌కు ఎన్టీఆర్ పేరు పునరుద్ధరించి బోర్డు ఏర్పాటుచేశారు. వైసీపీ పాలకులు అనవసరంగా వివాదాలు సృష్టించి అబాసుపాలయ్యారని ప్రజలు చర్చించుకుంటున్నారు.

రహదారిని కమ్మేసిన చిల్లచెట్లు

» రాకపోకలకు ఇబ్బందులు » పట్టించుకోని అధికారులు



సిద్దాయిపాలెం వద్ద చిల్లచెట్లతో మూసుకుపోయిన రహదారి

దొనకొండ, సెప్టెంబరు 13: చిల్లచెట్లు దట్టంగా పెరిగి రహదారిని కమ్మేయడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని కొచ్చెర్లకోట నుంచిమార్కాపురం వెళ్లే ప్రధాన రహదారిలో సిద్దాయిపాలెం గ్రామం వద్ద రహదారికి ఇరువైపులా చిల్లచెట్లు దట్టంగా పెరిగి రోడ్డు మూసుకుపోయింది. దీంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చిన సమయంలో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదమరిస్తే ప్రమాదాలు జరిగే పరిస్థితి నెలకొంది. ప్రధాన రహదారిలో గత కొన్నినెలలుగా ఇరువైపులా చిల్లచెట్లు పెరిగి ప్రమాదకరంగా ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

ఈమార్గంలో మార్కాపురంకు ప్రతినిత్యం అధిక సంఖ్యలో వాహనచోదకులు రాకపోకలు జరుపుతుంటారు. రాత్రివేళ ప్రయాణం మరీ ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు ప్రమాదాలు జరగకముందే రహదారికి ఇరువైపులా పెరిగిన చిల్లచెట్లు తొలగించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



గుంటూరు రైల్వే భళా



- ఎన్ఎస్‌జీ-2 హోదాకు ఎగబాగిన స్టేషన్
- ప్రయాణికులు, ఆదాయం పెరగడమే కారణం
- గత ఏడాదిలో స్టేషన్ ఆదాయం రూ.110.70 కోట్లు
- రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలకు నిధులు
- ఎన్ఎస్‌జీ-4 హోదాలో సత్తెనపల్లి, మంగళగిరి రైల్వేస్టేషన్లు
- ఎన్ఎస్‌జీ-5లో రేపల్లె, నరసరావుపేట, పిడుగురాళ్ల, వినుకొండ, మాచర్ల

గుంటూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నాన్ సబర్బన్ గ్రూపు(ఎన్ఎస్‌జీ)-3 కేటిగిరీ నుంచి గుంటూరు రైల్వేస్టేషన్ ఎన్ఎస్‌జీ-2కి ఎగబాకింది. ఈ స్టేషన్ నుంచి ప్రయాణికుల సంఖ్య పెరగడం, టిక్కెట్ చార్జీల రూపంలో ఆదాయం కూడా పెరిగిన కారణంగా రైల్వేబోర్డు ఈ నిర్ణయాన్ని తీసుకుంది. దేశ వ్యాప్తంగా వివిధ రైల్వేస్టేషన్లలో ప్రయాణికుల సంఖ్య, ఆదాయం ఆధారంగా నాన్ సబర్బన్ గ్రూపు (ఎన్ఎస్‌జీ) స్టేషన్లను వర్గీకరించింది. అందులో గుంటూరు రైల్వేస్టేషన్‌ని ఎన్ఎస్‌జీ-2లోకి ప్రతిపాదిస్తున్నట్లు తాజాగా జాబితాని విడుదల చేసింది. దీని వల్ల రాబోయే రోజుల్లో ప్రయాణికులకు సౌకర్యాలను మెరుగుపరచడానికి రైల్వే శాఖ అధిక మొత్తంలో నిధులు విడుదల చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఎన్ఎస్‌జీ స్టేషన్ల నుంచి ప్రయాణించిన ప్యాసింజర్ల సంఖ్య, ఆదాయం ఆధారంగా చేసుకుని రైల్వే బోర్డు వర్గీకరించింది. అలానే సబర్బన్, హాల్ట్ స్టేషన్లను కూడా కేటిగిరైజేషన్ చేసింది. గుంటూరు రైల్వేస్టేసన్ నుంచి రిజర్వుడ్ బోగీల్లో 16 లక్షల 63 వేల 252 మంది, అన్ రిజర్వుడ్ బోగీల్లో 42 లక్షల 64 వేల 7 8 7 మంది ప్రయాణించారు. దీంతో మొత్తంగా 59 లక్షల 28 వేల 39 మంది గత ఆర్థిక సంవత్సరంలో ఈ స్టేషన్ నుంచి ప్రయాణించారు. తద్వారా రిజర్వుడ్ టిక్కెట్ల ద్వారా రూ.71 కోట్ల 8 లక్షల 71 వేల 21, అన్ రిజర్వుడ్ టిక్కెట్ల ద్వారా రూ.39 కోట్ల 62 లక్షల 26 వేల 561 కలిపి మొత్తం 110 కోట్ల 70 లక్షల 97 వేల 582 ఆదాయం వచ్చింది. దీనిని ఆధారంగా చేసుకుని రైల్వే బోర్డు గుంటూరు రైల్వేస్టేషన్‌ని ఎన్ఎస్‌జీ-2 కేటిగిరీకి ప్రతిపాదించింది. కాగా డివిజన్ పరిధిలోని నంద్యాల, నల్గొండ, సత్తెనపల్లి, మార్కాపురం రోడ్డు, మంగళగిరి రైల్వేస్టేషన్లకు ఎన్ఎస్‌జీ-4 హోదా దక్కింది. రేపల్లె, మిర్యాలగూడ, గిద్దలూరు, పిడుగురాళ్ల, నరసరావుపేట, నడికుడి, న్యూగుంటూరు, కంభం, వినుకొండ, దొనకొండ, మాచర్ల రైల్వేస్టేషన్లు ఎన్ఎస్‌జీ-5లో కొనసాగుతున్నాయి. ఇక వేమూరు, చినరావూరు, కురిచేడు, తర్లుపాడు, సోమిదేవిపల్లె, పేరేచర్ల, రామన్నపేట, విష్ణుపురం, పెదకాకాని హాల్ట్, గాజుపల్లి, నంబూరు, ఫిరంగిపురం, బెల్లంకొండ, చిట్యాల, నాగిరెడ్డిపల్లి, వేజండ్ల, గజ్జలకొండ, పెదకూరపాడు, సంగం జాగర్లమూడి, సిరిపురం, దిగువమెట్ట, నల్లపాడు, శావల్యాపురం, జగ్గంబొట్ల కృష్ణాపురం, బండారుపల్లి, రెడ్డిగూడెం, నుదురుపాడు, తుమ్మలచెరువు, తిప్పర్తి, సంతమాగులూరు, పొట్లపాడు, గుండ్లకమ్మ, వలిగొండ, మునుమాక, శ్రీరాంపురం, సాతులూరు, చీకటీగలపాలెం, పొందుగుల, యడవల్లి, చెలమ స్టేషన్లు ఎన్ఎస్‌జీ-6లో ఉన్నాయి. భట్టిప్రోలు హెచ్‌జీ-1, గురజాల, రెంటచింతల హాల్ట్, పల్లికోన హెచ్‌జీ-2, పెనుమర్రు హాల్ట్, వెల్లలచెరువు, జంపని హాల్ట్, కృష్ణమశెట్టిపల్లి హెచ్‌జీ-3లో కొనసాగుతున్నాయి.

తీరువా మారుతోంది



కాల్వలో ఉన్న గుర్రపు డెక్క తొలగించడంతో నీటి ప్రవాహంతో కళకళలాడుతున్న రేపల్లె మండల పరిధిలోని అరవపల్లి కాలువ

- సాగునీటి కాల్వల బాగుకే వ్యయం
- పూడికతీత, మరమ్మతులపై ప్రభుత్వం దృష్టి
- వసూళ్ల మొత్తం రైతుల కోసం వెచ్చించాలని నిర్ణయం
- రైతులపై శిస్తు భారానికే పరిమితమైన వైసీపీ పాలకులు
- బకాయిల వసూళ్లపైనే ఐదేళ్లు యావ.. ఊసేలేని మరమ్మతులు

సాగునీరు పారాల్సిన కాల్వలు.. పూడికతో పూడిపోయాయి. సాగునీరు ఉన్నా పంటలకు సకాలంలో అందక ఎండిపోతున్నాయి. పంటలకు నీటి కోసం రైతులు పాట్లు పడి చివరకు నష్టపోతున్నారు. రైతుల నుంచి నీటి తీరువా పేరు తో శిస్తులు వసూలు చేస్తున్నా కాల్వల బాగు గురించి గత ఐదేళ్లు వైసీపీ పాలకులకు పట్టలేదు. కాల్వలు అధ్వానంగా మారినా.. రైతులు నష్టపో తున్నా ప్రభుత్వం కనీసం కూడా దృష్టి సారించలేదు. అలాగని రైతుల నుంచి నీటి తీరువా వసూలు చేయ లేదా అంటే వడ్డీల భారం కూడా మోపారు. ఇలా వసూ లు చేసిన మొత్తాలతో కాల్వల బాగుకు వెచ్చించలేదు. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని రైతులు రెండు రకాలుగా నష్టపోవాల్సి వచ్చింది. ఈ పరిస్థి తుల్లో కూటమి ప్రభుత్వం కాల్వల బాగుపై దృష్టి సారించడమే కాకుండా నీటి తీరువా మొత్తాలని ఆ పరిధిలోని కాల్వల మరమ్మతులకే వ్యయం చేయాలని నిర్ణయించింది. కూటమి ప్రభుత్వ తాజా నిర్ణయంతో కాల్వలు బాగు పడటమే కాకుండా పంటలకు సాగు నీరు అందుతుందని తద్వారా తమకు లబ్ధి చేకూరుతుందని అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బాపట్ల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): శిస్తులు వసూలు చేయడం.. చెల్లించక పోతే రైతులపై వడ్డీల భారం మోపడం.. ఆ మొత్తాలను పక్కదారి పట్టించడం.. అన్నట్లుగా వైసీపీ ఐదేళ్ల పాలన సాగగా.. కూటమి ప్రభుత్వం ఆ విధానాన్ని మార్చేస్తోంది. రైతుల నుంచి వసూలు చేసిన శిస్తులను రైతుల కోసమే ఖర్చు చేయాలని నిర్ణయించింది. అన్నదాతల కనీస అవసరాలపైన వైసీపీ ప్రభుత్వం దృష్టిపెట్టలేదు. నీటి తీరువా వసూలు విషయంలో నాటి పాలకులు నానా ఇబ్బందులకు గురిచేశారు. చివరి ఆయకట్టుకు సాగునీరు అందక పోయినా, చివరికి మెట్ట భూమి రైతులు కూడా నీటి తీరువా చెల్లించాల్సిందే నని వైసీపీ ప్రభుత్వం అన్నదాతలను ఇబ్బంది పెట్టింది. కాల్వల్లో పూడిక తీతలు తీయకుండా ఐదేళ్ల పాటు కాలయాపన చేసిందే తప్ప రైతుల సాగునీటి వెతలను పట్టించుకోలేదు. అయినా నీటి తీరువా వసూలు చేయడంలో మాత్రం విపరీతమైన ఒత్తిడి తెచ్చి ఖజానా నింపుకుంది.

కాల్వల బాగుకు నిధులు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాల్వల బాగుపైన దృష్టిపెట్టి నిధులు విడుదలకు పచ్చజెండా ఊపింది. అంతటితో సరిపెట్టకుండా పనులను కూడా మొదలు పెట్టింది. అయితే ఈలోగా వరదలు రావడంతో పనులకు బ్రేక్ పడింది. పంట పొలాలు రోజుల తరబడి ముంపులో ఉండడానికి వైసీపీ ఐదేళ్ల నిద్రమత్తు కూడా ప్రధాన కారణంగా నిలిచింది. వరదలు తగ్గి సాధారణ పరిస్థితులు నెలకొనడంతో కాల్వల మరమ్మతుల పనులు మళ్లీ ఊపందుకున్నాయి. ఇదే సమయంలో రైతుల నుంచి రావాల్సిన నీటితీరువా బకాయిల విషయంలో దృష్టి పెట్టింది. అన్నదాతల దగ్గర నుంచి వసూలు చేసిన పన్నును తిరిగి వారి సంక్షేమానికే ఖర్చు పెట్టేలా కూటమి ప్రభుత్వం కార్యాచరణ రూపొందించి అడుగులు వేస్తోంది.

వినతిపత్రాలు ఇచ్చినా పట్టని పాలకులు

బాపట్ల జిల్లాగా ఆవిర్భవించిన తొలి రెండేళ్లలో నీటి తీరువా కింద రైతుల నుంచి దాదాపు రూ.11 కోట్లను గత ప్రభుత్వం వసూలు చేసింది. నీటితీరువా మొత్తాన్ని సాగునీటి కాల్వల బాగుతో పాటు ఇరిగేషన్ పనుల కోసమే ఖర్చు చేయడం ఎప్పటి నుంచో వస్తున్న రివాజు. కానీ వాటికి వైసీపీ పాలకులు పాతరేసి యథేచ్ఛగా ఆ నిధులను పక్కదారి పట్టించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల చివరి ఆయకట్టుకు నీరందక రైతులు లబోదిబోమన్నారు. కాల్వల పూడికతీతపై డీఆర్సీ సమావేశంతో పాటు జడ్పీ సమావేశాల్లోనూ రైతులు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకున్న దాఖలాలు లేవు. పైగా రైతులపై విపరీతమైన ఒత్తిడి తెచ్చి మరీ నీటి తీరువా కట్టించుకోవడంలో మాత్రం గత ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపింది.

రైతులే స్వచ్ఛందంగా..

వైసీపీ ప్రభుత్వంలో కాల్వల బాగుపై వినతులు ఇచ్చి వేసారిన చివరకు రైతులు స్వచ్ఛందంగా బాగుచేసుకున్న ఉదంతాలు ఉన్నాయి. డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉండి భారీ వర్షాలు కురిసిన సమయంలో అవి పొంగి మురుగునీరు పొలాల్లోకి వచ్చి రోజుల తరబడి నిల్వ ఉండడంతో పైరు పాడైపోయేది. మొక్కుబడి తంతుగా పాలనా పరమైన అనుమతులు ఇచ్చిన పనులకు బిల్లులు చెల్లించకుండా వైసీపీ ప్రభుత్వం ఇబ్బందులు పెట్టడంతో అసంపూర్తిగా పనులు మిగిలిపోయాయి. వసూలు చేసిన నీటి తీరువా మొత్తాలతో ఆ బిల్లులు చెల్లించాల్సి ఉన్నా ఆ నిధులను పక్కదారి పట్టించడంతో రైతుల ఆవేదన ఆలకించే వారే లేకపోయారు.

104 పనులకు రూ.9 కోట్లు

కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే సాగునీటి కాల్వల బాగును అత్యంత ప్రాధాన్య అంశంగా తీసుకుంది. నీటితీరువా వసూళ్ల మొత్తంతో పాటు ప్రభుత్వం అదనంగా నిధులు విడుదల చేసింది. సాగునీటి కాల్వలను సంస్కరించడంతో పాటు చివరి ఆయకట్టు వరకు నీటిని అందించాలనే కృతనిశ్చయంతో కూటమి ప్రభుత్వం ఉండడంపై రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం కొలువు దీరగానే కాల్వల్లో పూడికతీత పనులతో పాటు గుర్రపుడెక్క, తూటుకాడ తొలగించ డంపై దృష్టి పెట్టింది. నీటి తీరువా నిధులు సక్రమంగా వినియోగించేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించడంతో బాగు చేసిన పంట కాల్వలు నీటి ప్రవాహంతో కళకళలాడుతున్నాయి. కేటాయించిన పనుల్లో ఇప్పటికే 50 శాతం ఒక కొలిక్కి రాగా త్వరలోనే అన్ని పూర్తయి కాల్వలు కొత్తరూపును సంతరించుకోనున్నాయి.

పనులు.. నిధులు

- గుంటూరు చానల్ పరిధిలో 5 పనులకు రూ.1.30 కోట్లు
- బాపట్ల జిల్లాలో 104 పనులకు రూ.9 కోట్లు
- తెనాలి డివిజన్‌లో 85 పనులకు రూ.5 కోట్లు
- పల్నాడు జిల్లాలో పనులకు రూ.2 కోట్లు



గుంటూరు ఛానల్

అక్రమాలపై.. మౌనం

- క్వార్ట్జ్, మట్టి తవ్వకాలపై చర్యలు శూన్యం
- త్రిపురాపురం కొండ పరిశీలనకే మైనింగ్ శాఖ పరిమితం
- తవ్వకాల్లో అధికార పార్టీ నేతల పాత్ర..
- వదిలేశారన్న విమర్శలు
- క్వార్ట్జ్ తరలింపుతో ప్రభుత్వ ఆదాయానికి గండి..
- పట్టించుకోని అధికారులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

త్రిపురాపురం కొండ కేంద్రంగా క్వార్ట్జ్.. మట్టి తవ్వకాలపై ఆంధ్రజ్యోతిలో ఇటీవల వెలువడిన కథనంపై మైనింగ్ శాఖ స్పందించింది. అధికారులు నరసింగపాడు, త్రిపురాపురం కొండలను పరిశీలించారు. అనుమతి పొందిన చోట కాకుండా వేరే ప్రాంతంలో తవ్వకాలు జరిగినట్లు మైనింగ్ శాఖ నిర్ధారించింది. దీంతో అక్రమార్కులపై చర్యలు తీసుకుంటారని అందరూ భావించారు. కానీ ఇంతవరకు అధికారులు ఆ దిశగా ప్రయత్నాలు తీసుకోకపోవడంపై అనుమానాలు వస్తున్నాయి. అక్రమంగా తవ్వకాలు జరిపి ఎగుమతికి సిద్ధం చేసిన క్వార్ట్జ్



ఎగుమతికి ప్రాసెస్ చేసిన క్వార్ట్జ్


నిల్వలను సీజ్ చేసి స్వాధీనం చేసుకోలేదు. కొండపై క్వార్ట్జ్ ప్రాసెసింగ్ కోసం ఏర్పాటు చేసిన యూనిట్‌ను సీజ్ చేయకపోవడం గమనార్హం. అధికార పార్టీ నేతలు అక్రమ తవ్వకాలు జరుపుతుండటంతో అధికారులు చర్యలు తీసుకోకుండా మిన్నకున్నారన్న విమర్శలున్నాయి. త్రిపురాపురం కొండను అక్రమార్కులు మింగేసినా పరిశీలనకే అధికారులు పరిమితమయ్యారు. ఏ మేరకు క్వార్ట్జ్, మట్టి తవ్వకాలు జరి పారు.. ఇందుకు బాధ్యులు ఎవరు.. వారి గుర్తింపు తదితరాల ఊసే మరిచారు. అధికార పార్టీ నేతల ఒత్తిడి వల్లే అక్రమార్కులపై చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలున్నాయి. కొండపై నుంచి క్వార్ట్జ్ ఎగుమతులు జరిగినట్లు కూడా తనిఖీ లు చేపట్టిన అధికారులు నిర్ధారించారు. అయితే క్వార్ట్జ్ రాయల్టీ చెల్లింపులకు సం బంధించిన లెక్కలు అధికారుల వద్ద లేక పోవడం గమనార్హం.

గతంలో వైసీపీ.. నేడు టీడీపీ నేతలు

గతంలో వైసీపీ నేతలు క్వార్ట్జ్, మట్టి తవ్వకాలు జరిపారు. ఇదే బాటలో ప్రస్తుతం టీడీపీ నేతలు కొం దరు పయనిస్తున్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నేతలు మట్టి, క్వార్ట్జ్‌లను ఆదాయ వనరులుగా వినియోగించుకుంటున్నారు. గత ఐదేళ్లు పెద్దఎత్తున అక్రమ మైనింగ్‌కు వైసీపీ నేతలు పాల్పడ్డారు. ఇప్పుడు టీడీపీ నేతలు అదే బాటలో పయనిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. మైనింగ్ అంశంలో ప్రభుత్వం పెద్దమొత్తంలో ఆదాయం కోల్పోతోంది. మైనింగ్ శాఖ పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. దీంతో అక్రమార్కులు బరితెగిస్తున్నారు.



ఎగుమతికి సిద్ధం చేసిన క్వార్ట్జ్ నింపిన బ్యాగ్‌లు



త్రిపురాపురం కొండపై అక్రమ తవ్వకాలు జరిగిన ప్రాంతం

వినాయక విగ్రహ ఊరేగింపులో ఘర్షణ

- వైసీపీ దాడి.. టీడీపీ వర్గీయుడికి గాయాలు
- సూరవరపుపల్లిలో పోలీస్ పికెట్ ఏర్పాటు

యద్దనపూడి(మార్టూరు), సెప్టెంబరు 13: యద్దనపూడి మండలం సూరవరపుపల్లి గ్రామంలో గురువారం రాత్రి వినాయక విగ్రహ ఊరేగింపులో ఘర్షణ చోటుచేసుకుంది. ఈ క్రమంలో జరిగిన ఘర్షణలో టీడీపీకి చెందిన ఒంటేలా వెంకటేశ్వర్లు అనే వ్యక్తికి గాయాలయ్యాయి. టీడీపీకి చెందిన వినాయక విగ్రహం నిమజ్జనం సందర్భంగా గ్రామంలో ఊరేగింపు చేశారు. ఈ సమయంలో టీడీపీ, వైసీపీలకు చెందిన ఇద్దరు వ్యక్తుల మధ్య వివాదం జరిగింది. బందోబస్తు పోలీసులు వారికి సర్దిచెప్పి పంపించారు. ఆ తర్వాత టీడీపీ వర్గీయుడు ఇంటికి వెళ్తుండగా బీసీ కాలనీ వద్ద వైసీపీ వర్గీయులు కర్రలతో దాడికి యత్నించారు. ఈ విషయం తెలిసిన టీడీపీ వర్గీయులు అక్కడకు రాగా ఇరు వర్గాలు కర్రలతో దాడిచేసుకున్నాయి. బందోబస్తులో ఉన్న పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. అప్పటికే దాడిలో గాయపడిన టీడీపీకి చెందిన వెంకటేశ్వర్లును పోలీసులు మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కొంతమంది పోలీసులకు కూడా స్వల్పగాయాలు అయ్యాయి. పర్చూరు సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ డి.రత్నకుమారిలు సిబ్బందితో పికెట్ నిర్వహించారు. ప్రస్తుతం పరిస్థితి ప్రశాంతంగా ఉందని గ్రామంలో పికెట్ కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ తెలిపార



చికిత్స పొందుతున్న టీడీపీకి చెందిన వెంకటేశ్వర్లు

ఐదు రైళ్ల ప్రయోగాత్మక నిలుపుదల 6 నెలల పొడిగింపు

గుంటూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఐదు రైళ్ల ప్రయోగాత్మక నిలుపుదల మరో 6 నెలలు పొడిగించినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెంబరు. 17645 సికింద్రాబాద్ - రేపల్లె ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 14 నుంచి శిరిపురంలో, నెంబరు. 17646 రేపల్లె - సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్‌ని రామన్నపేట, శిరిపురంలో, 20701/20702 సికింద్రాబాద్ - తిరుపతి - సికింద్రాబాద్ వందేభారత్ రైళ్లు మిర్యాలగూడలో నిలుపుదల కల్పిస్తున్నామన్నారు.

డ్రెయిన్లను విస్తరించకుంటే ఇబ్బందే

- ఏటా ముంపునకు గురవుతున్న పొలాలు.. నష్టపోతున్న రైతులు

గుంటూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎప్పుడో దశాబ్దాల క్రితం అప్పటి వర్షపాతాన్ని దృష్టిలో పెట్టుకుని ఏర్పాటు చేసిన డ్రెయిన్ల సామర్థ్యం ప్రస్తుతం సరిపోవడం లేదు. రెండు వారాల క్రితం కురిసిన భారీ వర్షానికి వాటి సామర్థ్యానికి మించి ప్రవహించాయి. జిల్లా వ్యాప్తంగా పంటలు నీట మునగడానికి ఈ డ్రెయిన్లే ప్రధాన కారణం. ఈ నేపథ్యంలో డ్రెయిన్ల రీ డిజైన్ చేయాల్సిన అవసరం ఏర్పడింది. కృష్ణా పశ్చిమ డెల్టాలో ఉన్న 12 డ్రెయిన్లను సాధ్యమైనంత త్వరగా రీడిజైన్ చేసి డిశ్చార్జి కెపాసిటీని పెంచకపోతే రాబోయే రోజుల్లో పంటలకు ఇబ్బందికరంగా మారే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఇరిగేషన్ అధికారులు రీడిజైన్ ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపాల్సిన అవసరం ఏర్పడింది. మురుగునీరు, వరదనీటిని సముద్రంలోకి ప్రవహింప చేసేందుకు కొల్లిమెర్ల, వేంకల, చేబ్రోలు సైడ్, జల్ల, నక్క, కొండ అప్పర్ ఆర్మ్, లోయర్‌ఆర్మ్, గుం టూరు నల్లా, రేపల్లె, తుంగభద్ర, కొండవీటి, పాలవాగులున్నాయి. వీటిల్లో కొల్లిమెర్ల డ్రెయిన్ డిశ్చార్జి కెపాసిటీ 6330 క్యూసెక్కులు కాగా ఇటీవల కురిసిన భారీ వర్షం సమ యంలో 7,596 క్యూసెక్కుల వరదనీరు రావడంతో ఓవర్ ఫ్లో అయింది. మేకలవాగు డ్రెయిన్ 1100 క్యూసెక్కులకు పూర్తిస్థాయిలో ప్రవహించింది. చేబ్రోలు సైడ్ డ్రెయిన్ 1479 క్యూసెక్కుల సామర్థ్యం కాగా 1775 క్యూ సెక్కులు, జల్ల వాగు నెంబరు. 1 డ్రెయిన్ 2380 క్యూసెక్కులకు 3094, నక్కవాగు అప్పర్ ఆర్మ్ 3810 క్యూసెక్కులకు 4954, కొండవాగు అప్పర్ ఆర్మ్ ఏఎం చానల్ పైన 2430 క్యూసెక్కులకు 3038 క్యూసెక్కులు, కొండ వాగు అప్పర్ ఆర్మ్ ఏఎం చానల్ దిగువన 2664 క్యూసెక్కులకు 3410 క్యూసెక్కులు ప్రవహించి ఓవర్ ఫ్లో అయ్యాయి. ఇదేరీతిన కొండవాగు లోయర్ ఆర్మ్ ఏఎం చానల్ దిగువన 1116 క్యూసెక్కులకు 1418 క్యూసెక్కులు, గుంటూరు నల్లా మేజర్ డ్రెయిన్ 5364.35 క్యూసెక్కులకు 9,357 క్యూసెక్కులు, రేపల్లె మెయిన్ డ్రెయిన్ 2313 క్యూసెక్కులకు 3245, తుంగబద్ర డ్రెయిన్ 11701 క్యూసెక్కుల సామర్థ్యం కాగా 15643 క్యూసెక్కుల వరద ప్రవహించింది. డ్రెయిన్ల ఓవర్ ఫ్లో కారణంగా గట్లు తెగిపోయి పొలాలు వారం పైగా నీట మునిగాయి. ముఖ్యంగా వరి, పత్తి పంటలకు తీవ్ర నష్టాన్ని కలిగించాయి. దాదాపుగా 40 వేల హెక్టార్లలో ఈ రెండు రకాల పంటలు ఖరీఫ్‌లో 100 శాతం నష్టం జరిగింది. ఈ నేపథ్యంలో డ్రెయిన్ల రీడిజైన్ ఆవశ్యకత ఏర్పడింది. ఈ డ్రెయిన్లన్నీ ఎప్పుడో బ్రిటీష్ కాలంలో కృష్ణా డెల్టా ఏర్పాటు జరిగినప్పుడు డిజైన్ చేసినవి. ఒకే రోజున 27 సెంటీమీటర్ల రికార్డుస్థాయి వర్షపాతం నమోదు కావడా న్ని పరిగణనలోకి తీసుకుని రాబోయే రోజుల్లో ఇంకా వర్షపాతం పెరిగే అవకాశాన్ని కూడా అంచనా వేసి ఈ డ్రెయిన్ల సామర్థ్యాన్ని పెంచాల్సిన అవసరం ఏర్పడింది.

బాలినేనిని కూటమి పార్టీలు చేర్చుకోవద్దు

అవినీతిని కప్పిపుచ్చుకునేందుకే మార్పు ప్రయత్నాలు

భూ అక్రమాలపై సిట్‌ను వెంటనే పునరుద్ధరించాలి

జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి

ఒంగోలు(కలెక్టరేట్) సెప్టెంబరు 13 : గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ కాలంలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి చేసిన అవినీతి, అక్రమాలు బయటపడకుండా ఉండటానికే కూటమి పార్టీల్లో చేరేందుకు ప్రయత్నిస్తున్నారని జనచైతన్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ఒక ప్రకటనలో ఆరోపించారు. బాలినేని అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేయాలని కోరారు. ఈ విషయంలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిలు ఆలోచించాలని కోరారు. బాలినేని గతంలో చేసిన అవినీతి, అక్రమాలను దృష్టిలో పెట్టుకొని వారి వారి పార్టీల్లో చేర్చుకోవద్దని కోరారు. సిట్‌ను పునరుద్ధరించి దర్యాప్తును వేగవంతం చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వెలిగొండ ప్రాజెక్టు నేటికి పూర్తి కాలేదని, గుండ్లకమ్మలో గేట్లు కొట్టుకుపోతే వాటిని సైతం పునరుద్ధరించలేదని ఎద్దేవా చేశారు. ఎలాంటి వ్యాపారాలు, పరిశ్రమలు లేకుండా వందలాది కోట్లు రాజకీయాల్లో ఏలా సంపాదించారో బాలినేని బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

18న జిల్లా పరిషత్ స్థాయీసంఘ సమావేశాలు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 13 : జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈనెల 18వ తేదీన జిల్లా పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని జడ్పీ ఇన్‌చార్జి సీఈవో కె.మాధురి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో అంశాల వారీగా చర్చిస్తారన్నారు.

బాధిత కుటుంబానికి సాయం



బాధిత కుటుంబానికి దుస్తులు, నిత్యావసర వస్తువులు అందజేస్తున్న టీడీపీ నాయకులు

చినగంజాం, సెప్టెంబరు 13 : పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి టీడీపీ నాయకులు సాయం అందించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని జాలమ్మ కాలనీకి చెందిన మానికల సుబ్రమణ్యం కుటుంబానికి శుక్రవారం రాత్రి మండల అధ్యక్షులు పొద వీరయ్య ఆధ్వర్యంలో సాయం అందించారు. సుబ్రమణ్యం భార్య లక్ష్మీ గుంటూరు జీజీహెచ్‌లో ఆడ శిశువుకు జన్మనిచ్చి మృతి చెందింది. ఆమె దశదిన కర్మ శనివారం కావడంతో దానికి కావలసిన నిత్యావసర వస్తువులు, బియ్యం, కూరగాయలు, వారి 8మంది సంతానానికి దుస్తులను టీడీపీ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు టీ.జయరావు, చెరుకూరి రాఘవయ్య, సయ్యద్ అబ్దుల్‌కలాంఆజాద్, సందు శ్రీనివాసరావు, మోటుమర్రి రామసుబ్బారావు, షేక్.జిలాని, బెల్లంకొండ రమేష్‌బాబు, పర్వతరెడ్డి పార్థసారిధి, నరహరి శ్రీనివాసరావు, భయ్యా సతీష్, పల్లపోలు లక్ష్మీనారాయణ, ఎం.పద్మావతి, షేక్.నబీషా, గుండ్రెడ్డి నరసింహారావు, ఎం.లక్ష్మయ్య, షేక్.బాజీ, జి.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

18న రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికలు

పర్చూరు, సెప్టెంబరు 13: రాష్ట్ర, జాతీయస్థాయిలో జరిగే పోటీలకు సంబంధించి స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల కందుకూరు, ఏబీఎం జూనియర్ కళాశాల ఒంగోలులో ఈనెల 18వ తేదీన ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి ప్రకాశం జిల్లా పాఠశాలల ఆటల పోటీల కార్యదర్శి చింపారెడ్డి తెలిపారు. బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, రెజ్లింగ్, టేబుల్ టెన్నిస్, సెపక్ తక్రా పోటీల్లో ఎంపిక జరుగుతుందన్నారు. అండర్ 14 విద్యార్థులు 2011 జనవరి 1వ తేదీలోపు, అండర్ 17 విద్యార్థులు 2008 జనవరి 1వ తేదీలోపు, అండర్ 19 విద్యార్థులు 2006 జనవరి 1లోపు జన్మించి ఉండాలన్నారు. ఆసక్తి కల్గిన క్రీడాకారులు ఆయా ప్రధానోపాధ్యాయుడు, ప్రిన్సిపాళ్ల నుంచి పార్టిసిపేషన్ సర్టిఫికెట్‌తోపాటు, పదవ తరగతి ఒరిజినల్ సర్టిఫికెట్‌తో హాజరుకావాలన్నారు. వివరాలకు 9848125706, 9440621579 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కొనసాగుతున్న ఈనాం భూముల సర్వే



సర్వే చేస్తున్న ప్రత్యేక టీంలు

బల్లికురవ. సెప్టెంబరు 13 : జిల్లా జాయింట్ కలెక్టర్ ఉత్తర్వుల మేరకు మండలంలోని చెన్నుపల్లి గ్రామ పరిధిలో ఉన్న ఈనాం భూముల సర్వే రెండో రోజు అయిన శుక్రవారం కూడా జరిగింది. మొత్తం అయిదు టీంలు గ్రామంలోని సర్వే నెంబర్ల ఆధారంగా భూములకు కొలతలు వేస్తున్నారు. భూములు ఎవరు సాగు చేస్తున్నారు అన్న వివరాలను నమోదు చేస్తున్నారు. అలానే ఎవరు సాగు చేయకుండా ఎంత భూమి నిరుపయోగంగా ఉంది అన్న వివరాలను సేకరిస్తున్నారు. రైతులకు హక్కులు కల్పించేందుకు ఈ సర్వే జరుగుతుందని ఇన్‌చార్జి తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. కొందరి రైతుల భూములకు హద్దులు కూడా సరిగా లేవని, ఈ సర్వే వలన రైతులకు ఎంతో ఉపయోగం అని ఆయన తెలిపారు. అన్ని సర్వే నెంబర్లలో కొలతలు వేసి నివేదికలు తయారు చేస్తామని అయన తెలిపారు.

పేద మహిళకు కుట్టుమిషన్ అందజేత

అద్దంకి, సెప్టెంబరు13: రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో పేద మహిళకు కట్టుమిషన్ అందజేశారు. మండలంలోని ధేనువకొండకు చెందిన పేద మహిళ షేక్ మీరాబీకి రాచమల్లు జగదీశ్వర్, జస్వంత్‌ల పుట్టిన రోజు సందర్భంగా రాచమల్లు కుటుంబసభ్యులు శుక్రవారం కుట్టుమిషన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, కార్యదర్శి చుండూరి మురళీసుధాకరరావు, మలాది శ్రీనివాసరావు, అసిస్టెంట్ గవర్నర్ షేక్ మహ్మద్‌రఫీ, సందిరెడ్డి శ్రీనివాసరావు, డాక్టర్ దేవపాలన, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, జ్యోతి చంద్రమౌళి పాల్గొన్నారు.

కౌన్సిల్ సక్సెస్!

తొలిసారి టీడీపీ బలంతో కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం

అజెండాలోని పలు అభివృద్ధి అంశాలకు ఆమోదం

కోరం లేకుండా చేసేందుకు వైసీపీ నేతల ప్రయత్నం

హైదరాబాద్‌కు తరలిన 20మంది కార్పొరేటర్లు

వారి ఎత్తుగడ విఫలం.. 27మందితో సజావుగా మీటింగ్

ఎక్స్‌అఫిషియో మెంబర్లుగా ప్రమాణం చేసిన ఎమ్మెల్యేలు, ఎంపీ

అందరి సహకారంతో అగ్రస్థానంలో ఒంగోలు అభివృద్ధి

ఎంపీ మాగుంట, ఎమ్మెల్యేలు జనార్దన్, విజయకుమార్



సమావేశంలో ఎంపీ మాగుంట, ఎమ్మెల్యేలు జనార్దన్, విజయ్‌కుమార్, కార్పొరేటర్లు

వైసీపీ సభ్యుల బలంతో గడిచిన మూడేళ్లుగా కొనసాగిన ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం తొలిసారిగా టీడీపీ బలంతో విజయవంతమైంది. గతంలో టీడీపీ సభ్యులు ఆరుగురు ఉండగా, జనసేన నుంచి ఒకరు గెలుపొందారు. ఇదిలా ఉండగా ఇటీవల ఎన్నికల సమయంలో ఐదుగురు, తాజాగా పదిహేను మంది వైసీపీ కార్పొరేటర్లు అధికార పార్టీలో చేరారు. దీంతో కార్పొరేషన్ పీఠం టీడీపీ కైవసం చేసుకుంది. ఎంపీ, ఎమ్మెల్యేలు ఎక్స్‌అఫిషియో మెంబర్లుగా ప్రమాణం చేశారు. దీంతో మొత్తం 27మంది టీడీపీ కార్పొరేటర్లు, ముగ్గురు ఎక్స్ అఫిషియో సభ్యులతో 30కి చేరిన బలంతో జరిగిన తొలి సమావేశంలో పది అంశాలు అజెండాలో పొందుపరచగా, ఒకటి మినహా అన్నింటిని ఆమోదించారు.

ఒంగోలు (కార్పొరేషన్), సెప్టెంబరు 13 : టీడీపీ బలంతో మొదటిసారి జరుగుతున్న కౌన్సిల్ సమావేశం విజయవంతమైంది. ఏదో ఒక విధంగా సమావేశం జరగకుండా చూడాలనే తలంపుతో వైసీపీ కార్పొరేటర్లు గైర్హాజరయ్యారు. సభ్యుల కోరం లేకుండా చేసేందుకు వేసిన ఎత్తుగడలు విఫలం అయ్యాయి. శుక్రవారం సమావేశం జరుగుతుందని తెలియడంతో గురువారం రాత్రి వైసీపీ కార్పొరేటర్లందరు హైదరాబాద్‌లోని మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి నివాసానికి చేరుకున్నారు. దీంతో సమావేశం జరగదని భావించిన వైసీపీ మూడింట రెండు వంతుల సభ్యులు అనగా, 36 మంది ఉంటేనే కౌన్సిల్ జరుగుతుందని అనుకున్నారు. అయితే నిబంధనల ప్రకారం మూడవ వంతు సభ్యులు యాభై మందిలో 18మంది ఉంటే సరిపోతుందని కమిషనరు వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. అందుకు అనుగుణంగా మునిసిపల్ చట్టంలోని అంశాలను వివరించడంతో సమావేశం ఎలాంటి అడ్డంకులు లేకుండా కొనసాగింది. అయితే ఉదయం నుంచి సమావేశం నిర్వహించేందుకు కోరం లేదంటూ కొందరు చేసిన ప్రచారం చర్చనీయాంశం కాగా, వైసీపీ కార్పొరేటర్లు హాజరుకాకపోయినా సమావేశం సజావుగా జరగడంతో వైసీపీ వర్గీయులు డీలాపడ్డారు. ఇదిలా ఉంచితే 8వ అంశమైన వైసీపీ ప్రభుత్వంలో నవరత్నాలలో భాగంగా జగనన్న ఇళ్ల పట్టాల పంపిణీ కోసం హద్దురాళ్లు, రోడ్లు నిర్మాణం తదితర పనులకు సంబంధించి రూ.21.335 కోట్లు బిల్లుల మంజూరుపై సమావేశంలో చర్చకు వచ్చింది. ఈ అంశంపై మరింత లోతుగా చర్చించాల్సి ఉందని సభ్యులు తెలిపారు. దీంతో ఆ అంశాన్ని వాయిదా వేశారు.

ఒంగోలు అభివృద్ధికి నిధులు కోరతాం

కార్పొరేటరు, కార్పొరేషన్ అధికారుల సహకారం, కృషితో ఒంగోలు నగరాన్ని అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలబెట్టడమే లక్ష్యమని, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఒంగోలు కార్పొరేషన్ పాలకవర్గం ఏర్పాటు అయిన తర్వాత, టీడీపీ బలంతో జరిగిన కౌన్సిల్ సమావేశం మేయర్ గంగాడ సుజాత అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్ విజయ్‌కుమార్‌లు కోఆప్షన్ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. తొలిసారిగా ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్ విజయ్‌కుమార్ కౌన్సిల్ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ నగర అభివృద్ధి కోసం అవసరమై నిధులు ప్రభుత్వం నుంచి కోరుతామన్నారు. అలాగే సభ్యులందరు కలిసి అభివృద్ధి వైపు నడిచి, రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలబెట్టాలని కోరారు. తాను 2014 నుంచి ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ కౌన్సిల్ లేకపోవడంతో హాజరు కాలేకపోయాయని, అయితే కౌన్సిల్ ఏర్పడిన తర్వాత తొలిసారి సమావేశానికి రావడం సంతోషంగా ఉందన్నారు. ఎంపీ మాగుంట మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా ఒంగోలు ఎంపీగా ఉన్నానని, నగర అభివృద్ధిలో తనవంతు పాత్ర పోషించానని, భవిష్యత్‌లో కూడా సహకరిస్తానని తెలిపారు. బీఎన్ విజయ్‌కుమార్ ఒంగోలు నగరంతో ఎస్‌ఎన్‌పాడు నియోజకవర్గం ముడిపడి ఉందన్నారు. అది చాలా సంతోషమన్నారు. తన వంతుగా నగర అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించడంతోపాటు, అభివృద్ధిలో భాగస్వాముడిని అవుతానని తెలిపారు. అనంతరం కౌన్సిల్ సభ్యులు అందరు తమ డివిజన్‌లు, డివిజన్‌లలోని సమస్యలను వివరిస్తూ ఎక్స్ అఫిషియో సభ్యులకు పరిచయం చేసుకున్నారు. అలాగే నగర కమిషనరుగా బాధ్యతలు స్వీకరించిన కోడూరి వెంకటేశ్వరరావు కూడా పాలకవర్గానికి పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈ జానీ బాషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేయర్ సుజాత

పారిశుధ్యం మెరుగుపరచాలి

నగరంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని కార్పొరేటర్లు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. గత వైసీపీ హయాంలో పారిశుధ్య కార్మికులుగా చేరిన కొందరు ఆ పార్టీ కార్యకర్తలు పనిచేయకుండా మేస్త్రీలుగా కొనసాగుతున్నారని, మరికొందరు ఎక్కడ పనిచేస్తున్నారో తెలియదని తెలిపారు. తద్వారా పూర్తిస్థాయిలో కార్మికుల కొరత ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో విధుల్లో చేరి, పనిచేయకుండా తిరుగుతున్న వారిని తొలగించాలని డిమాండ్ చేశారు. పారిశుధ్యం మెరుగు కోసం కొత్త వారిని నియమించి, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, కార్పొరేటర్లు దాచర్ల వెంకట రమణయ్య, మలగా రమేష్, అంబూరి శ్రీనివాసరావు, పసుపులేటి విజయలక్ష్మి, వేమూరి భవానీ, గుట్లపల్లి మస్తానమ్మతోపాటు మొత్తం 27 మంది కార్పొరేటర్లు హాజరయ్యారు.

నామినేషన్ పనుల అవినీతిపై విచారణ చేయాలి



ఆంధ్రజ్యోతి కథనాన్ని చూపిస్తున్న డిప్యూటీ మేయర్ బుజ్జి

నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో రూ.95లక్షలతో నామినేషన్ పద్ధతిన చేపట్టిన పందొమ్మిది పనుల్లో అవినీతిపై ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురించిన కథనంపై డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి ప్రశ్నించారు. 'పనులు పంచుకుతిన్నారు' కథనంలో పేర్కొన్న అంశాలు అనుమానాలకు తావిస్తున్నాయన్నారు. అత్యవసరం పేరుతో పనులు ఎలా చేపడతారన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా దీనిపై ప్రత్యేక కమిటీతోపాటు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో విచారణ చేసి, అవినీతిని నిగ్గు తేల్చాలని బుజ్జి డిమాండ్ చేశారు.

ఇంకా అదే దౌర్జన్యం!

టీడీపీకి ఓటేశారని రోడ్డు మూసేశారు

ప్రభుత్వ లేఅవుట్‌లో వైసీపీ నాయకుల చిచ్చు

వారికే వత్తాసు పలుకుతున్న రెవెన్యూ అధికారులు

ప్రైవేటు వ్యక్తి స్థలం అంటూ స్పష్టం

దారి మూతతో ఇబ్బందిపడుతున్న కాలనీవాసులు

ఏ పార్టీ అధికారంలో ఉందో అర్థం కావడం లేదని

వాపోతున్న బాధితులు



బీసీ కాలనీలో కర్రలతో మూసేసిన రస్తా

మార్కాపురం, సెప్టెంబరు 13: ప్రతి పేదవానికి కూడు, గూడు, గుడ్డ కల్పించాలనే నినాదంతో 1983లో ప్రజల ఆదరణతో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటైంది. అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు ఆశయం మేరకు మండలకేంద్రమైన తర్లుపాడులో సుమారు 6 ఎకరాల్లో 100 బీసీ కుటుంబాలకు లేఅవుట్ ఏర్పాటు చేసి ఇళ్లు నిర్మించి ఇచ్చారు. అప్పట్లో ప్రైవేటు వ్యక్తుల వద్ద భూమిని కొనుగోలు చేసి మరీ బీసీ కాలనీ నిర్మించారు. సుమారు 40 సంవత్సరాలుగా అక్కడ నివాసముంటున్న వారిలో కొందరికి ఇప్పుడు కొత్త చిక్కు వచ్చిపడింది. సార్వత్రిక ఎన్నికల్లో కొందరు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఆయా కుటుంబాలపై కక్ష పెంచుకున్న వైసీపీ నాయకులు ఎలాగైనా వారికి ఇబ్బందులు సృష్టించాలని పన్నాంగం పన్నారు. కాలనీ అనుకుని స్థలం ఉన్న ఓ వైసీపీ వర్గీయుడిని రెచ్చగొట్టి రహదారిని కర్రలు కట్టి మూసేయించారు. దీంతో బాధితులు లబోదిబోమంటూ రెవెన్యూ అధికారుల వద్దకు పరిగెత్తారు. వైసీపీ ప్రభుత్వంలో పోస్టింగులు పొందిన రెవెన్యూ సిబ్బంది కొలతలు వేసి ప్రైవేటు వ్యక్తి స్థలంలో కొంతమేర ఇళ్లు ఉన్నట్లు నిర్ధారించారు. నాలుగు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన రహదారిని ఇప్పుడెలా మూసేస్తారని ప్రశ్నిస్తే రెవెన్యూ అధికారుల వద్ద జవాబు లేదు.

ఓట్లు వేశారని కక్షసాధింపు చర్యలు

తర్లుపాడు మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 388/2ఎలో 6 ఎకరాలు, 388/2బీలో 71 సెంట్ల భూమిలో 1983లో బీసీ సామాజికవర్గానికి చెందిన 100 కుటుంబాల వాళ్లకు ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇచ్చింది. కాలక్రమంలో కొందరు ఇళ్లు ఇతరులకు అమ్ముకున్నారు. ఎక్కువమంది గత 40 ఏళ్లుగా కాలనీలోనే నివస్తున్నారు. మొదట్లో టీడీపీకి కంచుకోటగా ఉన్న బీసీ కాలనీ కాలక్రమంలో కాంగ్రెస్ పార్టీకి, ప్రస్తుతం వైసీపీ పార్టీకి అనుకూలంగా మారింది. సార్వత్రిక ఎన్నికల సమయంలో టీడీపీలోకి కొందరు చేరారు. దీంతో కక్ష పెంచుకున్న మండల కేంద్రానికి చెందిన వైసీపీ నాయకులు టీడీపీలో చేరిన వారిని ఎలాగైనా ఇబ్బందులు పెట్టాలని యోచించారు. కాలనీకి అనుకుని 388/3బి సర్వే నెంబర్‌లో 44 సెంట్ల స్థలం ఉన్న వైసీపీ కార్యకర్త గోగు యల్లయ్యను పావుగా వాడుకున్నారు. వాస్తవానికి ఆ స్థలం యల్లయ్య మామ వన్నెబోయిన గురవయ్య పసుపుకుంకుమ కింద కుమార్తె గాలెమ్మకు ఇచ్చారు. 44 సెంట్ల స్థలంలో 20 సెంట్లు అమ్ముకోగా మిగిలిన స్థలం బీసీ కాలనీ లేఅవుట్‌లో కలిసిపోయింది. ఈ విషయమై గోగు గాలెమ్మ పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా అధికారులు ఆ స్థలం లేఅవుట్‌లో కలసిపోయిందని కూడా స్పష్టం తెలియజేశారు. కానీ గత వైసీపీ ప్రభుత్వంలో మళ్లీ ఈ స్థలం వివాదాన్ని బయటకు తీసి నాయకులు వారికి అనుకూలంగా మలుచుకుంటున్నారు. ప్రస్తుతం కాలనీలోని కొందరు టీడీపీకి మద్దతు తెలిపి ఓట్లు వేయడంతో మళ్లీ వివాదానికి నాయకులు ఆజ్యం పోశారు. 388/3బి సర్వే నెంబర్‌లోని స్థలానికి చెందిన వారిని రెచ్చగొట్టి రహదారికి అడ్డంగా కర్రలతో కంచె ఏర్పాటు చేసి మూసివేశారు. ఆ ప్రాంతంలో ప్రభుత్వ నిధులతో సీసీ రహదారులు, మురుగు కాలువలు నిర్మించినా వైసీపీ నాయకులు అడ్డగోలుగా ఒకే సామాజికవర్గానికి చెందిన వాళ్ల మధ్య చిచ్చుపెట్టి చోద్యం చూస్తున్నారు.

కొమ్ముకాస్తున్న రెవెన్యూ అధికారులు

బీసీ కాలనీకి ఆనుకుని ఉన్న సర్వేనెంబర్‌లో జరుగుతున్న వివాదం మొత్తం రెవెన్యూ అధికారులకు తెలుసు. ముఖ్యంగా గతంలో పనిచేసిన తహసీల్దార్ చంద్రలీల 2017లో స్పష్టంగా 388/3బీ సర్వే నంబర్‌లోని 44 సెంట్లలో 20 సెంట్ల మేర 1983లో 388/2ఎ సర్వే నెంబర్‌లో ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో కలిసిపోయినట్లు ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు. అప్పట్లో వచ్చిన ఫిర్యాదులకు అనుగుణంగా విచారించి అర్జీదారులకు విషయాన్ని తెలియజేశారు. కానీ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇక్కడకు వచ్చిన రెవెన్యూ సిబ్బంది, అధికారులు పాత సమస్యను మళ్లీ తెరపైకి తెచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినా ఇంకా బదిలీ కాకుండా ఇక్కడే ఉన్న గ్రామస్థాయి రెవెన్యూ సిబ్బంది వలనే వివాదం మళ్లీ రాజుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పరిష్కారానికి నోచుకోని భూవివాదాలు

గత వైసీపీ ప్రభుత్వంలో అధికారుల

తీరుతో జటిలమైన సమస్యలు

రికార్డులు తారుమారు చేసినట్లు ఆరోపణలు



దర్శిలో వివాదంలో ఉన్న భూమి

దర్శి, సెప్టెంబరు 13 : దర్శి ప్రాంతంలో ఏళ్ల తరబడి భూములు, స్థలాల వివాదాలు పరిష్కారానికి నోచుకోవడంలేదు. దీంతో నిజమైన హక్కుదారులు ఇబ్బందులు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొంతమంది వ్యవహరించిన అనుచిత వైఖరి భూ యజమానులకు ఇబ్బందికరంగా మారింది. అప్పటి అధికారులు చేసిన పాపాలు బాధితుల పాలిట శాపాలుగా మారాయి. అధికారులు ముడుపులు తీసుకొని రికార్డులు కూడా ట్యాంపరింగ్ చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఎంతో విలువైన స్థలాలు, భూముల వివాదాలు పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ సంవత్సరాల తరబడి తిరిగినా పరిష్కారం కాక కొంతమంది కోర్టులను కూడా ఆశ్రయించారు.

దర్శి పట్టణంలోని కురిచేడు రోడ్డులో రూ.2కోట్ల విలువైన పది సెంట్ల స్థలంకు సంబంధించిన వివాదం ఏళ్లతరబడి కొనసాగుతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ వివాదం మరింత జఠిలమైంది. కొంతమంది వైసీపీ నాయకులు ఆ వివాదంలో చొరబడి సమస్యను తీవ్రం చేశారు. ఒక వ్యక్తి 15సంవత్సరాల క్రితం ఆ స్థల హక్కుదారుల నుంచి కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించున్నారు. అయితే అదే స్థలాన్ని పూర్వీకుల ద్వారా హక్కు ఉందని మూడేళ్ల క్రితం మరొకరు రిజిస్టర్ చేయించుకున్నారు. రెండోసారి చేయించుకున్న వారు పంచాయితీలో భాగంగా వైసీపీ నాయకులు ఉండటం గమనార్హం. ఈ వివాదంపై గత ప్రభుత్వ హయాంలో అప్పటి కనిగిరి ఆర్డీవో జాన్‌ఇర్విన్‌ను విచారణ అధికారిగా వేశారు. ఆయన స్థలాన్ని పరిశీలించి వెళ్లి రెండు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఇంతవరకు పరిష్కారానికి నోచుకోలేదు.

అలాగే, దర్శి -కురిచేడు రోడ్డులో మరో స్థలం హద్దుల విషయంలో ఏళ్ల తరబడి వివాదం కొనసాగుతోంది. ఆ స్థలం తొలుత పూర్వీకుల సమయంలో సమాన భాగాలైంది. ఆతర్వాత కొనుగోలు చేసినవారిలో ఒక వ్యక్తి దర్శి-కురిచేడు ప్రధాన రహదారి వైపు ఎక్కువ స్థలాన్ని ఆక్రమించుకున్నాడు. తనకు చేసిన రిజిస్ట్రేషన్‌లో కొలతల ప్రకారం స్థలానికి హద్దులు ఏర్పాటు చేసుకున్నట్లు చెబుతున్నాడు. ఆ స్థలం పక్కన అందులో భాగమైన స్థలాన్ని కొనుగోలు చేసిన వారికి ప్రధాన రహదారి వైపు వెడల్పు తగ్గిపోయింది. దీంతో స్థలం విలువ తగ్గిపోవడంతో వివాదం ఏర్పడింది. ఈక్రమంలో వైసీపీలో కొందరు పెద్దలు ఆ స్థలం వివాదాన్ని పరిష్కరిస్తామని రంగంలోకి దిగారు. ఒక పార్టీకి చెందిన స్థలాన్ని వారే కొనుగోలు చేసి అగ్రిమెంట్ కూడా రాసుకున్నారు. ఈ వివాదం కూడా నేటివరకు పరిష్కారం కాలేదు.

మండలంలోని రాజంపల్లిలో ఒక స్థలం వివాదం ఏళ్లతరబడి కొనసాగుతోంది. ఇక్కడ ఇరువర్గాలు తమకు హక్కు ఉందటే తమకు హక్కు ఉందని పరిష్కారం కోసం రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఆ స్థలం విషయంలో ఒక వీఆర్వోపై కేసు కూడా నమోదైంది. అలాగే, బొట్లపాలెంలో ఒక స్థలం వివాద పరిష్కారం కోసం ఏళ్ల తరబడి బాధితుడు తిరుగుతున్నాడు. ఇప్పటివరకు ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదు.

కూటమి ప్రభుత్వం రాకతో ఆశలు

కూటమి ప్రభుత్వం రాకతో భూములు, స్థలాల సమస్యలు పరిష్కారం అవుతాయని సంబంధిత వ్యక్తులు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో పనిచేసిన అధికారులు బదిలీలపై వెళ్లారు. కొత్తగా వచ్చిన అధికారులు తమకు న్యాయం చేస్తారనే నమ్మకంతో మళ్లీ తమవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే కొంతమంది న్యాయంకోసం కోర్టును ఆశ్రయించారు.తీవ్రంగా మారిన భూములు, స్థలాల వివాదాలను తాజాగా వచ్చిన అధికారులు పరిష్కరించి న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

జనసేనలోకి రవిశంకర్

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

జిల్లాలో కూటమి భాగస్వామి పార్టీలోకి వెళ్లేవారి సంఖ్య పెరిగిపోతుంది. వైసీపీ నాయకులతోపాటు వివిధ వర్గాల వ్యాపార ప్రముఖులు కూటమి భాగస్వామి పార్టీలోకి చేరుతున్నారు. తాజాగా ఒంగోలుకు చెందిన పారిశ్రామికవేత్త కంది రవిశంకర్ జనసేన పార్టీలోకి చేరేందుకు రంగం సిద్ధమైంది. ఈనెల 16 లేదా 18వతేదీన ఆయన పవన్‌కళ్యాణ్ సమక్షంలో ఆ పార్టీలో చేరనున్నారు. తన వియ్యంకుడు పొన్నూరు మాజీ ఎమ్మెల్యే రోశయ్యతో కలిసి ఆయన జనసేనలో చేరనున్నారు. టీవీఎస్ ఏజన్సీతోపాటు నగరంలో రవిప్రియ మాల్‌కు ఆయన యజమాని. తిరుపతి జనసేన ఎమ్మెల్యే శ్రీనివాసులు కూడా రవిశంకర్ సమీప బంధువు. కాగా గతంలో వైసీపీలో ఉంటూ మాజీ మంత్రి బాలినేని అనుచరుడిగా కొనసాగారు.



సుబ్రమణ్యం కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న అధికారులు

సుబ్రమణ్యం కుటుంబాన్ని కలిసిన అధికారులు

చినగంజాం, సెప్టెంబరు 13 : తల్లి మృతి చెంది 8 మంది పిల్లలతో ఇబ్బందులు పడుతున్న మానికల సుబ్రహ్మణ్యం కుటుంబసభ్యులను ఐసీడీఎస్, జిల్లా బాలల సంరక్షణాధికారులు కలిశారు. చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని జాలమ్మ కాలనీకి చెందిన మానికల సుబ్రహ్మణ్యం స్వగృహం వద్ద కుటుంబసభ్యులతో శుక్రవారం అధికారులు మాట్లాడారు. గుంటూరు సమగ్ర బాలల సంరక్షణ కేంద్రం అధికారుల ఆదేశాల మేరకు బాపట్ల జిల్లా బాలల సంరక్షణాధికారి పి.పురుషోత్తమరావు, ఫోనిక్ జి.కృష్ణ, ఇంకొల్లు సెక్టారు సీడీపీవో టి.ఝాన్సీలు వారి కుటుంబ స్థితిగతులు, పిల్లలు ఎంత మంది, వారి పోషణ ఎలా నిర్వహిస్తున్నారు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. తల్లి మృతి చెందడంతో పసిబిడ్డను పెంచుకోలేక మరో అమ్మకు ఇచ్చానని, డబ్బుకు బిడ్డను అమ్ముకోలేదని అధికారులకు సుబ్రహ్మణ్యం తెలిపాడు. బాపట్లలోని బాలసదన్‌లో పిల్లలందరినీ చదివిస్తామని, మీరు అక్కడు వచ్చి వసతులు, విద్యాబోధన తదితర విషయాలను తెలుసుకొని పిల్లలను అక్కడ చేర్చాలని అధికారులు సుబ్రహ్మణ్యాన్ని కోరారు. తన భార్య లక్ష్మీ పెదకర్మ అనంతరం మా కుటుంబసభ్యులతో మాట్లాడుకొని మీకు తెలియజేస్తానని ఆయన వివరించారు. మూడు రోజులు తరువాత మరల ఇక్కడకు వస్తామని అధికారులు సుబ్రహ్మణ్యానికి తెలిపారు. బాలసదన్‌లో ఆడపిల్లలకు సంరక్షణ, రక్షణ ఉంటుందని తెలిపారు. సుబ్రమ్మణ్యానికి 8 మంది పిల్లలు ఉన్నా ఎవరికీ ఆధార్‌కార్డులు లేకపోవడంతో ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు వారికి అందడం లేదు. ఈ విషయం తెలుసుకున్న పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు సుబ్రహ్మణ్యం పిల్లలకు ఆధార్‌కార్డులు అందజేసి, ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు అందజేయాలని అధికారులకు సూచించినట్లు ఏలూరి క్యాంపు కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో చినగంజాం, సంతరావూరు సెక్టారు సూపర్‌వైజర్లు కే.వాణిశ్రీ, కే.వదనకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.హైమావతి, బి.లక్ష్మి, ఎంఎస్‌కే ఎస్.మీనాక్షి, ఏఎన్ఎం జే.సువార్త తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సోషల్ మీడియా కార్యకర్తకు సెల్‌ఫోను పంపిన లోకేష్

- కృతజ్ఞతలు తెలిపిన దివ్యాంగుడు సురభి నాగేశ్వరరావు

బల్లికురవ, సెప్టెంబరు 13 : మండలంలోని కూకట్లపల్లి ఎస్సీ కాలనీకి చెందిన టీడీపీ సోషల్ మీడియా కార్యకర్త సురభి నాగేశ్వరరావుకు శుక్రవారం రాష్ట్ర మంత్రి నారా లోకేష్ సెల్‌ఫోనును పంపించి స్థానిక నేతల ద్వారా అందించారు. కూకట్లపల్లికి చెందిన సురబి నాగేశ్వరరావు దివ్యాంగుడు. టీడీపీ పార్టీ సానుభూతి పరుడిగా ఉంటు కొంత కాలంగా సోషల్ మీడియా ద్వారా పార్టీ చేపడుతున్న కార్యక్రమాలపై ప్రచారం చేస్తున్నాడు. నాగేశ్వరరావు సెల్‌ఫోను కొన్ని రోజుల నుంచి మరమ్మతులకు గురైంది.. ఈ విషయాన్ని నాగేశ్వరరావు మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకు వచ్చేలా తనకు ఫోను అందించాలని, నేను సోషల్ మీడియాలో పనిచేయలేక పోతున్నానని ఒక పోస్టు ద్వారా విజ్ఞప్తి చేశారు. దివ్యాంగుడు నాగేశ్వరరావు పెట్టిన పోస్టును చూసిన మంత్రి లోకేష్ వెంటనే తన టీం సభ్యుల ద్వారా నాగేశ్వరరావుకు సుమారు రూ.30 వేల విలువ కలిగిన నూతన సెల్‌ఫోనును పంపించారు. గ్రామ టీడీపీ నేత పందిరి అబ్రహాం చేతుల మీదుగా ఫోనును అందించారు. ఈసందర్బంగా నాగేశ్వరరావు మాట్లాడుతు తన విజ్ఞప్తిని గమనించి తనకు సెల్ ఫోను అందజేసిన లోకేష్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.



సెల్‌ఫోన్‌ను అందిస్తున్న టీడీపీనేత

విచ్చలవిడిగా పురుగుమందులు వాడొద్దు

అద్దంకి, సెప్టెంబరు13: మనుషుల ఆరోగ్యంపై పురుగు మందుల ప్రభావం ఉంటుందని మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ అన్నారు. మండలంలోని కలవకూరులో శుక్రవారం జరిగిన పొలంబడి కార్యక్రమంలో విచ్చలవిడిగా ఎరువులు, పురుగు మందుల వాడకంపై కలిగే దుష్ప్రభావాలను రైతులకు వివరించారు. పురుగుల మందు పిచికారి చేసేటప్పుడు వాలుకు అనుకూలంగా చేయాలన్నారు. కళ్ళకు అద్దాలు పెట్టుకోవాలని, శిరస్త్రాణం ధరించాలన్నారు. పురుగుమందులను చేతులతో నేరుగా కలపకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో కోటేశ్వరరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు మస్తాన్‌రావు, రైతులు తదితదిరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న మండల వ్యవసాయ శాఖ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ

వరద బాధితులకు రూ.1.70 లక్షల విరాళం సేకరణ

పంగులూరు, సెప్టెంబరు 13 : రామకూరు గ్రామస్థులు వరద బాధితుల సహాయార్థం సేకరించిన రూ.1.70 లక్షల చెక్కును రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు అందజేశారు. గ్రామటీడీపీ ఆధ్వర్యంలో వరద బాధితుల సహాయార్థం గ్రామ ఉప సర్పంచ్ పెదవల్లి అశోక్ నేతృత్వంలో ఈ విరాళాలు సేకరించారు. ఈ మొత్తాన్ని మంగళగిరిలో శుక్రవారం మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు అందచేశారు. కార్యక్రమంలో అశోక్‌తో పాటు పలువురు పార్టీ నేతలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఇంకొల్లు నుంచి

ఇంకొల్లు : విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఇంకొల్లు నల్లమోతు రామానుజమ్మ, వెంకటసుబ్బారావు బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు తమ వంతు సహాయం చేశారు .ఇంకొల్లు, భీమవరం, దగ్గుబాడు గ్రామాలలో ప్రజల నుంచి రూ.30,300లు నగదు సేకరించారు. పాఠశాల ఉపాధ్యాయులు కూడా ఆర్థిక సాయం అందించారు. విద్యార్థినులు వసూలు చేసిన నగదును శుక్రవారం ముఖ్యమంత్రి సహాయనిధికి అందజేశారు.

వరద బాధితులకు సాయం కోసం విద్యార్థుల ర్యాలీ

మార్టూరు : విజయవాడలోని వరదబాధితులకు సహాయం చేయాలని మండలంలోని వలపర్ల గ్రామ జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎన్‌సీసీ విద్యార్థులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఎన్‌సీసీ క్యాడెట్ ఆఫీసర్ కె. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ప్రజలనుంచి రూ. 13,097ల వసూలయ్యాయని ఆయన తెలిపారు.

గడియారస్తంభం నిర్మాణం లేనట్లే

చీరాల, సెప్టెంబరు 13 : చీరాల పట్టణంలోని ల్యాండ్ మార్కులలో గడియార స్తంభం సెంటర్ ఒకటి. ప్రస్తుతం అక్కడ గడియార స్తంభం మాత్రం లేదు. ఆ పేరు మాత్రం అలానే ఉంది. మున్సిపాలిటీ పరంగా ఇకపై గడియారస్తంభం నిర్మాణం చేపట్టే ఆలోచన కూడా లేనట్లు తెలుస్తోంది. చీరాల ప్రధాన కూడలిలోని గడియార స్తంభంకు సుదీర్ఘ చరిత్ర ఉంది. 1950 ప్రాంతంలో అప్పటి మున్సిపల్ చైర్మన్ అన్నదాత నాగేంద్రుడు హయాంలో గడియార స్తంభాన్ని నిర్మించారు. అప్పట్లో ఇది పురప్రజలకు సమయ దిక్సూచిగా ఉండేది. అయితే తరువాత జరిగిన పరిణామాల క్రమంలో తొలుత నిర్మించిన గడియారస్తంభాన్ని పురపాలకులు తొలగించారు. సుమారు దశాబ్దంన్నర క్రితం గడియారస్తంభం కూడలిలోని మున్సిపల్ భవన సముదాయాన్ని తొలగించే క్రమంలో స్తంభాన్ని కూడా తొలగించారు. ఆ తరువాత రూ.14 లక్షల వ్యయంతో మరో గడియారస్తంభాన్ని నిర్మించారు. అయితే అందులో గడియారాలు ఏ రోజూ సరైన సమయం సూచించేవికావు. దీంతో ఆ గడియార స్తంభాన్ని కూడా తొలగించారు. దాని స్థానంలో కొత్తది ఏర్పాటు చేస్తామని పాలకులు, అధికారులు చెప్పుకుంటూ వస్తున్నారు. అయితే అది ఆచరణకు నోచుకోలేదు. ఓ దశలో మున్సిపల్ సాధారణ నిధుల నుంచి నిర్మించేందుకు టెండర్లు పిలిచారు. అయితే కాంట్రాక్టరు నిర్మాణం చేపట్టేందుకు ముందుకు రాలేదు. ఆతరువాత ఐటీసీ, ఐఎల్‌టీడీ కంపెనీ వారు నిర్మాణం చేపట్టేందుకు సుముఖత చూపారు. తరువాత వారూ ఆ ఆలోచనను విరమించుకున్నారు. మొత్తం మీద గడియారస్తంభం సెంటర్ పేరుకు మాత్రమేగాని అక్కడ ఏర్పాటు జరిగే అవకాశం లేదని పురప్రజలు భావిస్తున్నారు.



చీరాలలోని గడియారస్తంభం (ఫైల్)

పరిశీలించి తగిన చర్యలు చేపడతాం

- చక్రవర్తి, కమిషనర్, చీరాల మున్సిపాలిటీ

గడియారస్తంభం అనేది ఒక ల్యాండ్ మార్క్. గతంలో ఏం జరిగిందనేది పూర్తిగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. అందుకు సంబంధించి విషయాన్ని ఎమ్మెల్యే కొన్సిల్ దృష్టికి తీసుకెళ్లి తదనుగుణంగా చర్యలు చేపడతాం.

అమ్మ చివరి ఫొటో..

- రెండు రోజుల వ్యవధిలో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులు
- ముగిసన అంత్యక్రియలు
- చివరిసారిగా అమ్మ ఫొటో తీసుకున్న పెద్ద కుమార్తె
- కన్నీటి పర్యంతమైన బంధువులు



చివరిసారిగా తల్లి ఫొటో తీసుకుంటున్న పెద్ద కుమార్తె

చీరాల మండలంలో జరిగిన హృదయవిదారక ఘటన ఆ పసి గుండెలకు తీరని గాయాన్ని మిగిల్చింది. రెండు రోజుల వ్యవధిలో తల్లిదండ్రులను కోల్పోయిన వారి వేదన చెప్పనలవికానిది. శుక్రవారం కావూరివారిపాలెం పంచాయతీ ఆంధ్రకేసరి నగర్‌కి చెందిన దుడ్డు కుమారి(35)కు బంధువులు అంత్యక్రియలు ముగించారు. ఆమె భర్త సతీష్ గత సోమవారం తెల్లవారుజామున మృతిచెందగా అంతిమ సంస్కారాలు ముగిశాయి. అలాగే గురువారం మృతిచెందిన అతని భార్య కుమారికి శుక్రవారం అంత్యక్రియలు చేశారు. అయితే తల్లికి కార్యక్రమాలు ముగించే క్రమంలో పెద్దకుమార్తె సాత్విక ఫోన్‌లో తల్లి చివరి ఫొటో తీసుకుంది. అంతేకాకుండా మృతురాలు క్రిస్టియన్ కావడంతో ముగింపు ప్రార్థన జరుగుతుండగా పెద్ద కుమార్తె, చిన్న కుమార్తె శ్రేష్ఠ చివరి పాటను వారే పాడి కార్యక్రమాలను ముగించారు. వారి అమాయకపు ప్రవర్తనను చూస్తున్న బంధువులు దేవుడా ఇటువంటి వేదన ఎవరికీ రాకూడదని రోదించారు. ఎంతో ఆనందంగా గడుస్తున్న ఆ చిన్నారుల జీవితాలు తల్లిదండ్రుల మృతితో తీరని శోకాన్ని మిగిల్చాయి.

- చీరాలటౌన్

ఉత్సవాల నిర్వహణ హర్షణీయం

- ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, సెప్టెంబరు 13 : గణపతి నవరాత్రి ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించటం హర్షణీయమని ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య అన్నారు. స్థానిక ఎంజీసీ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన శేషవయన గణపతి మందిరంలో శుక్రవారం ఆయన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. 30 అడుగుల ఎత్తున్న వినాయకప్రతిమ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ ప్రతినిధులు, వ్యాపారులు ఆనవాయితీగా గణపతి ఉత్సవాలను నిర్వహిస్తున్న విధానాన్ని వివరించారు. క్రమం తప్పకుండా కొనాగిస్తున్న ఉత్సవాలలో ఇది 34వ సంవత్సరమని తెలిపారు. పూజ కార్యక్రమాల అనంతరం నిర్వహకులు ఎమ్మెల్యే కొండయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మహాత్మాగాంధీ డెవలప్‌మెంట్ సొసైటీ, ది టెక్స్‌టైల్ మర్చంట్స్ అసోసియేషన్, ఎంజీసీ మార్కెట్ కమిటీ ప్రతినిధులు, వస్త్రవ్యాపారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గణపతి ఉత్సవాల్లో ఎమ్మెల్యే కొండయ్యను సన్మానిస్తున్న ఎంజీసీ మార్కెట్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు

విద్యాభివృద్ధికి పూర్తి సహకారం

అద్దంకి, సెప్టెంబరు13: విద్యాభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని కూకట్ల ఫౌండేషన్ నిర్వాహకులు కూకట్ల సుబ్బారావు అన్నారు. మండలంలోని తిమ్మాయపాలెం హైస్కూల్ ప్లస్ విద్యార్థినులు ఇంటర్మీడియట్ పూర్తి చేసుకొని నర్సింగ్ కోర్సులో చేరుతున్న అన్నంగి స్రవంతి, బుసి రమ్యలకు కూకట్ల పౌండేషన్ తరఫున ఒక్కొక్కరికి 20 వేల రూపాయల నగదు అందజేశారు. మూడు సంవత్సరాల పాటు నగదు ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిమ్మాయపాలెం, చక్రాయపాలెం హైస్కూళ్ల హెచ్‌ఎంలు గంగాధరరావు, కేవీ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నగదు ప్రోత్సాహాన్ని అందజేస్తున్న కూకట్ల పౌండేషన్ నిర్వాహకులు కూకట్ల సుబ్బారావు, వింధ్యావళి దంపతులు

ఏచూరి మృతి ఉద్యమానికి తీరనిలోటు

పంగులూరు, సెప్టెంబరు 13 : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి ఆపార్టీకి, వామపక్ష ఉద్యమాలకు తీరని లోటని సీనియర్ నాయకులు నాగబోయిన రంగారావు అన్నారు. పంగులూరులో సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ఏచూరి చిత్రపటానికి రంగారావు పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే బైటమంజులూరులో ఏచూరికి పార్టీ నేతలు నివాళి అర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాయిణి వినోద్ బాబు, తలపనేని రామారావు, సుబ్బారావు, గడిపాటి మల్లారెడ్డి, ఆదుంసాహెబ్, కృష్ణకుమారి, రామాంజమ్మ, ఏలియా, సుబ్బరాజు, రామచంద్రరాజు, కృష్ణంరాజు, రమాదేవి, ప్రమీల పాల్గొన్నారు.



ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాగబోయిన రంగారావు తదితరులు

చీరాలలో

చీరాలటౌన్ : ఏచూరికి పలువురు నేతలు ఉపాధ్యాయులు ఘన నివాళులు అర్పించారు. చీరాల మండల పరిధిలోని విజయనగర్ కాలనీ ఎలిమెంటరీ స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ప్రతినిధులు మాట్లాడారు.

ఘన నివాళి

మార్టూరు : స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం ఏచూరి సంతాపసభను రైతు సంఘం నాయకులు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ కార్యక్రమంలో కందిమళ్ల రామకోటేశ్వరరావు, బత్తుల హనుమంతరావు,బి.సూరిబాబు, వై.రాంబాబు, గఫూర్, ఇబ్రహీం,గోలి మల్లికార్జునరావు, బి. లక్ష్మీ సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.



ఏచూరి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న రైతు సంఘం నాయకులు

బాధ్యతగా విధులు నిర్వహించాలి

ఇంకొల్లు, సెప్టెంబరు 13 : అంగన్‌వాడీ కార్యకర్తలు బాధ్యతగా విధులు నిర్వహించాలని డీసీపీవో పురుషోత్తం అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాలలో భాగంగా ఇంకొల్లులో శుక్రవారం అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల భద్రత, బాలల హక్కులు, బాల్యవివాహాల గురించి కార్యకర్తలకు తగు సూచనలు చేశారు.

నేటి నుంచి త్రివిక్రమ స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు

చెరుకూరు(పర్చూరు), సెప్టెంబరు 13: పర్చూరు మండల పరిధిలోని చెరుకూరు గ్రామంలోని త్రివిక్రమ స్వామి ఆలయంలో పవిత్రోత్సవాల్లో భాగంగా నేటి నుంచి 16వ తేదీ వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి నాగయ్య శుక్రవారం ఒక ప్రకటలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఈనెల 16న సోమవారం స్వామివార్లకు శాంతి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామన్నారు. తిరుపతి, తిరుమల దేవస్థానం భావన్నారాయణ స్వామివారి బృందంచే స్వామివారికి అభిషేకం నిర్వహి స్తామనిఆయన తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివార్ల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేడు పర్చూరులో జాతీయ లోక్ అదాలత్

పర్చూరు, సెప్టెంబరు 13: పర్చూరులోని కోర్టు భవనాల సముదాయంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ న్యాయాధికారి కె.ప్రశాంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోక్ అదాలత్‌లో ఇచ్చిన తీర్పు అంతిమతీర్పు అని అన్నారు. రాజీ చేయదగిన అన్నీ కేసులు ఇరు వర్గాల అంగీకారంతో పరిష్కరించుకోవచ్చన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కరించిన కేసులకు సంబంధించి ఫీజులు కూడా తిరిగి చెల్లిస్తామన్నారు. ఈ అవకాశాన్ని అర్జీదారులు, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే కఠిన చర్యలు

అద్దంకి, సెప్టెంబరు13: బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకోవటంతో పాటు కేసులు నమోదు చేస్తామని ఎస్సై ఖాదర్ బాషా అన్నారు. అద్దంకి పట్టణంలోని శివారు ప్రాంతాలలో శుక్రవారం రాత్రి ఎస్సై తనిఖీలు చేస్తుండగా పలువురు బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తూ పట్టుబడ్డారు. వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

నేడు కుర్రవానిపాలెంలో ఉచిత వైద్య శిబిరం

మేదరమెట్ల,సెప్టెంబరు13: కొరిశపాడు మండలంలోని కుర్రవానిపాలెం గ్రామ సచివాలయ ఆవరణలో శనివారం కిమ్స్ హాస్పిటల్ ఒంగోలు వారిచే ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్యాంప్ కో ఆర్డినేటరు పి, కాలేషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్యశిబిరంలో ఎముకలు, కీళ్లు, నరాలు, కంటిచూపు, గుండె, గ్యాస్ట్రబుల్, సాధారణ వ్యాధులకు ఉచితంగా పరీక్షలు చేస్తారన్నారు.అంతేగాకుండా సుగర్, బీపీ, ఈసీజీ పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

విధుల్లోకి మున్సిపల్ కమిషనర్

చీరాల, సెప్టెంబరు 13 : ఎనిమిది రోజుల నుంచి విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో నిర్దేశించిన ప్రదేశాల్లో సహాయక చర్యల్లో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ చక్రవర్తి, సిబ్బంది శుక్రవారం అక్కడ నుంచి రిలీవ్ అయ్యారు. స్థానికంగా తమ విధుల్లో చేరారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తాము నిర్వహించిన విధులను వివరించారు.

నలుగురు జూదరుల అరెస్టు

ఇంకొల్లు, సెప్టెంబరు 13 :మండలంలోని వంకాయలపాడు గ్రామశివారులోని పేకాటస్థావరాలపై ఎస్సై సురేష్ తమ సిబ్బందితో శుక్రవారం దాడులు నిర్వహించారు.పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని రూ.19, 900లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

గణనాథుడికి నోట్ల అలంకరణ

పంగులూరు, సెప్టెంబరు 13 : మండలంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గ్రామాలలోని మండపాలలో కొలువుదీరిన గణనాథులకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. శుక్రవారం భగవాన్‌రాజుపాలెం గ్రామంలోని సీతారామాంజనేయస్వామి ఆలయంలో ఏర్పా టు చేసిన వినాయక విగ్రహాన్ని కరెన్సీనోట్లతో ప్రత్యేకంగా అలంకరించారు. రాత్రివేళ భజనకార్యక్రమాలు నిర్వహించారు. పంగులూరులోని వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గణేషుడికి శుక్రవారం రాత్రి పూజాకార్యక్రమాలు నిర్వహించిన అనంతరం లడ్డూ వేలం నిర్వహించారు.



నోట్ల అలంకరణలో గణనాథుడు



దేశస్థాయిలో జరిగిన పోస్టర్ కాంపిటేషన్‌లో ఉత్తమ చిత్రంగా ఎంపికయిన విద్యార్థిని భవ్యశ్రీ ప్రదర్శించిన చిత్రం (ఇన్‌సెట్లో) విద్యార్థిని

పోస్టర్ కాంపిటేషన్‌లో కొండమంజులూరు విద్యార్థిని సత్తా

- దేశ స్థాయిలో ప్రథమస్థానం సాధించిన భవ్యశ్రీ

పంగులూరు, సెప్టెంబరు 13 :ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా గత నెలలో భారత ప్రభుత్వ పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ దేశ స్థాయిలో నిర్వహించిన పోస్టర్ కాంపిటేషన్‌లో కొండమంజులూరు ఆర్‌జేఆర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పంచుమర్తి భవ్యశ్రీ ప్రథమ స్థానంలో నిలిచింది. మోంట్రియల్ ప్రొటోకాల్ అడ్వాన్సింగ్ క్లైమేట్ యాక్షన్ అనే అంశంపై జాతీయస్థాయిలో ఆగస్టు 30న జరిగిన పోస్టర్ కాంపిటేషన్ పోటీకి దేశ స్థాయిలో వివిధ రాష్ట్రాల నుంచి 4 వేల మంది విద్యార్థులు పాల్గొన్నట్లు పాఠశాల హెచ్ఎం అనిత తెలిపారు. ఈ పోటీలకు సంబంధించిన ఫలితాలను న్యూ ఢిల్లీలోని పర్యావరణ శాఖ శుక్రవారం భారతీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రకటించారు. ఈ పోటీలలో బాపట్ల జిల్లా జె.పంగులూరు మండలం కొండమంజులూరు ఉన్నత పాఠశాల విద్యార్థిని పంచుమర్తి భవ్యశ్రీ ప్రదర్శనకు పంపిన చిత్రం అత్యుత్తమ చిత్రంగా ఎంపికయిందని హెచ్ఎం తెలిపారు. ఈ విద్యార్థినికి తర్ఫీదు ఇచ్చి పాఠశాల పేరు జాతీయ స్థాయిలో ఇనుమడింప చేసిన చిత్రలేఖన ఉపాధ్యాయుడు తిరుమలశెట్టి వెంకటేశ్వరరావుతో పాటు మార్గదర్శకత్వం వహించిన పాఠశాల విజ్ఞానశాస్త్ర ఉపాధ్యాయుల సమష్టి కృషిని ఎస్ఎంసీ చైర్మన్ గోలి సంధ్య గ్రామ పెద్ద చింతల సహదేవుడు కొనియాడారు.

ఇసుక అక్రమ రవాణాకు కళ్లెం

- అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్

చీరాలటౌన్, సెప్టెంబరు 13 : ఇసుక అక్రమ రవాణా జరగకుండా పటిష్ఠ భద్రత నిర్వహిస్తున్నట్లు అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ ఆదేశాల మేరకు ఏఎస్పీ చీరాల మండల పరిధిలోని విజయలక్ష్మీపురం సమీపంలోని స్ట్రయిట్‌కట్, మోడల్ స్కూల్ సమీపంలో తవ్వకాలను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అక్రమ రవాణాకు పోలీస్, రెవెన్యూ, నీటిపారుదల శాఖ, ఎక్సైజ్ విభాగాలు సమన్వయంతో ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. స్టాక్ పాయింట్లలో నిబంధలను అనుసరించి మాత్రమే రవాణా జరిగేలా చూడాలన్నారు. అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకునేలా సమాయత్తమవ్వాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ జగదీష్ నాయక్, సిఐ సత్యనారాయణ, తహసీల్దార్ గోపీకృష్ణ, నీటిపారుదల శాఖ ఏఈ పురుషోత్తం, ఎక్సైజ్ సీఐ కర్ణ, ఎస్సై శివకుమార్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.



ఇసుక అక్రమ తవ్వకాలను పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్

ఏఆర్‌టీ రోగులకు ఉచిత అన్నదానం అభినందనీయం

- చీరాల డీఎస్పీ జగదీష్ నాయక్

చీరాలటౌన్, సెప్టెంబరు 13 : చీరాల ఏరియా హాస్పిటల్‌కు విచ్చేసే ఏఆర్‌టీ రోగులకు ఉచిత అన్నదానం అభినందనీయమని చీరాల డీఎస్పీ జగదీష్‌నాయక్ అన్నారు. చైతన్య మనోవికాస కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం ఏరియా హాస్పిటల్‌లో ఏఆర్‌టీ రోగులకు ఏర్పాటు చేసిన నిత్య అన్నదానం కార్యక్రమానికి డీఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయి ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రోగులకు మందులతో పాటు ఆహారం చాలా ముఖ్యమని చెప్పారు. నిర్వాహకులు డైరక్టర్ వెంకన్నబాబు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుభాషిణి, ఏఆర్‌టీ నోడల్ అధికారి డాక్టర్ హరిబాబు, ఆర్ఎంవో శ్రీకాంత్, ప్రతినిధులు జానీబాషా, సిబ్బంది, ఐసీటీసీ సిబ్బంది, డీఆర్‌సీ కౌన్సిలర్‌లు, ఏఆర్‌టీ రోగులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ జగదీష్ నాయక్

వ్యాసరచనలో ద్వితీయ స్థానం

అద్దంకి, సెప్టెంబరు13: వికసిత్ ఆంధ్రప్రదేశ్ ఎట్ - 2047 అనే అంశంపై జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో అద్దంకి మండలం తిమ్మాయపాలెం హైస్కూల్ 10 వ తరగతి విద్యార్థిని ఆరుద్ర తన్మయి ద్వితీయ స్థానం పొందింది. ఈ సందర్భంగా విద్యార్థిని తన్మయిని, గైడ్‌గా వ్యవహరించిన మ్యాథ్స్ ఉపాధ్యాయురాలు ద్వారకాదేవి, సైన్స్ ఉపాధ్యాయురాలు ధనలక్ష్మిలను హెచ్‌ఎం గంగాధరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.



ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న విద్యార్థిని ఆరుద్ర తన్మయి

రక్తహీనత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు 13 : గర్భిణులు రక్తహీనతకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏసీడీపీవో ఎం. సుచిత్ర చెప్పారు. మండల పరిధిలోని దేశాయిపేట సెక్టార్ నీలకంఠపురం అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా రక్తహీనతకు గురికాకుండా తీసుకోవాల్సిన ఆహార నియమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లీలావతి, అంగన్వాడీ కార్యకర్త అంజలి, గర్భవతులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.



పౌష్టికాహార మాసోత్సవాల్లో గర్భిణులకు సీమంతం చేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు

మాలకొండ హుండీల ఆదాయం రూ. 1,11,59,854

వలేటివారిపాలెం : మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామికి 12 శనివారాలకు గాను 37 హుండీల ద్వారా రూ.1,11,59,854 ఆదాయం లభించింది. మాలకొండ కల్యాణ మండపంలో ప్రథమ శ్రేణి కార్యనిర్వాహణాదికారి వీవీఎల్ రవీంద్రనాథ్ పర్యవేక్షణలో శుక్రవారం హుండీల లెక్కింపు జరిగింది. ఆ లెక్కింపులో నగదుతోపాటు 280 గ్రాముల బంగారం, 1634 గ్రాముల వెండి, 175 యూఎస్, 100 ఆస్ట్రేలియా, 60 యూరప్ డాలర్లు, 2 డైమండ్స్, 1 క్యూటన్ రాయల్, 100 సౌతాఫ్రికా రాండ్ లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కే.బీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ లెక్కింపులో మాదాల లక్ష్మీనరసింహం, కాకుమాను హర్షకుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యర్థం.. అనర్థం!



సంగం : డ్రమ్ముల్లోని కోళ్ల వ్యర్థాలను చేపల చెరువులోకి వేస్తున్న దృశ్యం



చికెన్, చేపల మార్కెట్‌కు వెళ్లినప్పుడు ఎప్పుడైనా గమనించారా!? కోడిలో ఉన్న వ్యర్థాలను తొలగించి మనకు మాంసం మాత్రం తూకం వేసి ఇస్తారు. మరి ఆ వ్యర్థాలను ఏం చేస్తారని ఆలోచించారా!? లేదు కదా! ఇందులో నమ్మలేని నిజం ఒకటి ఉంది. ఆ వ్యర్థాలనే మనం తింటున్నాం. నమ్మశక్యంగా లేదా!? నిజమండీ. మహానగరాలు, పట్టణాల్లో భారీస్థాయిలో ఉత్పత్తి అయ్యే ఎందుకూ పనికిరాని చికెన్ వ్యర్థాలను జిల్లాలో డంప్ చేస్తున్నారు. ఇక్కడ వేల ఎకరాల్లో ఉన్న గుంతల్లోని చేపలకు వాటిని ఆహారంగా వేస్తున్నారు. చేపలు పెద్దవయ్యాక అమాయక ప్రజలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. మన ఆరోగ్యంతో చెలగాటం అడుతున్న ఈ వ్యవహారం వెనుక పెద్ద మాఫియానే ఉంది. ఇంత జరుగుతున్నా అధికారులు ఏం చేస్తున్నారని మీకు అనుమానం రావొచ్చు. ట్రిప్పునకు, నెల మామూళ్లు అందుతుండటంతో వారు కూడా ఆ పాపంలో పాలు పంచుకుంటున్నారు. అదెలాగో 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ఈ ప్రత్యేక కథనం చదవండి.

జిల్లాలోని సంగం, బుచ్చిరెడ్డిపాళెం, చేజర్ల, టీపీగూడూరు, ముత్తుకూరు, ఇందుకూరుపేట, కొడవలూరు, విడవలూరు తదితర మండలాల్లో సుమారు 40 వేల ఎకరాల్లో అధికారికంగా, మరో పదివేల ఎకరాల్లో అనధికారికంగా చేపల చెరువులు (గుంటలు) ఉన్నాయి. ఫంగస్, రూప్‌చంద్, గండి, బొచ్చె, క్యాట్‌ఫిష్ తదితర రకాలకు చెందిన చేపలను సాగు చేస్తున్నారు. స్థానికంగా కొందరు, ఉత్తరాది జిల్లాల నుంచి వలస వచ్చిన కొందరు ఇక్కడున్న మాగాణి భూములను కౌలుకు తీసుకుని చేపల చెరువు ఏర్పాటు చేసుకుంటున్నారు.

● మేత ఖర్చు భరించలేక..

సంప్రదాయ చేపల మేత కిలో రూ.35 ధర ఉండగా, చికెన్ వ్యర్థాలు రూ.8లకే దొరుకుతుంది. ఒక ఎకరా చేపల చెరువుకు సంప్రదాయ మేత రోజుకు 20 కేజీల వరకు వేయాల్సి ఉండగా ఖర్చు రూ.700. నెలకు రూ.21 వేలు అవుతుంది. కూలికి రూ.100 చొప్పున నెలకు రూ.3వేలు ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా మొత్తం ఖర్చు రూ.24 వేలు. అదే చేపల వ్యర్థాలు 200 కేజీల డ్రమ్ము రూ.1600లకే చేపల చెరువులో వేసి వెళతారు. రెండు డ్రమ్ముల చొప్పున నెలకు 8 డ్రమ్ముల చికెన్ వేస్ట్ సరిపోతుంది. ఇందుకు రూ.12,800 ఖర్చు అవుతుంది. అంతేగాక చేప పిల్లల ఎదుగుదల బాగుంటుంది. ఎంతలేదన్నా ఒక ఎకరాలో రైతుకు సుమారు లక్ష రూపాయల వరకు ఖర్చు తగ్గుతుంది.

● రవాణాదారులకూ ఆదాయమే!

అంతేకాదు... చికెన్ వ్యఅర్థలకు సరఫరా చేసే వారికీ భారీ ఆదాయం ఉంటోంది. పట్టణాలు, నగరాల్లో ఒకనాడు వృథాగా పడేసే చికెన్ వేస్టేజీని చేపల చెరువులకు వినియోగించడంతో దళారుల మధ్య పోటీ పెరిగింది. కిలో రూ.2 నుంచి 3లకు అంటే 200 కేజీల డ్రమ్ము రూ. 400లకు కొనుగోలు చేసి, రవాణా ఖర్చుతో కలిపి రూ. 1600లకు విక్రయిస్తున్నారు. ఒక్కో లారీలో సుమారు 80 డ్రమ్ముల వేస్టేజీని జిల్లాకు దిగుమతి చేస్తున్నారు. డ్రమ్ముకు వెయ్యి మిగిలినా ట్రిప్పునకు రూ.80 వేల వరకు ఆదాయం ఉంటోంది. నెలలో నాలుగు సార్లు తెస్తే రూ. 3.2 లక్షలు ఆదాయం వస్తుంది.



ఆంధ్రజ్యోతి ఫోకస్

● మహా నగరాల నుంచి దిగుమతి

చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ వంటి మహా నగరాలతోపాటు రాయలసీమ జిల్లాల్లోని పలు పట్టణాల్లో చికెన్ దుకాణాల్లో కోళ్ల వ్యర్థాలను సేకరిస్తున్నారు. వీటిని డ్రమ్ముల్లో వేసుకుని వాహనాల్లో చేపల చెరువులకు తరలిస్తున్నారు. దారి పొడవునా ముక్కుపుటాలదిరే దుర్వాసన భరించలేక పీల్చిన రైతులు, ప్రజలు నెమ్ము సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు. ఒక్క బుచ్చి ప్రాంతానికే రోజుకు సుమారు 30 నుంచి 50 వాహనాలలో వ్యర్థాలను తీసుకువస్తున్నట్టు సమాచారం. ఈ వ్యవహారం వెనుక పెద్ద మాఫియానే ఉందని సమాచారం. కోళ్ల వ్యర్థాల రవాణాను అడ్డుకోకుండా ఇటు మత్స్య శాఖ, అటు పోలీస్‌లను మామూళ్లతో మభ్యపెడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దూర ప్రాంతాల నుంచి తీసుకువస్తుండటంతో చెరువు వద్దకు చేర్చేసరికి కోళ్ల వ్యర్థాలు కుళ్లిపోయి పురుగు పట్టి తీవ్ర దుర్గంధం వెదజల్లుతున్నాయి. కొంత మంది (ఫంగస్ చేపల చెరువులకు) నేరుగా చేపలకు మేతగా వేస్తుండగా మరి కొందరు ప్రత్యేక పాత్రల్లో ఉడకబెట్టి మేతగా వేస్తున్నట్లు సమాచారం. దీంతో చెరువులోని నీరు పూర్తిగా పాడవుతోంది. ఇదే నీటిని ఊట కాలువలకు విడిచిపెట్టినప్పుడు సమీపం పంట పొలాలు, మంచినీటి చెరువుల్లోకి చేరుతోంది. దీంతో పరిసర ప్రాంతాలు కలుషితమవుతున్నాయని పర్యావరణ ప్రియులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చేపల చెరువుల్లో చికెన్ వేస్టేజీ డంప్ | మహా నగరాల నుంచి భారీగా దిగుమతి | అక్కడ రూ.వందలకు కొని ఇక్కడ రూ.వేలకు విక్రయాలు | మత్స్య శాఖ నుంచి పోలీసుల వరకు మామూళ్లు | ఆ చేపలు తింటే ప్రాణాలకే ముప్పు | పొలాలు, సాగునీటి కాలువలూ విషతుల్యం



బుచ్చిరెడ్డిపాళెం : మినగల్లులోని ఓ చేపలగుంతలో నీటిలో తేలియాడుతున్న వ్యర్థాలు



బుచ్చిరెడ్డిపాళెం : సాగునీటి కాలువలోకి వదిలిన వ్యర్థాల నీరు

● నియంత్రణ శూన్యం

కోళ్ల వ్యర్థాలు తరలించేవారిపై మత్స్య శాఖ అధికారులు, సిబ్బంది నిఘా ఉంచి వాహనాలను పట్టుకుని పోలీసులకు ఫిర్యాదు చేయాలి. కానీ ఆ శాఖ అధికారులు పత్తాలేకపోవడంతో పోలీసులు సైతం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. చేపల చెరువులు ఉన్న మండలాల పోలీస్‌స్టేషన్ పరిధిలో వ్యర్థాలను తరలించే వాహనాల నుంచి మాముళ్ల వసూలు చేసి ఆ శాఖ జిల్లా ఉన్నతాధికారికి నెల మాముళ్లు ఇచ్చేవారని అప్పట్లో బహిరంగంగా ఆరోపణలు వినిపించాయి. అయితే, ఆ అధికారి బదిలీపై వెళ్లినా మాముళ్ల వసూలు యథావిధిగా జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఒకవేళ పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేస్తే వాహనాలకు కోర్టులో పూచీకత్తు అందజేసి మళ్లీ యథావిధిగా వ్యర్థాలను తీసుకొస్తున్నాయి.



బెంగుళూరు నుంచి డ్రమ్ముల్లో తెచ్చిన వ్యర్థాలు

● చెరువులకు సాగునీరు..

చేపల చెరువులకు బోరు పాయింట్ ఉందా లేదా అని చూసి మత్స్య శాఖ అనుమతి ఇస్తుంది. కానీ, క్షేత్రస్థాయిలో ఈ నిబంధనలు అమలు కావడం లేదు. పంట పొలాలకు వెళ్లే కాలువలకు మోటార్లు పెట్టి నీటిని నిరంతరం లిఫ్ట్ చేస్తున్నారు. దీంతో సాటి నీటికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని సమీప రైతులు ఆవేదన చెందుతున్నారు. బుచ్చిలోని కనిగిరి రిజర్వాయర్ నుంచి ప్రధాన కాలవల వెంబడి ఉన్న చేపల గుంతల్లోని వృథా నీటిని ఈ కాలువల్లోకే వదిలేస్తున్నారు. చుట్టుపక్కల రైతులు, ప్రజలు, రవాణా చేసే కూలీలు, క్యాన్సర్, అలర్జీ, నెమ్ము సంబంధిత వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారు.

● వ్యాధుల భయం

చేపలకు కోళ్ల వ్యర్థాలను వినియోగించడం వల్ల తీవ్రస్థాయిలో దుష్పరిణామాలు తలెత్తుతాయి. ఈ చేపలను తిన్నా, కలుషితమైన నీటి వల్ల శ్వాసకోస వ్యాధులతోపాటు ఇన్‌ఫ్లూయంజా, ఫ్లూ వంటి చర్మ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదముందని వైద్య ఆరోగ్య అధికారులు చెబుతున్నారు.

పోలీసులతోనే సాధ్యం



వ్యర్థాల నియంత్రణ చేయాలంటే మా దగ్గర సిబ్బంది కొరత ఉంది. పోలీసుల సహకారం ఉంటే నివారించవచ్చు. అలాగే రెవెన్యూ అధికారులతోపాటు ప్రజల సహకారం కూడా ఉండాలి. గ్రామపంచాయతీల్లో పంచాయతీ అధికారులతో ప్రజలకు కోళ్ల వ్యర్థాలపై అవగాహన కల్పించి చర్యలు చేపడుతున్నాం. వ్యర్థాలను వాడుతున్న గుంటల అనుమతులు రద్దు చేయవచ్చు.

- నాగేశ్వరరావు, మత్స్య శాఖ జేడీ

- సంగం/బుచ్చిరెడ్డిపాళెం



సంగం బ్యారేజీకి ఉన్న మేకపాటి గౌతమ్‌రెడ్డి పేరు తొలగిస్తున్న బ్యారేజీ కనస్ట్రక్షన్ నిర్వాహకులు

పెన్నానదిపై బ్యారేజీల పేరు మార్పు!

సంగం, సెప్టెంబరు 13: సంగం, నెల్లూరు బ్యారేజీల పేరు మార్చుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సంగం బ్యారేజీకి మేకపాటి గౌతమ్‌రెడ్డి పేరును శుక్రవారం బ్యారేజీ కనస్ట్రక్షన్ నిర్వాహకులు తొలగించారు. సంగం ఆనకట్ట స్థానంలో 2022లో నూతన బ్యారేజీ నిర్మించి ప్రారంభించిన విషయం విదితమే. బ్యారేజీ ప్రారంభ సమయంలో మంత్రిగా ఉండి అకాల మరణం పొందిన స్థానిక ఎమ్మెల్యే మేకపాటి గౌతమ్‌రెడ్డి పేరును అప్పటి వైసీపీ ప్రభుత్వం నామకరణం చేసింది. కాగా, ఇటీవల అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని పలు బ్యారేజీలకు పాత పేర్లనే పునరుద్ధరిస్తూ జీవో జారీ చేసింది. ఆ మేరకు బ్యారేజి కన్‌స్ట్రక్షన్ నిర్వాహకులు సంగం బ్యారేజీ వద్ద ఉన్న నేమ్ బోర్డులో మేకపాటి గౌతమ్‌రెడ్డి పేరును తొలగించారు. అలాగే నెల్లూరులోని నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి నెల్లూరు బ్యారేజీ పేరును కూడా తొలగించి, నెల్లూరు బ్యారేజీగా మార్పు చేశారు.



నెల్లూరు బ్యారేజీగా ఏర్పాటు చేసిన బోర్డు

పోలీసు కస్టడీకి మేయర్ భర్త

- కమిషనర్ల సంతకాల ఫోర్జరీ కేసులో జైలులో ఉన్న జయవర్ధన్
- నాలుగు రోజుల కస్టడీకి నేడు అప్పగింత
- ఎన్ని నిజాలు వెలుగు చూసేనో!

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 13: నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ల సంతకాల ఫోర్జరీ కేసులో నిందితుడిగా ఉన్న మేయర్ భర్త పీ జయవర్ధన్‌ను నాలుగు రోజులు పోలీసు కస్టడీకి అనుమతిస్తూ శుక్రవారం కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. జయవర్ధన్ ప్రస్తుతం జిల్లా కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో ఉన్నారు. నగరపాలక సంస్థ పూర్వ కమిషనర్లు హరిత, వికాస్ మర్మత్ సంతకాలు ఫోర్జరీ చేసి అక్రమాలకు పాల్పడిన కేసులో ఆయన అభియోగాలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది జూలైలో నాటి కమిషనర్ వికాస్ మర్మత్ ఫిర్యాదు మేరకు టీపీవోలు ప్రవీణ్‌కుమార్, దేవేంద్ర, వార్డ్‌ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీలు నాగేంద్రబాబు, కార్తీక్‌మాలవ్య, స్ట్రక్చరల్ ఇంజనీర్ అండ్ లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్ దిలీప్‌కుమార్, నగర మేయర్ భర్త పీ జయవర్ధన్, ఆయన సహాయకుడు శివకృష్ణపై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి కేసు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఈ నెల 10వ తేదీ జయవర్ధన్ నెల్లూరు ఐదో అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో లొంగిపోయారు. న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించడంతో జయవర్ధన్‌ను పోలీసులు కేంద్ర కారాగారానికి తరలించారు. కేసులో పూర్తిస్థాయి దర్యాప్తు కోసం తమ కస్టడీకి అప్పగించాలని పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కోర్టు నాలుగు రోజుల కస్టడీకి అనుమతించడంతో శనివారం జయవర్ధన్‌ను కస్టడీలోకి తీసుకున్నారు. ఈ నాలుగు రోజుల్లో ఆయన నుంచి ఎన్ని నిజాలు వెలుపలకు వస్తాయో అన్న ఉత్కంఠ ఇటు కార్పొరేషన్‌లో, అటు రాజకీయ వర్గాల్లో నెలకొంది.

అక్రమ రిజిస్ట్రేషన్.. ముగ్గురిపై సస్పెన్షన్ వేటు!

నెల్లూరు (హరనాథపురం) : నెల్లూరు రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయంలో జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారంలో ముగ్గురిని సస్పెండ్ చేస్తూ స్టాంపులు-రిజిస్ట్రేషన్‌ల శాఖ డీఐజీ కిరణ్‌కుమార్ సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. ప్రధాన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సబ్ రిజిస్ట్రార్ జాఫర్‌ను, అదే కార్యాలయంలో పని చేస్తున్న సింహాద్రి నాయుడు, స్టోన్‌హౌస్‌పేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ మిల్కీ రోషన్‌లపై వేటు పడింది. ఈ ఉత్తర్వులు అందుకున్న ఆ ముగ్గురు వెంటనే రిలీవ్ అయ్యారు. జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు మాట్లాడుతూ సస్పెండ్ అయిన వారి స్థానంలో ఇంకా ఎవరినీ ఇన్‌చార్జులుగా నియమించలేదని తెలిపారు.

15 నుంచి కోనలో పవిత్రోత్సవాలు

రాపూరు, సెప్టెంబరు 13: పెంచలకోన క్షేత్రంలో ఈనెల 15 నుంచి 18వ తేదీ వరకు పెనుశిల లక్ష్మీనరసిం హస్వామికి పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఉప కమి షనర్, కార్యనిర్వహణాధికారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పవిత్రోత్సవాలలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

జిల్లాకు 39 కొత్త ఆర్టీసీ బస్సులు

● 12 అద్దె బస్సులు కూడా.. ● త్వరలో మరో 32..

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), సెప్టెంబరు 13: గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ఆర్టీసీ నెల్లూరు రీజియన్‌కు ఒక్క కొత్త బస్సును కూడా కేటాయించలేదు. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలల్లోనే రీజియన్‌కు సూపర్ లగ్జరీ, అల్ట్రాడీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సులు 39, అద్దె బస్సులు 12 జిల్లాకు చేరుకొని రోడ్లపై పరుగెడుతోన్నాయి. త్వరలో మరో 32 బస్సులు రీజియన్‌కు రానున్నాయి. గడిచిన ఐదేళ్లలో ఒక్క బస్సు కూడా కొత్తది రాకపోవడంతో కాలం చెల్లిన ఆర్టీసీ బస్సులకు మరమ్మతులు చేసి వాటినే రోడ్లపై తిప్పారు. గుంతలమయమైన రోడ్లపై ప్రమాదకరమైన ప్రయాణం ఓ పక్క, మరమ్మతుల ఖర్చు మరో పక్క, కేఎంపీఎల్ రాకపోవడం, ఇలా అన్నివిధాలుగా ఆర్టీసీ సంస్థ నష్టపోతోందని ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు ప్రభుత్వానికి పదే పదే విన్నవించుకున్నా పట్టించుకున్న నాథుడే లేరు. ప్రస్తుతం వచ్చిన కొత్త బస్సులను కాలం చెల్లిన బస్సుల స్థానంలో అదే రూట్లలో నడుపుతూ ప్రయా ణికులకు ప్రశాంతమైన ప్రయాణం అందిస్తున్నారు. మరో 32 బస్సులు త్వరలో రానుండటంతో దూర ప్రాంతాలకు సర్వీసులను పెంచే ఆలోచనల్లో అధికారులు ఉన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

నెల్లూరు (లీగల్), సెప్టెంబర్ 13 : జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా జిల్లా వ్యాప్తంగా అదాలత్‌ను జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ అధ్వర్యంలో శని వారం నిర్వహించనున్నారు. అన్ని న్యాయస్థానాల్లో ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేసి రాజీకి యోగ్యమైన సివిల్, క్రిమినల్, కుటుంబ తగాదాలు, మోటార్ యాక్సిడెంట్ కేసులు, లేబర్ కోర్టు కేసులు పరిష్కరించనున్నారు. దీనిని కక్షిదారులు వినియోగించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ప్రెసిడెంట్ సీ యామిని, సెక్రటరీ కే వాణి సంయుక్తంగా విజ్ఞప్తి చేశారు.

కార్పొరేషన్‌లో కౌన్సెలింగ్

నెల్లూరు (సిటీ), సెప్టెంబరు 13 : జిల్లాలోని నగర పాలక సంస్థతోపాటు ఇతర మున్సిపాలిటీల్లోని సచివాలయ కార్యదర్శులకు బదిలీల కౌన్సెలింగ్ శుక్రవారం జరిగింది. వివిధ విభాగాలకు చెందిన 72 మంది కార్యదర్శులు బదిలీలు కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన కౌన్సెలింగ్‌కు 53 మంది మాత్రమే హాజరైనట్లు డిప్యూటీ కమిషనర్ చెన్నుడు తెలిపారు. పురపాలక శాఖ నిబంధనలు మేరకే కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



కౌన్సిలింగ్‌కు హాజరైన సెక్రటరీలు

చిట్టిచేతులు.. పెద్ద సాయం



ఇంటి నుంచి తెచ్చిన నోట్లను చూపుతున్న చిన్నారులు

మనుబోలు: విజయవాడ వరద బాధితుల కోసం మేమూ ఉన్నామంటూ ముందుకు వచ్చారు. మనుబోలు మండలం పిడూరుపాళెం ఉజ్వల ఇంగ్లీషు మీడియం స్కూల్ చిన్నారులు రూ.11వేలు పోగుచేశారు. స్కూల్ ప్రిన్సిపాల్ చైతన్య మాట్లాడుతూ చిన్నారులు పోగుచేసిన విరాళంతో పాటు, ఉపాధ్యాయులు, ఇంకొంతమంది నుంచి విరాళాలు సేకరించి కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమలో స్కూల్ కరస్పాడెంట్ ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'రత్నం' చేయూత



నెల్లూరు (విద్య) : వరద బాధితులకు రత్నం విద్యాసంస్థల యాజమాన్యం తమ వంతుగా చేయూత అందించాయి. విద్యాసంస్థల డైరెక్టర్ కొర్రపాటి వేణుగోపాల్ తనయుడు సాయి రోహిత్ శుక్రవారం రూ.5 లక్షల చెక్కును వియజవాడలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు అందచేశారు. ఈ సందర్భంగా సీఎం వారిని అభినందించారు.

'మేకపాటి' రూ.25 లక్షలు..

నెల్లూరు (హరనాథపురం) : నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి శుక్రవారం సీఎం సహాయనిధికి రూ.25 లక్షల విరాళ డీడీని పంపారు. గతంలో రెండు తెలుగు రాష్ట్రాలకు రూ.25 లక్షల చొప్పున మేకపాటి రాజమోహన్‌రెడ్డి విరాళం ప్రకటించారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు రూ.25 లక్షల డీడీని స్పీడ్ పోస్టు ద్వారా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు పంపారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

ఘనంగా హిందీ భాషా దినోత్సవం



హిందీ అక్షర ఆకారంలో విద్యార్థులు

అనంతసాగరం, సెప్టెంబరు 13: మండలంలోని చిలకలమర్రి ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ హిందీ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అఆ ఆకారంలో హిందీ ఉచ్చరణలో విద్యార్థులు చేసిన పదర్శన ఆకట్టుకొంది. కార్యక్రమంలో హెచ్ఎం సురేష్, ఉపాధ్యాయులు మదినా, చల్లా చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సుభిక్షానికి శాంతి హోమం



శాంతిహోమంలో టీడీపీ నేత మాలేపాటి

దగదర్తి (బిట్రగుంట) సెప్టెంబరు 13: తెలుగుదేశం పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాలేపాటి సుబ్బానాయుడు శివాలయంలో శుక్రవారం శాంతిహోమం నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు పేపళ్ల కిశోర్ నాయుడు ఆధ్వర్యంలో లింగాభిషేకం, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చక బృందం, టీడీపీ కార్యకర్తలు, స్థానికులు ఉన్నారు.

గోడపత్రిక ఆవిష్కరణ

కలిగిరి, సెప్టెంబరు 13: మండలంలోని ప్రభుత్వ, ప్రైవే టు పాఠశాలలతో పాటు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ నెల 17న నులిపురుగుల నివారణకు 1-19ఏళ్ల వయసు గల విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేయనున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి బిజ్జం గీతారెడ్డి తెలిపారు. ఈ విషయంపై విద్యార్థుల తల్లిదండ్రులకు వైద్యసిబ్బంది అవగాహన కలిగించాలని సూచించారు. కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను శుక్రవారం పీహెచ్‌సీలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సాయిలక్ష్మి, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దాడి చేశారంటూ ఫిర్యాదు

కావలి రూరల్, సెప్టెంబరు 13: తనపై ముగ్గురు దాడి చేసినట్లు శుక్రవారం స్థానిక కోర్టు న్యాయవాది లింగాబత్తిన జయలక్ష్మి శుక్రవారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసుల వివరాల మేరకు.. పట్టణంలోని బుడంగుంట కాలనీలో ఉంటున్న జయలక్ష్మి ఆదేకాలనీలో గురువారం రాత్రి 11గంటల సమయంలో కోలాటం చూసి కుమారుడితో కలసి ఇంటికి నడుచు కుంటూ వెళతుంది. మార్గమధ్యలో అదే ప్రాంతానికి చెందిన షేక్ మున్నా అలియాస్ కలీం, కీర్తి అలియాస్ సోని, నవ్యలు తమ కేసు వాదించమంటే వాదించవా అంటూ అసభ్యపదజాలంతో దూషించారు. అంతటితో ఆగక మున్నా ఇటుకరాయి తీసుకుని జయలక్ష్మి తలపై కొట్టాడు. కీర్తి, సోనిలు కోలాటం కర్రలతో దాడి చేశారు. స్థానికులు బాధితురాలిని 108 అంబులెన్స్‌లో ఏరియా ఆస్పత్రిలో చేర్చారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పీహెచ్‌సీ తనిఖీ



వ్యాక్సినేషన్ నిల్వ రికార్డులను పరిశీలిస్తున్న అదనపు జిల్లా వైద్యాధికారి ఖాదర్‌వలీ

సంగం, సెప్టెంబరు 13: స్థానిక ప్రభుత్వ వైద్యశాలను అదనపు జిల్లా వైద్యాధికారి షేక్ ఖాదర్‌వలీ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వైద్యశాలలో సిబ్బంది హాజరు రిజిష్టర్‌ను పరిశీలించారు. అనంతరం బీసీజీ వ్యాక్సినేషన్, టీబీ రోగులకు అందచేస్తున్న మందుల రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట స్థానిక వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, అశోక్ కుమార్, వైద్య సిబ్బంది ఉన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

సీతారామపురం, సెప్టెంబరు 13: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసు కోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ పి లావణ్య కోరారు. సీతారామపురంలోని సెక్టార్-2 అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషకాహారంపై అవగాహన కల్పించారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తేజస్విని, అంగన్‌వాడీ కార్యకర్తలు చంద్రమ్మ, జాని, ఆదిలక్ష్మి, భవాణి, తదితరులు పాల్గొన్నారు.

ఐరన్ ఉండే ఆహారం తీసుకోవాలి

●**వలేటివారిపాలెం:** గర్భిణులు, బాలింతలు ఐరన్ ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత తెలిపారు. పోలినేనిచెరువులో శుక్రవారం పౌష్టికాహార మాసోత్సవాల సందర్భాంగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనతరం గర్భిణులకు పరీక్షలు చేయించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సురేఖ, సచివాలయ ఉద్యోగి సుజాత, అంగన్‌వాడీ కార్యకర్తలు సుబ్బమ్మ, అమరజ్యోతి పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్ ప్రారంభం

కావలి, సెప్టెంబరు 13: నిత్యం బిజీ జీవితం గడుపుతున్న ప్రజలకు కొంతసేపు మానసిక ప్రశాంతత అవసరమని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలోని ఉదయగిరి రోడ్డు పోలీస్ క్వార్టర్స్ మైదానంలో జీవన్‌సాగర్ కంపెనీ ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌ను శుక్రవారం రాత్రి కావలి ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి ప్రారంభించారు. ప్రతి స్టాల్‌ను సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ కావలిలో ఎక్కడా ఆహ్లాదంగా కొంత సేపు గడపటానికి సరైన ప్రదేశం లేదన్నారు. ఇలాంటి ఎగ్జిబిషన్లు మానసిక ఒత్తిడిలతో బిజీగా ఉన్న వారికి కొంత ప్రశాంతత కల్పించటాని ఉపయోగపడతాయన్నారు. కార్య్ కమంలో టీడీపీ నేతలు, ఎగ్జిబిషన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

కాలనీల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి

కందుకూరు, సెప్టెంబరు 13: రానున్న వర్షాకాలం నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా పట్టణంలోని అన్ని కాలనీల్లో ముందస్తుగా పారిశుధ్య పనులు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ అనూష సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆమె పట్టణంలోని పలు శివారు ప్రాంతాల మురుగుకాలువల పరిస్థితులు, కచ్చా డ్రైన్లను పరిశీలించారు.

నేడు పాఠశాలలు నిర్వహించాలి

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 13: ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలను శనివారం యథావిధిగా నిర్వహించాలని ఎంఈవో-2 తోట శ్రీనివాసులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో తుఫాన్ కారణంగా పాఠశాలలకు సెలవు ఇచ్చారని, అందుకు బదులుగా రెండో శనివారం పనిదినంగా నిర్వహించాలని డీఈవో ఆదేశాలు జారీ చేశారన్నారు.

శిథిలావస్థలో చెరువు తూము

● ఏటా నీటి ఇబ్బందులు ● రైతుల అవస్థలు



మరమ్మతులకు గురై పనిచేయని కొత్తపల్లి చెరువు తూము

అనంతసాగరం, సెప్టెంబరు 13: మండలంలోని కొత్తపల్లి చెరువు తూము శిథిలావస్థకు చేరుకుంది. తూముకు గతంలో ఏర్పాటుచేసిన చెక్క కిందకు, పైకి లేవని పరిస్థితితో రైతులకు నీటి ఇబ్బందులు నెలకొన్నాయి. ఈచెరువుకు ఉత్తర కాలువతో పాటు వర్షంతో నీటి లభ్యత చేకూరుతోంది. అయితే తూముకు ఏర్పాటు చేసిన పరికరాలు తుప్పుపట్టి కొంతకాలంగా పనిచేయడం లేదు. చెక్క కొంతమేరకు లేసి ఉండడంతో చెరువుకు నీరు చేరిన సమయంలో నీటి నియంత్రణ లేకుండా జలాలు వృథాగా పోతున్నాయి. చెరువు కింద 250 ఎకరాల ఆయకట్టు ఉండగా ప్రస్తుతం చుక్క నీరు లేదు. తూము పనిచేయక పొలాలకు నీరు అందక ఏటా వరి పంట దెబ్బతింటోంది. తూములు మరమ్మతులు చేసేందుకు ప్రస్తుతం అనుకూల సమయంగా ఉంది. త్వరలో ఉత్తర కాలువకు నీరు ఇచ్చే సూచనలు ఉన్నందున ఆలోపు మరమ్మతులు పూర్తిచేయాలని కొత్తపల్లి మాజీ సర్పంచ్ చల్లా చంద్రశేఖర్‌రెడ్డి, అన్నదాతలు కోరుతున్నారు.

వరద బాధితులకు టీడీపీ నేత ఆర్థికసాయం



మంత్రి ఆనంకు చెక్కును అందిస్తున్న వెంకటరామిరెడ్డి దంపతులు

ఏఎస్ పేట, సెప్టెంబరు 13: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి అనుమసముద్రం గ్రామనికి చెందిన టీడీపీ నాయకుడు కైపు వెంకటరామిరెడ్డి అతని భార్య సుభాషిని రూ.25వేల చెక్కును శుక్రవారం దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి అందించారు. దీంతో మంత్రి ఆనం వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పులిమి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వరద సహాయక చర్యల్లో ఎమ్మెల్యే ఇంటూరి



జక్కంపూడి కాలనీలో పర్యవేక్షిస్తున్న ఇంటూరి

కందుకూరు, సెప్టెంబరు 13: కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఐదురోజులుగా విజయవాడ మండలం జక్కంపూడి కాలనీలో వరద బాధితుల సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. వరదనీరు, బురద తొలగింపు పనులు, బాధితులకు నిత్యావసరాలు అందేలా చర్యలు తీసు కుంటున్నారు. అలాగే ఇంటింటా నష్టం అంచనాలు వేస్తున్న ఎన్యూమ రేషన్ అధికారులను సమన్వయం చేసుకుంటూ బాధితులందరికీ న్యాయం జరిగేలా ఎమ్మెల్యే ఇంటూరి ప్రత్యేక చొరవ తీసుకున్నారని టీడీపీ కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆయన కృషికి బాధితుల నుంచి కృతజ్ఞతలతో పాటు సీఎం చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌ల నుంచి ప్రశంసలు కూడా దక్కాయని తెలిపారు.

ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న డీఎల్‌డీవో పద్మజ

వరికుంటపాడు, సెప్టెంబరు 13: మండలంలో పక్కాగృహాలు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కందుకూరు డీఎల్‌డీవో పద్మజ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం బిల్లులను సకాలంలో మంజూరు చేస్తుండడంతో రెండు నెలల్లో ప్రక్రియను పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే వ్యక్తిగత మరుగుదొడ్లకు ప్రత్యేకంగా అదనపు నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం భోగ్యంవారిపల్లి ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మల్లికార్జున, ఏపీవో అజమ్‌ఖాన్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ నాయబ్‌రసూల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై బహిరంగ విచారణ



విచారణ చేపడుతున్న అధికారులు

కొండాపురం, సెప్టెంబరు 13: మండలంలో 2023 ఏప్రిల్ నుండి 2024 మార్చి వరకు జరిగిన ఉపాధి పనులపై మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం బహిరంగ విచారణ చేపట్టారు. 566పనులకు రూ.15.67 కోట్ల నిధులు ఖర్చు చేయడం జరిగిందని అధికారులు తెలిపారు. బహిరంగ విచారణలో పనులకు సంబంధించిన ఫోటోలు లేకుండా కొలతల వ్యత్యాసం, కూలీలు గ్రాడ్యుయేట్స్ అయినా వారి పేరు మీద వేలిముద్రలు వేసి ఉండటం, పని ప్రదేశంలో కాకుండా మరోచోట చేయడం, ఒక జాబ్‌కార్డు పేరుమీద మరొకరు పనిచేయడం తదితర విషయాలను తనిఖీ సిబ్బంది గుర్తించారు. అన్ని గ్రామాల్లోను పనులు చేయకుండా నగదును లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయినట్లు తేల్చారు. సామాజిక తనిఖీ బహిరంగ విచారణ కొనసాగుతుండటంతో పూర్తి వివరాలను శనివారం వెల్లడిస్తామని అధికారులు తేల్చారు. కార్యక్రమంలో అడిషనల్ పీడీ విజయలక్ష్మి, సోషల్ ఆడిట్ ప్రోగ్రాం మేనేజర్ సునీల్‌కుమార్, ఎస్టీఎం పోలయ్య, డీడీఓ విజయలక్ష్మి, క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ వేణుగోపాల్, ఏపీడీ గాయత్రీదేవి, అంబుడ్స్‌మెన్ వెంకటరెడ్డి, ఎంపీడీఓ బ్రహ్మయ్య, ఏపీఓ చెంచయ్య, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నేతలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కందుకూరు, సెప్టెంబరు 13: నియోజకవర్గ టీడీపీ నేతలను మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు పరామర్శించారు. ప్రకాశం జిల్లా డెయిరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు మాతృమూర్తి లక్ష్మమ్మ ఓగూరులో గురువారం రాత్రి మృతిచెందారు. టీడీపీ పట్టణ మాజీఅధ్యక్షుడు కంద్రా మాల్యాద్రి తండ్రి సోమయ్య గురువారం సాయంత్రం చుట్టుగుంటలో మృతిచెందారు. దీంతో పోతుల రామారావు శుక్రవారం వారి నివాసాలకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన వెంట స్థానిక నేతలు మాధవరావు, కంద్రా హరిబాబు, బెజవాడ ప్రసాద్, కంద్రా మాలకొండయ్య నల్లూరి వీరరాఘవులు ఉన్నారు.

ఆలయ నిర్మాణంలో భాగస్వామ్యం కల్పించాలి

● ఆర్డీవోకు దళితుల వినతి

కావలి, సెప్టెంబరు 13: సిరిపురం-నారాయణపురం మ్యలో ఉన్న ఎస్సీ, ఎస్టీ కాలనీల వద్ద నిర్మిస్తున్న శ్రీకృష్ణ ఆలయ నిర్మాణంలో తమకు భాగస్వామ్యం కల్పించాలని ఎస్సీ, ఎస్టీలు శుక్రవారం కావలి ఆర్డీవో శీనానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. దళిత సంఘర్షసమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి మాట్లాడారు. ప్రభుత్వ స్థలంలో యాదవులు నిర్మించే ఆలయలో ఎస్సీ, ఎస్టీలకు భాగస్వామ్యం కల్పించమని, తదుపరి ఆలయంలోకి రానివ్వమని చెపుతున్నట్లు వినతిలో పేర్కొన్నారు. కార్యక్రమంలో పాలకీర్తి వెంకటరావు, ఆలూరి బ్రహ్మయ్య, రమేష్, తిరుపతయ్య పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేయాలి



సభ్యత్వ నమోదులో పాల్గన్న బీజేపీ నాయకులు

చేజర్ల, సెప్టెంబరు 13: మండలంలో భారతీయ జనతా పార్టీని బలోపేతం చేసేందుకు నాయకులందరూ కృషిచేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని వావిలేరు, మాముడూరు గ్రామాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బత్తల కిష్టయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుంకు బాలయ్యనాయుడు, బీజేపీ మండల అధ్యక్షుడు గుండాల విజయభాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

స్వచ్ఛతాహీ సేవను విజయవంతం చేయండి

ఆత్మకూరు, సెప్టెంబరు 13: మండలంలోని అన్ని గ్రామాల్లో ఈనెల 17వ తేదీ నుంచి అక్టోబరు 2 వరకు స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించడం, పరిశుభ్రత కార్యక్రమాలు విధిగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

●**బిట్రగుంట:** గ్రామ పంచాయతీలో ఈ నెల 17 నుంచి అక్టోబరు 2 వరకు నిర్వహించే స్వచ్ఛతాహీ సేవ పారిశుధ్య కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎంపీడీవో వెంకటసుబ్బారావు కార్యదర్శులకు కోరారు. శుక్రవారం ఎంపీడీవో సమావేశ భవనంలో వారికి పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి విస్తరణ అధికారి జహీర్ ఉన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, విద్యుత్‌శాఖ అధికారులు

కావలి, సెప్టెంబరు 13: విద్యుత్ ప్రమాదాల నివారణ చర్యలను కరపత్రాలతో ప్రజలకు అవగాహన కల్పించటం మంచి కార్యక్రమం అని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. ముసునూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం విద్యుత్‌శాఖ అధికారులతో కలిసి ఆయన విద్యుత్‌ప్రమాదాల నివారణ చర్యల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ అధికారులు మాట్లాడారు. ప్రజలు తడిచేతులతో విద్యుత్ స్విచ్‌లను ఆన్, ఆఫ్ చేయరాదని, తెగిపడి ఉన్న విద్యుత్ తీగలను తాకరాదని, పొలాల చుట్టూవేసే కంచకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వరాదన్నారు. చేపల-రొయ్యల గుంటలు, చెరువుల చుట్టూ నేలపై విద్యుత్ వైర్లను వేయరాదని తదితర 16 జాగ్రత్తలను కరపత్రాలతో తెలియజేశారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ కావలి ఈఈ బెనర్జీ, ఇన్‌చార్జి డీఈ శ్రీనివాసులు రెడ్డి, ఏఈ వసంతరావు, కమర్షియల్ ఏఈ అనంతరావు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే

లింగసముద్రం, సెప్టెంబరు 13: పెంట్రాల యూపీ పాఠశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ విద్యా సంవత్సరంలో కొత్తగా 19మంది విద్యార్థులు చేరినట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు తెలిపారు. విద్యార్థులు దేశభక్తి గీతాలు ఆలపించి, నృత్యాలతో అలరించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, సంధ్యారాణి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 13: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో సభ్యులుగా ఉన్న రైతులంతా ఆధార్‌కార్డు, వ్యవసాయ భూమి వివరాలు అందజేసి ఈనెల 25వ తేదీ లోపు ఈకేవైసీ చేయించుకోవాలని పర్సన్ ఇన్‌చార్జి శ్రీనివాసరెడ్డి, సీఈవో లోక్‌నాథ్‌రెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక కమ్మవారిపాళెం సొసైటీ భవనంలో పీఏసీఎస్ మహాజన సభ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సంఘంలో సభ్యులుగా ఉండి చనిపోయిన, పొలం లేని వారిని తొలగించడం జరుగుతుందన్నారు. సంఘం జమా ఖర్చులు పరిశీలించి ఆమోదించడం జరిగిందన్నారు. షేరు ధనాన్ని రూ.2 కోట్లకు పెంచుతూ బైలా తయారు చేయాల్సిందిగా తీర్మానం చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నా దృష్టంతా నియోజకవర్గ అభివృద్ధిపైనే : ఎమ్మెల్యే కాకర్ల

● కమ్మవారిపాలెంలో కార్యకర్తలతో ముఖాముఖీ

జలదంకి, సెప్టెంబరు 13: ఇకనుంచి తన దృష్టంతా నియోజకవర్గం అభివృద్ధిపైనే ఉంటుందని ఆ దిశగా తాను చర్యలు తీసుకుంటానని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. గురువారం రాత్రి ఆయన కమ్మవారిపాలెంలో పర్యటించారు. గ్రామ టీడీపీ నేత కరియావుల అప్పలయ్యనాయుడు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు గ్రామ పొలిమేరలో ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి నాయకులు, కార్యకర్తలతో ముఖాముఖీ నిర్వహించారు. ఇప్పటినుంచి ఎవరికి ఏ ఇబ్బంది వచ్చినా నిస్సందేహంగా వచ్చి తనను కలవొచ్చిని తెలిపారు. ఐదేళ్ల వైసీపీ దురహంకార పాలనలో మీరు ఎంత నలిగిపోయారో, ఎన్ని అవమానాలు పొందారో, ఎంతెంత ఆస్తులు పోగొట్టుకున్నారో తనకు తెలుసు అన్నారు. కార్యకర్తలందరినీ గుండెల్లో పెట్టుకుని చూసుకునే బాధ్యత తనపైనే ఉందన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉండి కూటమి ప్రభుత్వానికి మంచిపేరు తెచ్చేలా కృషిచేయాలన్నారు. అభివృద్ధిలో వెనుబడ్డ ఉదయగిరిని ముందంజకు తీసుకువచ్చేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త తనకు అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు మధుమోహన్‌రెడ్డి, కూటమి నేతలు జయచంద్రారెడ్డి, బాస్కర్‌రెడ్డి, తిరుమలరెడ్డి, మాల్యాద్రియాదవ్, శ్రీనాద్‌రెడ్డి, ఎంపీపీ గోచిపాతల వెంకటరమణయ్య, జిల్లా తెలుగు మహిళ మాజీ అధ్యక్షురాలు పొత్తూరి శైలజ పాల్గొన్నారు.



పీహెచ్‌సీ రికార్డులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

పీహెచ్‌సీ, ఆర్టీసీ బస్టాండ్‌లో తనిఖీలు

జలదంకి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, ఆర్టీసీ బస్టాండ్‌లో తనిఖీలు నిర్వహించారు. రోజువారీ ఓపీ వివరాలపై సిబ్బందిని ప్రశ్నించి రికార్డులను పరిశీలించారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. ఆర్టీసీ బస్టాండులో ఎక్కడ చూసినా ఫ్లెక్సీలు దర్శనమివ్వడంతో ఆర్టీసీ డీఎంతో ఫోనులో మాట్లాడి బస్టాండులో ప్రయాణికులు కూర్చునేలా చర్యలు తీసుకోవాలని, ఫ్లెక్సీలు వెంటే తొలగించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట పార్టీ మండలాధ్యక్షుడు మధుమోహన్‌రెడ్డి ఉన్నారు.

ఘనంగా గణేష్ ఉత్సవాలు



ఆకర్షణీయంగా ముఖద్వారం

కావలి టౌన్, సెప్టెంబరు 13: పట్టణ కలుగోళ శాంభవి ఆలయ ప్రాంగణంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరుగుతున్న గణేష్ ఉత్సవాలు శోభాయమానంగా జరుగుతున్నాయి. పెద్దఎత్తున భారీ సెట్టింగులతో అలంకరించిన విద్యుదీపాలంకరణ భక్తులను కనువిందు చేస్తుంది. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సెట్టింగులో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. నవరాత్రులు సాయంత్రం 7గంటల నుంచి అర్చక బృందంతో దశ హారతులు ఇస్తున్నారు. సరస్వతీ, నవదుర్గా, రుద్రాభిషేకాలు, కాత్యాయని వ్రత పూజలు, లక్ష్మీ కుబేర పూజ, దక్షిణమూర్తిపూజలు, అష్టలక్ష్మీ దేవతలకు కుంకుమ పూజలు చేస్తున్నారు. వరసిద్ధి స్వామి వారికి కల్యాణ మహోత్సవం పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

కోలాహలంగా నిమజ్జనోత్సవం

కావలి రూరల్, సెప్టెంబరు 13: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా 7వ రోజైన శుక్రవారం విగ్రహాల నిమజ్జనం చేపట్టారు. ప్రత్యేక పూజల అనంతరం గణపయ్యను పూలతో అలంకరించిన వాహనాల్లో ఎక్కించి మేళ తాళాలు, డప్పుచప్పుళ్లు, డీజే వాయిద్యాల నడుమ వీధుల్లో ఊరేగించారు. తుమ్మలపెంట, కొత్తసత్రం, పెదపట్టపుపాలెం తీర ప్రాంతాల్లో ఈ వేడుకలతో సందడి నెలకొంది.

సీతారాం ఏచూరి మృతి తీరని లోటు



ఉదయగిరి రూరల్: ఏచూరికి నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 13: భారత కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పార్టీకి తీరని లోటని సీపీఎం జిల్లా నాయకుడు కాకు వెంకటయ్య పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ నాయకులు ఫరుద్దీన్‌బాషా, తిరుపతయ్య, షేక్ నాయబ్, గడ్డం నాగేశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

●**గుడ్లూరు :** నేటితరం ఉద్యమ నాయకులకు వామపక్షాల వెలుగురేఖ కామ్రేడ్ సీతారాం ఏచూరిని ఆదర్శంగా తీసుకుని పోరాటాలు కొనసాగించాలని గుడ్లూరు సీపీఎం మండల కన్వీనర్ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక హైస్కూల్ ప్రాంగణంలో ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మద్దిశెట్టి జాలయ్య, దామా కృష్ణయ్య, కొమరగిరి అంజయ్య, సుంకరి విజయలక్ష్మి, మెగిలిశెట్టి వెంకటేశ్వర్లు, పాలకీర్తి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

●**బిట్రగుంట:** బోగోలు మండలం సీపీఎం కార్యాలయంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి సీపీఎం మండల కార్యదర్శి తుమ్మల వెంకయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంక టేశ్వర్లు, సీఐటీయు కార్యదర్శి చల్లా నరహరి, కామ్రేడ్స్ కొమరం బుజ్జమ్మ, డమ్ము శంకరయ్య, బ్రహ్మయ్య, యానాదయ్య, పీ.శ్రీనివాసులు, బాదుల్లా ఉన్నారు.

దేశ సమగ్రతకు క్రీడలు దోహదం : ఆర్డీవో

● విట్స్‌లో రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ ఫెస్ట్ ప్రారంభం



క్రీడాజ్యోతిని అందిస్తున్న ఆర్డీవో శీనానాయక్

కావలిటౌన్, సెప్టెంబరు 13: దేశ సమగ్రతకు క్రీడలు దోహదం చేస్తాయని ఆర్డీవో శీనానాయక్ తెలిపారు. గురువారం విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో విశ్వోత్సవ్ 2కె 24వేడుకలు ఘనంగా ప్రారంభమైయ్యాయి. విట్స్ చైర్మన్ దొడ్ల విద్యాధర్ కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో మూడురోజులు జరుగనున్న వేడుకల్లో భాగంగా రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ ఫెస్ట్‌ను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్డీవో ముందుగా క్రీడా జ్యోతి వెలిగించి క్రీడాకారుడికి అందజేశారు. కావలిలో రాష్ట్రస్థాయి ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులతో క్రీడల పోటీలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. విశ్వోదయా రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ప్రత్యూషారెడ్డి, ప్రిన్సిపాల్ శేషయ్య, వైస్ ప్రిన్సిపాల్స్ సునీల్, శ్రీనాథ్, పీడీలు భాస్కర్, జోసఫ్, ఏడుకొండలు, ఆర్.మాల్యాద్రి పాల్గొన్నారు.

రాళ్లపాడు ప్రాజెక్టులో
కోళ్ల వ్యర్థాలు వేయడం అవాస్తవం

లింగసముద్రం, సెప్టెంబరు 13: సాగు, తాగు నీటికి చెందిన రాళ్లపాడు ప్రాజెక్టులో కోళ్ల వ్యర్థాలను వేస్తున్నామనడంలో వాస్తవం లేదని పెదపవని మత్స్యకార సొసైటీ నాయకులు రమణయ్య, ఓగూరు శ్రీనులు తెలిపారు. ఈ విషయంపై శుక్రవారం వారు లింగసముద్రంలో మాట్లాడారు. రాళ్లపాడు రిజర్వాయర్‌లో చేపలు పెంచుకుంటూ జీవనం సాగిస్తున్న తమపై లేనిపోని ఆరోపణలు చేయడం తగదన్నారు. తమ పూర్వికుల నుంచి ప్రాజెక్టును నమ్ముకొని జీవిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం తమ సొసైటీలో 180 మంది సభ్యులు ఉన్నారని పేర్కొన్నారు. వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని లేకపోతే మత్స్యకారుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు మల్లికార్జున, ఏడుకొండలు, శ్రీనివాసరావు, వెంకటేష్, రమణయ్య, వెంగయ్య, హనుమంతు, సింహాద్రి పాల్గొన్నారు.

రామన్నచెరువులో ఆక్రమణలు తొలగించండి

● కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ



ఆక్రమణలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

వలేటివారిపాలెం : స్థానిక రామన్నచెరువులో ఆక్రమణలను వెంటనే తొలగించాలని కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆక్రమణలో రామన్న చెరువు అన్న ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి సబ్ కలెక్టర్ స్పందించి చెరువు ఆక్రమణలను పరిశీలించారు. లోతట్టు ప్రాంతంను ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వెంటనే చెరువును సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. ఆమె వెంట మండల సర్వేయర్ వెంకటేశ్వర్లు, వీఆర్వో నరేంద్ర ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్) : నర్రవాడ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు 11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ వెంకటసుబ్బయ్య శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.